RNI NO.APTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 23.04.2024 | సంపుటి : 10 సంచిక : 284 | పేజీలు : 12 వెల: రూ. 4/-

Follow :

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

త్వరలో 'పది' ఫలితాలు

పదిరోజుల్లో వెలువడే అవకాశం

ఈసీ అనుమతితో అధికారుల కసరత్తు

విరబూసిన 'పద్మా'లు

వెంకయ్యనాయుడు, చిరంజీవిలకు పద్మవిభూషణ్ ప్రదానం

- ఘనంగా 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం
- పురస్కారాలను అందజేసిన రాష్ట్రపతి ముర్ము

దిల్లీ(జనంసాక్షి): భారత గణతంత్ర్య దినోత్సవం వేళ దేశంలోని పలు రంగాలకు చెందిన ప్రముఖులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ అవార్డులను అందజేసి గౌరవించారు. ఈ ఏడాది మొత్తం 132 'పద్మ' పురస్కారాలను

మిగతా 2లో..

భాజపా బోణి

గుజరాత్‌లోని సూరత్ స్థానాన్ని చేజిక్కించుకున్న కమలం

ప్రత్యర్థుల నామినేషన్ల తిరస్కరణతో పార్టీ అభ్యర్థి ముకేశ్ దలాల్ ఏకగ్రీవ ఎన్నిక

న్యూఢిల్లీ(జనంసాక్షి): సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడక ముందే బీజేపీ ఖాతాలో తొలి విజయ వచ్చి చేరింది. గుజరాత్ లోని సూరత్ స్థానం ఏకగ్రీవం కానుంది. ఈ నియోజకవర్గం నుంచి బీజేపీకి పోటాగా కాంగ్రెస్ అభ్యర్థి దాఖలు

మిగతా 2లో..

మతోన్మాదులను తరిమికొట్టండి

భాజపా అవినీతిపై ఈటల ఎందుకు ఫిర్యాదు చేయడం లేదు?

మోదీ, కేసీఆర్ ఇద్దరూ తోడు దొంగలే • గెలుపు కోసం వారిద్దరి మధ్య చీకటి ఒప్పందం

- రాజకీయాల్లో పడిపోతున్న నాకు అండగా నిలిచింది మాల్కాజిగిరి ప్రజలు,కార్యకర్తలే
- పత్తాలేని పసుపు బోర్డు
- ఏర్పాటులో నిజామాబాద్ పేరెక్కడ?
- చక్కెర పరిశ్రమను పునరుద్ధరిస్తాం
- సెప్టెంబర్ 17లోపు ప్రక్రియ పూర్తి చేస్తాం
- తుమ్మిడిహట్టిలో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు
- కుప్టి ప్రాజెక్టు నిర్మిస్తే ఆదిలాబాద్ సస్యశ్యామలం .. కొత్త యూనివర్సిటీ ఏర్పాటు
- మల్కాజిగిరి,నిజామాబాద్,ఆదిలాబాద్ కాంగ్రెస్ జనజాతర సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నిజామాబాద్,ఆదిలాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో తిష్టవేసుకున్న మతోన్మాదులను తరిమికొట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.భాజపా అవినీతిపై ఆ పార్టీ అభ్యర్థి ఎందుకు ఫిర్యాదు చేయలేదని ఆయన ప్రశ్నించారు.సెప్టెంబర్ 17లోపు చక్కెర పరిశ్రమను పున రుద్ధరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'జనజాతర' సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు.పసుపు బోర్డు ఏర్పాటుపై మోదీ ఇచ్చిన ప్రకటనలో ఎక్కడా నిజామాబాద్ పేరు లేదన్నారు. నిజామాబాద్‌లోనే బోర్డు ఏర్పాటు అని స్పష్టంగా చెప్పకుండా నోట్ విడుదల చేశారని విమర్శించారు. ఎన్నికలు అయ్యాక బోర్డును ఎక్కడ ఏర్పాటు చేస్తారో తెలియ దన్నారు."నిజామాబాద్ అంటే నాకు ప్రత్యేక అభిమానం. అధికారంలోకి రాగానే చక్కెర పరిశ్రమలు పునరుద్ధరణ గురించి ఆలోచించాం. ఇందు కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశాం. కవిత ఎంపీగా

మిగతా 2లో..



పసుపు బోర్డు ఏర్పాటుపై మోదీ ఇచ్చిన ప్రకటనలో ఎక్కడా నిజామాబాద్ పేరు లేదు. నిజామాబాద్‌లోనే బోర్డు ఏర్పాటు అని స్పష్టంగా చెప్పకుండా నోట్ విడుదల చేశారు. సెప్టెంబర్ 17 లోపు చక్కెర పరిశ్రమను పునరుద్ధరిస్తాం

– నిజామాబాద్‌లో సభలో రేవంత్‌రెడ్డి

నాగోబా జాతరకు రూ.4 కోట్లు కేటాయించ'ను న్నాం. కుప్టి ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్‌ను సస్యశ్యామలం చేస్తాం. తుమ్మిడిహట్టిలో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కడతాం.. దానికి బీఆర్ అంబేద్కర్ పేరు పెడతాం. ఆదిలాబాద్‌లో కొత్త యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం.

– ఆదిలాబాద్ సభలో రేవంత్‌రెడ్డి

రాజకీయాల్లో పడిపోతున్న తనకు కేసీఆర్‌తో పోరాడేంత బలం ఇచ్చింది.. మాల్కాజిగిరి ప్రజలు, పార్టీ కార్యకర్తలే.. ఇక్కడ ఎంపీగా చేసిన పోరాటంతోనే పీసీసీ అధ్యక్ష పదవి, ముఖ్యమంత్రి పదువులు వచ్చాయి.ఈ నియోజకవర్గాన్ని నేనెప్పుడూ మర్చిపోను. కొడంగల్‌లో ఓడిపోతే ఇక్కడ ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించారు

– మాల్కాజిగిరి సభలో రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్ మేనిఫెస్టోపై బహిరంగ చర్చకు సిద్ధం

- ప్రధాని మోదీకి ఖర్గే సవాల్
- రాజ్యాంగాన్ని మార్చేందుకే.. '400 సీట్ల' ప్రచారమని వ్యాఖ్య

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి 400 స్థానాలను కైవసం చేసు కోవాలని ప్రధాని మోదీ పిలుపునిస్తోన్న విషయం తెలిసిందే.దీనిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మరోసారి విమర్శలు గుప్పించారు. రాజ్యాంగాన్ని మార్చడానికి అవసరమైన మూడోవంతు మెజార్టీ లక్ష్యంగానే ఆ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కర్ణాటకలోని చన్నపట్నంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ మేనిఫెస్టోపై బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. తమ ఎన్నికల హామీలు ముస్లింలీగ్ ఆలోచనను ప్రతిబింబిస్తున్నాయని ప్రధాని మోదీ చెప్పడంపై ఖర్గే మండిపడ్డారు. 'మూడింట రెండొంతుల మెజార్టీ కోసం మోదీ చూస్తున్నారు. రాజ్యాంగాన్ని మార్చాలంటే ఈ మెజార్టీ కావాలి. అందుకే 400 సీట్లు రావాలని మోదీ పిలుపునిస్తున్నారు' అని ఖర్గే పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటనలు చేస్తోన్న ఆర్ఎస్ఎస్, భాజపా నేతలను ప్రధాని ఎందుకు అడ్డుకోవడం లేదన్నారు. వారి మనసులోనే

మిగతా 2లో..

కేజ్రీవాల్ ఆరోగ్యంపై మెడికల్ బోర్డు

దిల్లీ ఏయిమ్స్‌ను ఆదేశించిన కోర్టు

దిల్లీ(జనంసాక్షి): మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం తిహాడ్ జైల్లో ఉన్నారు.టైప్-2 డయాబెటీస్‌తో బాధపడుతున్న ఆయన ఆరోగ్య సేవలపై తీవ్ర చర్చ కొనసాగుతోంది. ఈక్రమంలోనే తన వైద్యుడితో రోజూ వీడియో మాధ్యమంలో సంప్రదించే అవకాశాన్ని కల్పించాలని ఆయన చేసిన అభ్యర్థనను కోర్టు తాజాగా

మిగతా 2లో..

కవిత బెయిల్‌పై విచారణ వాయిదా

హైదరాబాద్,ఏప్రిల్ 22(జనంసాక్షి): లిక్కర్ పాలసీ కేసులో అరెస్ట్ అయి ప్రస్తుతం జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవితకు మరో బిగ్ షాక్ తగిలింది. లిక్కర్ పాలసీ ఈడీ కేసులో కవిత బెయిల్ పిటిషన్ పై విచారణను కోర్టు రేపటికి వాయిదా వేసింది. ఇరువురి వాదలను విన్న ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును రేపటికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. కాగా, సీబీఐ కేసులో కూడా కవితకు తీవ్ర నిరాశ ఎదురైంది. లిక్కర్ పాలసీ కేసులో భాగంగా

మిగతా 2లో..

బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలతపై కేసు నమోదు

ఆమెతో ఏఎస్సై ఆలింగనం..

సస్పెండ్ చేసిన సీపీ

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి మాధవీలతపై కేసు నమోదైంది. ప్రచారంలో ఓ వర్గం మనోభావాలు దెబ్బ తీసేలా ప్రవర్తించారంటూ 'ఫస్ట్ లాన్సర్' సంస్థకు

మిగతా 9లో..

గ్యారెంటీలపై శ్వేతపత్రం విడుదల చేయండి:హరీశ్

సంగారెడ్డి(జనంసాక్షి): సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు సవాల్ విసిరారు. ఆగస్టు 15 లోపు రూ. 39 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేయకపోతే సీఎం పదవికి రాజీనామా చేస్తావా అని ప్రశ్నించారు. ఇప్పటివరకు రైతుబంధు పూర్తిగా ఇవ్వలేదు కానీ ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తా అంటున్నాడని ఎద్దేవా చేశారు. మీరిచ్చిన ఆరు గ్యారెంటిలే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మీకు భస్మాసురహస్తం అవుతాయని హరీష్ రావు హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో హరీష్ రావు సమావేశం నిర్వహించారు. రైతురుణమాఫీ, రైతు భరోసా, ధాన్యానికి బోనస్, ఆసరా పెన్షన్ పెంపు, మహిళలకు 2,500 రూపాయల సహాయం, కళ్యాణాలక్ష్మి కి తులం బంగారం, నిరుద్యోగ భృతిపై

మిగతా 2లో..

ముయిజ్జు అనుకూలుడికే పట్టం..

మాల్దీవుల పార్లమెంట్ ఎన్నికల్లో పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ భారీ విజయం

మాలే(జనంసాక్షి): మాల్దీవుల పార్లమెంటరీ ఎన్నికల్లో అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జుకు చెందిన పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ భారీ మెజార్టీతో విజయం సాధించింది. మొత్తం 93 స్థానాలకు గాను 70 సీట్లను కైవసం చేసుకుంది. ముయిజ్జుకు అగ్నిపరీక్షగా నిలిచిన ఈ

మిగతా 2లో..

26 వేల మంది ఉద్యోగాలు

ఊస్ట్..

బెంగాల్‌లో 2016 నాటి ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ చెల్లదు

వారి ఏనిమిదేళ్ల జీతాలు వెనక్కి ఇవ్వాలి

కలకత్తా హైకోర్టు సంచలన తీర్పు

తీర్పును సవాల్ చేస్తాం : సీఎం మమత

కోల్‌కతా(జనంసాక్షి): పశ్చిమ బెంగాల్ రాజకీయాలను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణం వ్యవహారంలో కలకత్తా హైకోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. 2016 నాటి స్టేట్ లెవల్ సెలక్షన్ టెస్ట్ నియామక ప్రక్రియ చెల్లదని స్పష్టం చేసింది. ఆ పరీక్షతో జరిపిన నియామకాలను తక్షణమే రద్దు చేయాలని

మిగతా 2లో..

ప్రజల పక్షాన కొట్లాడుదాం

బలమైన ప్రతిపక్షంగా ఉన్నాం సమిష్టిగా కృషి చేస్తే కరీంనగర్ పార్లమెంట్ మనదే

కాంగ్రెస్ ప్రభుత్వంపై జనంలో నమ్మకం పోయింది • బండి సంజయ్‌పై వ్యతిరేకత ఉంది

మే 10న సిరిసిల్లలో కేసీఆర్ రోడ్ షో • ఎన్నికలపై పార్టీ శ్రేణులకు కేటీఆర్ దిశా నిర్దేశం

హైదరాబాద్(జనంసాక్షి): ప్రజల సమస్యలే ఎజెండాగా, కాంగ్రెస్, బీజేపీ మోసాలను ఎండగడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కొట్లాడుదామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సిరిసిల్ల తెలంగాణ భవన్ లో సోమవారం సిరిసిల్ల పట్టణ క్లస్టర్ స్థాయి సమావేశంలో పాల్గొని పార్లమెంటు ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో చాలా స్థానాల్లో స్వల్ప మెజారిటీ తేడాలో కాంగ్రెస్ విజయం సాధించింది. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పై వంద రోజుల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. పార్లమెంటు ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీకే విజయావకాశాలు మెండుగా ఉన్నాయి. కాంగ్రెస్ కు ఓటు వేయకపోతే ఫ్రీ బస్సు తీసేస్తాం అంటున్నరు. ప్రజలు ఆలోచన చేస్తున్నారు. కాంగ్రెస్ మోసపు హామీలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి. ఐదేళ్లు ఎంపీగా ఉన్న బండి సంజయ్ కరీంనగర్ కు చేసిందేమీ లేదు. ఐదేళ్లలో ఒక్క పాఠశాల, ఒక్క కళాశాల తీసుకొచ్చాడా ? ఒక్క గుడి కట్టాడా ? ఒక్క పరిశ్రమనైనా తీసుకొచ్చార. ఒక్క రూపాయి పని చేయని బండి సంజయ్ కు ఓట్లు

మిగతా 2లో..

ప్రజల సంపదను కాంగ్రెస్ లాక్కుంటుంది

రాహుల్ 'సంపద పునఃపంపిణీ' ప్రకటనపై మోదీ వ్యాఖ్యలు

లఖ్‌నవూ(జనంసాక్షి): ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రెండు ఇళ్లు ఉన్న వారి నుంచి ఒక ఇంటిని లాక్కుంటుందని ప్రధాని మోదీ అన్నారు. ఇటీవల కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన 'సంపద పునఃపంపిణీ' ప్రకటనను ఉద్దేశిస్తూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.సోమవారం ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌లో నిర్వహించిన పార్టీ బహిరంగ ర్యాలీలో మోదీ పాల్గొని ప్రసంగించారు."కాంగ్రెస్ యువరాజు తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీకు ఎంత ఆస్తి ఉంది, ఎన్ని ఇళ్లు ఉన్నాయి అని విచారణ జరుపుతా మన్నారు. మీకు పూర్వీకుల ఇల్లు ఉండి, మరో ఫ్లాట్ కూడా ఉంటే వాటిలో ఒకటి లాగేసుకుంటారు. ఇది మావోయిస్టు, కమ్యూనిస్టు భావజాలం. వాటినే

మిగతా 2లో..

తెలంగాణలో అధికారం భాజాపాదే..

పీయూష్ గోయల్ ధీమా

చేవెళ్ల(జనంసాక్షి): తెలంగాణలో హైదరాబాద్ సహా మెజార్టీ స్థానాల్లో భాజపా గెలువబోతుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.దేశంలో ఎన్డీయే కూటమి 400కు పైగా సీట్లు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ పాలనలో

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
23.04.2024

చల్లని కబురు..

మూడు రోజుల పాటు వర్షాలు

హైదరాబాద్(జనంసాక్షి): తీవ్ర ఎండలతో ఉక్కిరి బిక్కిరవుతున్న తెలంగాణ ప్రజలకు చల్లని కబురు. రానున్న మూడు రోజులపాటు రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది.ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. గంటకు 30కి.మీ నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

మా మేనిఫెస్టోపై

బహిరంగ చర్చకు సిద్ధం

అది ఉందని, అదే జరగాలని కోరుకుంటున్నందువల్లే అటువంటి నేతలపై చర్యలు తీసుకోవడం లేదన్నారు.తమ మేనిఫెస్టోను ముస్లిం లీగ్‌తో పోల్చడంపైనా ఖర్గే విరుచుకుపడ్డారు. యువతకు ఉద్యోగాలు, రైతులకు కనీస మద్దతు ధర వంటివి ఇవ్వడం ముస్లిం లీగ్ కిందకు వస్తాయా? అని ప్రశ్నించారు. దీనిపై బహిరంగ చర్చకు తాను సిద్ధమన్నారు. 1989 నుంచి గాంధీ కుటుంబీకులు ఎవరూ ప్రధానిగా, ముఖ్యమంత్రిగా కొనసాగలేదని చెప్పారు. అయినప్పటికీ గాంధీ కుటుంబంపై మోదీ మాత్రం విమర్శలు ఆపడం లేదన్నారు. మోదీ 'హిట్ అండ్ రన్' లాంటి వారని, స్థిరంగా నిలబడి సమస్యలపై చర్చించాలని వ్యంగ్యాస్త్రాలు విసిరారు.

కేజ్రీవాల్ ఆరోగ్యంపై

మెడికల్ బోర్డు

తోసిపుచ్చింది. ఆయనకు క్రమంతప్పకుండా ఇన్సులిన్ అవసరమా?, ఇతర ఆరోగ్య సమస్యలేమైనా ఉన్నాయా? అని పరీక్షించేందుకు వైద్యుల కమిటీని ఏర్పాటుచేయా లిందిగా దిల్లీ ఎయిమ్స్‌ను ఆదేశించింది.అంత కుముందు తిహాడ్ జైలు సూపరింటెండెంట్‌కు కేజ్రీవాల్ లేఖ రాశారు. మధుమేహం దృష్ట్యా రోజూ ఇన్సులిన్ అడు గుతున్నట్లు స్పష్టంచేశారు. పైగా.. తన డయాబెటీస్ పరిస్థితి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎయిమ్స్ వైద్యులు ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఎయిమ్స్ డాక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడినప్పుడు ఇన్సులిన్ విషయాన్ని కేజ్రీవాల్ లేవనెత్తలేదని, వైద్యులు కూడా సూచించలేదని జైలు అధికారులు ప్రకటిం చిన నేపథ్యంలో ఈమేరకు స్పందించారు. జైలు అధికారులు చెప్పిందంతా అబద్ధమని, రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో తప్పుడు ప్రకటన విడుదల చేశారని ఆరోపించారు."10 రోజులుగా ఇన్సులిన్ అడుగుతున్నా ను. నన్ను చూసేందుకు వచ్చిన ప్రతీ వైద్యుడికి అధిక షుగర్ లెవల్స్ చూపించాను. అత్యధికంగా 250- 320 మధ్య నమోదవుతోంది. ఉదయం ఏమీ తినకముందు 160-200 స్థాయిలో ఉంటోంది. రోజూ ఇన్సులిన్ కోసం విజ్ఞప్తి చేసినప్పటికీ.. అడగలేదని ఎలా అంటారు?" అని దిల్లీ సీఎం ప్రశ్నిం చారు. ఆరోగ్య కారణాల కింద బెయిల్ పొందేందుకే ఆయన చక్కెర స్థాయి లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకుంటున్నారని ఈడీ ఇటీవల ఆరోపించిన విషయం తెలిసిందే. మరోవైపు.. ఆరోగ్య సేవలు నిరాకరించి ఆయన్ను చం పాలని కేంద్ర ప్రభుత్వం కోరుకుంటోందని సునీత కేజ్రీవాల్ ఆరోపించారు.

66వేల మంది భారతీయులకు

అమెరికా పౌరసత్వం

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా పౌరసత్వం పొందుతున్న వారిలో భారతీయులు రెండో స్థానంలో నిలిచారు. 2022లో మెక్సికో తర్వాత అత్యధిక మంది అక్కడి పౌరసత్వం పొందింది మనవారే.ఆ ఏడాదిలో 65,960 మందికి సహజీకృత సిటిజన్‌షిప్ లభించింది.అమెరికాలో 2022 నాటికి 4.6 కోట్ల మంది విదేశీయులు నివసిస్తున్నారు. 33.3 కోట్ల అగ్రరాజ్య జనాభాలో ఇది 14 శాతానికి సమానం. వీరిలో 2.45 కోట్ల మంది తమని తాము సహజీకృత పౌరులుగా పేర్కొన్నారు. మొత్తంగా ఆ ఏడాదిలో 9,69,380 మంది ఈ పద్ధతిలో అమెరికా పౌరులుగా మారారని స్వతంత్ర 'కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ నివేదిక వెల్లడించింది.2022లో 1,28,878 మంది మెక్సికన్లు అమెరికన్ పౌరులుగా మారారు. తర్వాత ఇండియా (65,960), ఫిలిప్పీన్స్ (53,413), క్యూబా (46,913), డొమినికన్ రిపబ్లిక్ (34,525), వియత్నాం (33,246), చైనా (27,038) ఉన్నాయి. అయితే, భారత్‌లో పుట్టి అమెరికాలో ఉంటున్నవారిలో దాదాపు 42 శాతం మందికి అక్కడి పౌరసత్వం పొందే అర్హత లేదని సీఆర్ఎస్ నివేదిక తెలిపింది. 2023 నాటికి గ్రీన్ కార్డు లేదా లీగల్ పర్మినెంట్ రెసిడెన్సీ (ఒఖఖీ) ఉన్న 2,90,000 మంది భారతీయులు సహజీకృత పౌరసత్వం పొందే అవకాశం ఉందని పేర్కొంది.సహజీకృత పౌరసత్వం కోసం వచ్చే దరఖాస్తుల సంఖ్య 2023 ముగిసే నాటికి 4,08,000గా ఉన్నట్లు సీఆర్ఎస్ నివేదిక తెలిపింది. 2023లో కొత్తగా 8,23,702 మంది ఎల్‌పీఆర్ ఉన్నవారు నేచురలైజేషన్ కింద పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దాదాపు 90 లక్షల మందికి దానికి అర్హత ఉన్నప్పటికీ చాలా తక్కువ సంఖ్యలో అప్లికేషన్లు వచ్చాయని నివేదిక తెలిపింది.అమెరికా సహజీకృత పౌరసత్వం ఇచ్చేందుకు అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. జన్మించిన దేశంతో పాటు కనీసం ఐదేళ్ల పాటు ఎల్‌పీఆర్‌లు అయ్యి ఉండాలి. హోండురస్, గ్వాటిమాలా, వెనిజువెలా, మెక్సికో, ఎల్ సాల్వెడార్, బ్రెజిల్ నుంచి వచ్చిన తక్కువ మంది ఈ పద్ధతిలో పౌరసత్వం పొందగా.. వియత్నాం, ఫిలిప్పీన్స్, రష్యా, జమైకా, పాకిస్థాన్ వారు అధిక సంఖ్యలో ఉన్నారు.

మన్మోహన్‌పై మోదీ వ్యాఖ్యలు

- మండిపడ్డ కాంగ్రెస్

దిల్లీ(జనంసాక్షి): కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల సంపద అంతా మైనార్టీలైన ముస్లింలకు పంచుతుందంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.దేశ వనరులపై మైనార్టీలదే తొలి హక్కు అని గతంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చేసిన వ్యాఖ్యలను ఆయన తాజాగా ప్రస్తావించారు. దీనిపై కాంగ్రెస్ నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలను బలపర్చేలా భాజపా ఓ వీడియోను విడుదల చేసింది.యూపీఏ హయాంలో 2006 డిసెంబరు 9న నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఓ కార్యక్రమంలో మాట్లాడిన వీడియో అది. "మైనార్టీలు, ముఖ్యంగా ముస్లింలకు అభివృద్ధి ఫలాలు సమానంగా అందేలా వారికి సాధికారత కల్పిస్తూ మేం వినూత్న ప్రణాళికలను తీసుకురాబోతున్నాం. దేశంలోని వనరులపై వారికే తొలి హక్కు ఉండాలి" అని మన్మోహన్ చెబుతున్నట్లుగా దానిలో ఉంది. దీన్ని భాజపా తమ సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేస్తూ.. "కాంగ్రెస్‌కు తమ సొంత ప్రధానిపైనే నమ్మకం లేదు" అని వ్యంగ్యాస్త్రాలు గుప్పించింది.

మతోన్మాదులను తరిమికొట్టండి

ఉన్నప్పుడు ఇక్కడి రైతులను పట్టించుకోలేదు. పసుపు బోర్డు ఏర్పాటుపై బాండు రాసి ఇచ్చి భాజపా ఎంపీ అర్వింద్ మోసం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ కూటమి తప్పక ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. చక్కెర పరిశ్రమ, పసుపు బోర్డులను జీవన్‌రెడ్డి సాధిస్తారు. దేవుడు గుడిలో ఉండాలి.. భక్తి గుండెల్లో ఉండాలి. కానీ, మోదీ దేవుడిని, భక్తిని ఓట్లుగా మార్చుకుంటున్నారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న దేశాన్ని కాపాడాలంటే మళ్లీ కాంగ్రెస్ గెలవాలి"అని రేవంత్‌రెడ్డి అన్నారు.

మోదీ, కేసీఆర్ ఇద్దరూ తోడు దొంగలే

తెలంగాణలో ఐదు గ్యారంటీలు అమలు చేశామని, త్వరలోనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ కూడా పూర్తిచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జనజాతర' సభలో ఆయన మాట్లాడారు."నాగోబా జాతరకు రూ.4 కోట్లు కేటాయించనున్నాం. కుప్టి ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్‌ను సస్యశ్యామలం చేస్తాం. తుమ్మిడిహట్టిలో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కడతాం.. దానికి బీఆర్ అంబేద్కర్ పేరు పెడతాం. ఆదిలాబాద్‌లో కొత్త యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం. మోదీ, కేసీఆర్ ఇద్దరూ తోడుదొంగలే.తెలంగాణ ప్రభుత్వం వచ్చాక అన్నదాత పండించిన ప్రతి గింజ కొంటున్నాం. ఉచిత బస్సుల్లో 35 కోట్ల మంది మహిళలు ప్రయాణించారు. పదేళ్లలో కేసీఆర్ ఉద్యోగాలు ఇవ్వకుంటే.. కాంగ్రెస్ 3 నెలల్లోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చింది. బీసీ జనగణన చేయాలని మా ప్రభుత్వం నిర్ణయించింది. ఇక్కడ ఉన్న సీసీఐ సిమెంట్ పరిశ్రమను మోదీ, కేసీఆర్ కలిసి మూసేశారు. తొందరల్లోనే దీన్ని తెరిపిస్తాం. రూ.500కే మేం గ్యాస్ సిలిండర్ ఇస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టాలని వాళ్లిద్దరూ అంటున్నారు. ఉచిత కరెంటుతో పేదల ఇళ్లు వెలుగుతుంటే వాళ్ల కడుపు మండుతోంది. గత ప్రభుత్వ పాలనలో పండించిన ధాన్యం కొనకపోవడం తో రైతులు కల్లాల్లోనే చనిపోయారు" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

రాజకీయాల్లో పడిపోతున్న నాకు అండగా నిలిచింది మాల్కాజిగిరి ప్రజలే..

రాజకీయాల్లో పడిపోతున్న తనకు కేసీఆర్‌తో పోరాడేంత బలం ఇచ్చింది.. మాల్కాజిగిరి ప్రజలు, పార్టీ కార్యకర్తలేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.ఇక్కడ ఎంపీగా చేసిన పోరాటంతోనే పీసీసీ అధ్యక్ష పదవి, ముఖ్య మంత్రి పదువులు వచ్చాయన్నారు. మాల్కాజి గిరిలో నిర్వహించిన కాంగ్రెస్ 'జనజాతర'సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు."మల్కాజిగిరి నియోజక వర్గాన్ని నేనెప్పుడూ మర్చిపోను. కొడంగల్‌లో ఓడిపోతే ఇక్కడ ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించారు. భారాస ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఇక్కడ అభివృద్ధి లేనందునే కోకాపేటలో పెరిగినట్లుగా ఈ ప్రాంతంలో భూముల ధరలు పెరగలేదు. ఇక్కడి ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ఏదైనా అడిగేందుకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధి ఇప్పుడు లేరు. ఈ ఎన్నికల్లో అయినా మాల్కాజిగిరి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి. భారాస అధినేత కేసీఆర్ భాజపాతో చీకటి ఒప్పందం చేసుకున్నారు. రాష్ట్రంలో 5 ఎంపీ స్థానాల్లో భాజపాను గెలిపిస్తానని మోదీతో కేసీఆర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. కాంగ్రెస్ బలంగా ఉన్న చోట భాజపాకి భారాస మద్దతిస్తోంది. ఇన్నాళ్లు తనను గుండెల్లో పెట్టుకున్న హుజూరాబాద్ ప్రజలు ఇప్పుడు ఎందుకు ఓడించారో మాల్కాజిగిరి భాజపా ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ చెప్పాలి. కేసీఆర్, కేటీఆర్ అవినీతిపై విచారణ జరపాలని అమిత్‌షాను ఈటల ఎందుకు కోరలేదు? కేటీఆర్ అవినీతి, ఫోన్ల ట్యాపింగ్ గురించి ఎందుకు మాట్లాడటం లేదు? మోదీ ఇచ్చిన హామీలపై బహిరంగ చర్చకు ఈటల సిద్ధమేనా?పదేళ్లు అధికారంలో ఉన్న మోదీ తెలంగాణకు చేసిందేమీ లేదు. ఆయన రైతు వ్యతిరేక చట్టాలు తెస్తే.. అవి రద్దయ్యే వరకు కాంగ్రెస్ పోరాటం చేసింది. సాగు చట్టాలు రద్దు చేసి.. ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పేలా చేసింది రైతులు, కాంగ్రెస్ నేతలే. ఓట్ల కోసం ఆయన మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతు న్నారు. మతాలు, భాషల మధ్య చిచ్చుపెట్టి గెలవాలని భాజపా చూస్తోంది. దేవుడి పేరు మీద రాజకీయం చేసే వారిని పొలిమేర వరకు తరిమికొట్టాలి"అని అన్నారు.

సీఎం హెలిప్యాడ్ వద్ద డ్రోన్ కలకలం

సీఎం రేవంత్‌రెడ్డి హెలిప్యాడ్ వద్ద డ్రోన్ కలకలం రేపింది. శామీర్‌పేట వద్ద ఉన్న హెలిప్యాడ్ వద్ద ఓ వ్యక్తి డ్రోన్‌ను ఎగరవేశాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని రామంతాపూర్‌కు చెందిన గణేశ్‌రెడ్డిగా గుర్తించారు.

ప్రజల సంపదను కాంగ్రెస్ లాక్కుంటుంది

కాంగ్రెస్ భారతదేశంలో అమలుచేయాలనుకుంటుంది. నేను దేశ ప్రజలను హెచ్చరిస్తున్నాను. ఇండియా కూటమి దృష్టి మీ సంపాదన, ఆస్తులపై పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎవరెవరు ఎంత సంపాదిస్తున్నారు, ఎవరికి ఎన్ని ఆస్తులు ఉన్నాయో, అమ్మానాన్నలకు, అక్కచెల్లెళ్లకు ఎంత బంగారం ఉందో విచారణ చేస్తామని కాంగ్రెస్ అంటోంది." అని ప్రధాని మండిపడ్డారు. ప్రజలను దోచుకొని తమ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకున్నారని పరోక్షంగా సోనియాకుటుంబాన్ని ఉద్దేశిస్తూ అన్నారు.

తెలంగాణలో అధికారం భాజాపాదే..

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నా యన్నారు. ఇండియా కూటమిలోని పార్టీల్లో ఐకమత్యం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కేరళలో సీపీఐతో కుస్తీ.. దిల్లీలో దోస్తీ చేస్తోందని ఎద్దేవా చేశారు. 2047 నాటికి వికసిత్ భారతే తమ లక్ష్యమన్నారు. మోదీ హవాతో ఈ ఎన్నికల్లో తెలంగాణలో క్లీన్ స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.అనంతరం చేవెళ్ల లోక్‌సభ స్థానానికి భాజపా అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.

విరబూసిన 'పద్మా'లు

ప్రకటించగా.. వీటిలో 5 పద్మవిభూషణ్, 17 పద్మభూషణ్, 110 పద్మశ్రీ పురస్కారాలు ఉన్నాయి. సోమవారం సాయంత్రం దాదాపు సగం మందికి పురస్కారాలు ప్రదానం చేశారు. మిగతావారికి వచ్చే వారం ఇచ్చే అవకాశం ఉంది.మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతులమీదుగా పద్మవిభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు. అలాగే, సులభ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు బిందేశ్వర్ పాఠక్ (మరణానంతరం) తరఫున ఆయన కుటుంబసభ్యులకు పద్మవిభూషణ్ అవార్డును అందజేశారు. సినీనటుడు మిథున్ చక్రవర్తి, మాజీ గవర్నర్ రామ్‌నాయక్, ప్రముఖ గాయని ఉషా ఉథుప్ పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌తో పాటు పలువురు ప్రముఖులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భాజపాకు బోణి

చేసిన నామినేషణ తిరస్కరణకు గురైంది. దీంతో బీజేపీ అభ్యర్థి ముకేశ్ దలాల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సౌరభ్ పార్ది ఆయనకు సర్టిఫికేట్ అందించారు. గుజరాత్ లోని సూరత్ లోక్ సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున నీలేశ్ కుంభనీ ఇటీవలే నామినేషన్ దాఖలు చేశారు. అయితే దాన్ని పరిశీలించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారం ఆదివారం నీలేశ్ కుంభనీ నామినేషన్ ను తిరస్కరించారు. ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించిన నేతల సంతకాల్లో అవకతవకలు ఉన్నట్లు గుర్తించిన ఆర్వో ఆయన నామినేషన్ ను తిరస్కరిస్తున్నట్లు వెల్లడించారు. నీలేశ్ కుంభనీకి ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ దాఖలు చేసిన మరో నామినేషన్ కూడా చెల్లనిదిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. అయితే ఈ సూరత్ స్థానంకు వీరితో పాటుగా మరో 8 మంది అభ్యర్థిగా నామినేషన్లను దాఖలు చేశారు. కాగా, వారంతా నామినేషన్ల ఉపసంహరణకు చివరిరోజైన సోమవారం.. వారు దాఖలు చేసిన నామినేషన్లను ఉపసంహరించుకొని పోటీ నుంచి వైదొలగతున్నట్లు ప్రకటించారు. అయితే నామినేషన్ ఉపసంహరించుకున్న వారిలో బీఎస్పీ అభ్యర్థి కూడా ఉండడం గమనార్హం. కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురి అవ్వడం, మిగిలిన వారు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో బీజేపీ నుంచి నామినేషన్ దాఖలు చేసిన ముకేశ్ దలాల్ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. బీజేపీ అభ్యర్థి ఏకగ్రీవం కావడంతో ప్రస్తుతం ఈ స్థానంలో పోలింగ్ నిర్వహించాల్సిన అవసరం లేదు. దీంతో ప్రధాని మోదీకి సూరత్ తొలి విజయాన్ని అందించింది అంటూ.. గుజరాత్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సీఆర్ పాటిల్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. కాగా, గుజరాత్ లోని మొత్తం 26 లోక్ సభ స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి.

త్వరలో 'పది' ఫలితాలు

- పదిరోజుల్లో వెలువడే అవకాశం

- ఈసీ అనుమతితో అధికారుల కసరత్తు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో పదోతరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు మరో 10 రోజుల్లో వెలువడే అవకాశం ఉంది. ఎన్నికల సంఘం నుంచి అనుమతి రావడంతో ఫలితాల వెల్లడికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. టెన్త్ జవాబపత్రాల మూల్యాంకన పక్రియ ఏప్రిల్ 20తో ముగిసింది. ఫలితాలను డీకోడింగ్ చేయడానికి మరో వారంరోజులకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో 10 రోజుల్లో ఈ పక్రియ అంతా పూర్తిచేసి ఏప్రిల్ 30న ఫలితాలను వెల్లడించాలని అధికారులు భావిస్తున్నారు. ఒకవేళ ఏప్రిల్ 30న కుదరని పక్షంలో మే 1న పదోతరగతి ఫలితాలను వెల్లడించే అవకాశం ఉంది. ఎన్నికల కోడ్ దృష్ట్యా మంత్రులుకాకుండా విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం వీటిని విడుదల చేయనున్నారు. ఈ ఏడాది మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పదోతరగతి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 5,08, 385 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇం దులో 2,57,952 మంది బాలురు కాగా.. 2,50,433 మంది బాలికలు ఉన్నారు. ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి జవాబపత్రాల స్పాట్ వాల్యూయేషన్ పక్రియ మొదలైంది.

బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలతపై కేసు

చెందిన ఇమ్రాన్ షేక్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బేగంబజార్ పోలీసులు తెలిపారు. 'ఈనెల 17న సిద్ధి అంబర్ బజార్ వద్ద మాధవీలత ఓ మసీదుపై బాణం ఎక్కుపెట్టి వదులుతున్నట్లు అభినయించారు. ఇది ముస్లింల మనోభావాలను దెబ్బతీయడమే'నని ఇమ్రాన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు.కాగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన సైదాబాద్ ఏఎస్సై ఉమాదేవి సస్పెండ్ అయ్యారు. ఎన్నికల ప్రచారంలో ఉన్న హైదరాబాద్ భాజపా ఎంపీ అభ్యర్థి మాధవీలతను ఆమె ఆలింగనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ కావడంతో పోలీసు శాఖ చర్యలు తీసుకుంది. ఉమాదేవీని సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపీ అభ్యర్థి మాధవీలతతో ఏఎస్సై ఆలింగనం.. ..సస్పెండ్ చేసిన సీపీ

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన సైదాబాద్ ఏఎస్సై ఉమాదేవి సస్పెండ్ అయ్యారు. ఎన్నికల ప్రచారంలో ఉన్న హైదరాబాద్ భాజపా ఎంపీ అభ్యర్థి మాధవీలతను ఆమె ఆలింగనం చేసుకున్నారు.దీనికి సంబంధించిన వీడియో వైరల్ కావడంతో పోలీసు శాఖ చర్యలు తీసుకుంది. ఉమాదేవీని సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.కాగా భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్‌పై మరో కేసు నమోదైంది. శ్రీరామనవమి శోభాయాత్ర సందర్భంగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారంటూ కేసు నమోదు చేశారు. సుల్తాన్‌బజార్ పీఎస్‌లో ఎస్సైగా విధు లు నిర్వహిస్తున్న మధుసూదన్ ఫిర్యాదు మేరకు అదే పీఎస్‌లో వివిధ సెక్షన్ల కింద కేసు పెట్టారు. రాజాసింగ్ హనుమాన్ వ్యాయామశాల వద్ద మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఫిర్యాదులో పేర్కొ న్నారు. ఐదు రోజుల క్రితం శ్రీరామనవమి శోభా యాత్రలో భాగంగా అఫ్జల్‌గంజ్ ఠాణాలోనూ ఆయనపై కేసు నమోదైంది.

26 వేల మంది ఉద్యోగాలు ఊస్ట్

ఆదేశించింది. అంతేగాక, దీని కింద ఉద్యోగాలు సాధించిన టీచర్లు తమ వేతనాన్ని తిరిగి ఇచ్చేయాలని వెల్లడించింది.ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయులతో పాటు గ్రూప్ సి, గ్రూప్ డి స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్ర స్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహించింది. 24,650 ఖాళీల భర్తీ కోసం చేపట్టిన ఈ రిక్రూట్‌మెంట్ పరీక్షకు 23 లక్షల మందికి పైగా హాజరయ్యారు. అనంతరం ఇందులో ఎంపిక ప్రక్రియ చేపట్టి 25,753 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. ఈ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తు చేపట్టాలని న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి.ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ పిటిషన్లపై విచారణ నిమిత్తం కోల్‌కతా హైకోర్టులో ప్రత్యేక డివిజన్ బెంచ్ ఏర్పాటైంది. దీనిపై సుదీర్ఘ విచారణ జరిపిన ఈ ధర్మాసనం.. 2016 నాటి టీచర్ల నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగినందున అది చెల్లదని తీర్పు వెలువరించింది. తక్షణమే ఆ నియామకాలను రద్దు చేసి కొత్త నియామక ప్రక్రియ ప్రారంభించాలని పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్‌ను సూచించింది. నాటి వ్యవహారంపై మరింత సమగ్ర దర్యాప్తు జరిపి మూడు నెలల్లోగా నివేదిక సమర్పించాలని సీబీఐకి ఆదేశాలు జారీ చేసింది.ఇదే సమయంలో 2016 ఉపాధ్యాయ నియామక ప్రక్రియతో ఉద్యోగాలు పొందిన టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నాలుగు వారాల్లోగా తాము అం దుకున్న వేతనాలను తిరిగి ఇచ్చేయాలని ఆదేశించింది. ఆ డబ్బు వసూలు బాధ్యతలను జిల్లా కలెక్టర్లకు అప్పగించాలని సూచించింది. ఈ కుంభకోణానికి సంబంధించిన కేసులో మాజీ విద్యాశాఖ మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత పార్థా ఛటర్జీ ఈడీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

హైకోర్టు తీర్పును సవాల్ చేస్తాం: మమత

పశ్చిమ బెంగాల్‌లో ఉపాధ్యాయ నియామక ప్రక్రియ ద్వారా నియమితులైన 26 వేల మంది ఉద్యోగాలను రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన సంచలన తీర్పుపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు.ఉద్యోగాలను రద్దు చేయడంతో పాటు.. వేతనాన్ని తిరిగి ఇచ్చేయాలన్న కోర్టు ఆదేశాలను సవాలు చేస్తామని తెలిపారు. ఉద్యోగాలు కోల్పోయిన వారికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉత్తర బెంగాల్‌లోని రాయ్‌గంజ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మమత పాల్గొన్నారు. ఈసందర్భంగా కోర్టు తీర్పుపై మీడియాతో మాట్లాడారు. "ఉపాధ్యాయ నియామక ప్రక్రియను పూర్తిగా రద్దు చేయడం చట్ట విరుద్ధం. ఉద్యోగాలు కోల్పోయిన వారికి అండగా నిలబడతాం. వారికి న్యాయం జరిగేవరకు పోరాడతాం. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తాం. ఉద్యోగాలు కోల్పోయిన వారు అధైర్యపడొద్దు" అని మమత అన్నారు. పైగా 8 ఏళ్ల వేతనాన్ని కేవలం 4 వారాల గడువులో చెల్లించడం ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. కొందరు భాజపా నేతలు న్యాయ వ్యవస్థను, న్యాయమూర్తులను ప్రభావితం చేస్తున్నారంటూ ఆరోపించారు.భాజపా నేత సువేందు అధికారి పార్టీ కార్యకర్తలతో ఇటీవల మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "సోమవారం వరకు వేచి చూడండి.. కీలక పరిణామం చోటుచేసుకుంటుంది. దాంతో ఆ పార్టీ ఇక కోలుకోలేదు" అని అన్నారు. ఈ వ్యాఖ్యలను ఉటంకిస్తూ మమత.. కోర్టు తీర్పు రాకముందే వారికెలా తెలిసిందంటూ మమత ప్రశ్నించారు. తాను చేసిన వ్యాఖ్యలపై సువేందు అధికారి వివరణ ఇచ్చారు. ఆ పార్టీలో తిరుగుబాట్లు, అనిశ్చిత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అలా అన్నానని వివరణ ఇచ్చారు. మరోవైపు కోర్టు ఇచ్చిన తీర్పును ఆ పార్టీ స్వాగతించింది. అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగిందని పేర్కొంది.ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయులతో పాటు గ్రూప్ సి, గ్రూప్ డి స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్రస్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహించింది. 24,650 ఖాళీల భర్తీ కోసం చేపట్టిన ఈ పరీక్షకు 23 లక్షల మందికి ప

వరంగల్ పార్లమెంట్ స్థానానికి నాలుగో రోజు 11 నామినేషన్లు

వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 24(జనం సాక్షి) : పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా వరంగల్ లోక్ సభ నియోజక వర్గానికి సంబంధించి నాల్గవ రోజైన సోమవారం 10 మంది అభ్యర్థులు 11 నామినేషన్లు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. సోమవారం 15- వరంగల్ ఎస్సిపార్లమెంట్ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా మారపల్లి సుధీర్ కుమార్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య కు సోమవారం ఒక సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఇండిపెండెంట్ (స్వతంత్ర) అభ్యర్థిగా తాళ్లపల్లి వెంకటయ్య ఒక సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. అల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ అభ్యర్థి గా ఇసంపల్లి వేణు ఒక సెట్ నామినేషన్ పత్రాలను అందజేశారు. ఐఎన్సి అభ్యర్థిగా కడియం కావ్య ఒక సెట్ నామినేషన్ పత్రాలను, ఇండిపెండెంట్ (స్వతంత్ర) అభ్యర్థిగా మంద నరేష్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను, స్వతంత్ర అభ్యర్థిగా బొచు రాజు ఒక సెట్ నామినేషన్ పత్రాలను, స్వతంత్ర అభ్యర్థిగా శనిగరపు రమేష్ బాబు 2 సెట్ల నామినేషన్ పత్రాలను, మేకల సుమన్, ధర్మ సమాజ్ పార్టీ రిజిస్టర్డ్ (అన్ రికగ్నైసడ్) అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ పత్రాలను, పొగుల అశోక్ స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ వేశారని, విదు థలై చిరు థైగల్ కాచి పార్టీ అభ్యర్థిగా మచ్చ దేవేందర్ ఒక సెట్ నామినేషన్ వేశారని రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య వివరించారు. మొదటి, రెండవ, మూడవ, నాల్గవ రోజు కలుపుకుని ఇప్పటి వరకు మొత్తం 19 మంది అభ్యర్థులు 22 నామినేషన్లు దాఖలు చేశారని జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్య తెలిపారు.

కరీంనగర్ కాంగ్రెస్ బీ ఫాం ఎవరికి?

- అలిగిరెడ్డి, వెలిచాల మధ్య తీవ్ర పోటీ
- నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనా బీఫామ్ ఇవ్వని అధిష్టానం

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22 (జనంసాక్షి) : కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరనేది ఇంకా అధిష్టానం నిర్ణయించలేదు.సోమవారం కాంగ్రెస్ అభ్యర్థిగా వెలుచాల రాజేందర్రావు నామినేషన్ దాఖలు చేయగా, మరో రెండు రోజుల్లో అలిగిరెడ్డి ప్రవీణ్ కూడా నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ ఎవరికనేది అధిష్టానం నుండి స్పష్టత రాలేదు.నామినేషన్ల ప్రక్రియ ముగిపు దశకు చేరుకుంటున్న అదిస్థానం అభ్యర్థిని ప్రకటించడంలో జాప్యం చేస్తుంది. కాంగ్రెస్ పార్టీ నుండి ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ వేస్తున్న క్రమంలో అధిష్టానం బీ ఫామ్ ఎవరిని వరిస్తుందో ఇరు వర్గాల్లో టెన్షన్ నెలకొంది. పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నారు.ఈ సమావేశాలలో పార్లమెంట్ సెగ్మెంట్లోని ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ముఖ్య నేతలతో కలిసి వెలిచాల రాజేందర్ రావు సమావేశాల్లో పాల్గొన్నారు. వెలిచాల రాజేందర్ రావుకె కాంగ్రెస్ టికెట్ వస్తుందని ఆయన అనుచరులు చెబుతున్నారు.వెలిచాలకు టికెట్ కేటాయిస్తే పొన్నం గెలిపించి తీసుకువస్తామని అధిష్టానానికి స్పష్టమైన హామీ ఇచ్చి ఒప్పించినట్లు సమాచారం.కాంగ్రెస్ అధిష్టానంనుండి అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డికి పిలుపు వచ్చినట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ సమీకరణాలపై అతనితో చర్చించి బి ఫామ్ ఇస్తారా లేక బుజ్జగిస్తారా అనేది తెలియాల్సి ఉంది. ఆయన ముఖ్యమంత్రి తో పాటు అధిష్టానంతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తుంది.కాంగ్రెస్ అధిష్టానం బీఫామ్ ఇవ్వకపోతే కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా ప్రవీణ్ రెడ్డి 25 న నామినేషన్ వేసే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.బీఫామ్ తో నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థిని కాదని చివరి నిమిషంలో సి ఫామ్ ఇచ్చి మరో అభ్యర్థితో నామినేషన్ వేయించిన సందర్భాలు కాంగ్రెస్ చరిత్రలో అనేకంగా ఉన్నాయి. కాంగ్రెస్ నుండి ఇద్దరు అభ్యర్థులు ఉంటున్న క్రమంలో బి ఫాం అదిస్థానం ఎవరికి కేటాయిస్తుందో వేచి చూడాల్సిందే.

రన్నింగ్ కామెంటరీ

కాంగ్రెస్ వస్తే
సంపదంతా
ముస్లింలేకనట
అంటున్నారు మోడీ
కూస్తున్నారు కోడై

అత్యున్నత స్థానంలో
ఉన్న ఒక వ్యక్తి
మత మౌఢ్యం రెచ్చగొడితే
దేశానికి సుస్తీ

- పీఎస్ రవీంద్ర

నెహ్రూ ఉన్నప్పుడు మోడీ పుట్టి ఉండాల్సింది

- రామాయణమంతా చరిత్ర గాంధీ కుటుంబానిది
- గాంధీ, నెహ్రూల చరిత్ర పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి
- మీడియా సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : నెహ్రు ప్రధానిగా ఉన్నప్పుడే శ్రీరాముడు పాలన మొదలైందని, ఆయన పాలనను తప్పు పడుతున్న మోడీ ఆయన ఉన్నప్పుడు పుట్టిఉంటే బాగుండేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీరాముడు కూడా దేశానికి మొదటి ప్రధాని నెహ్రు కావాలనే ఆయన్నే పుట్టించారని, రామాయణం.. మహాభారతం చరిత్ర ఎలాగా ఉందో.. స్వతంత్ర ము తర్వాత గాంధీ కుటుంబానికి అంతటి చరిత్ర ఉందని తెలిపారు. గాంధీ, నెహ్రూలు రక్తపాతం లేకుండా శాంతిమార్గాన్నే నమ్మారని, నెహ్రూ 16 ఏండ్ల జైలు జీవితం గడిపారని తెలిపారు. స్వాతంత్రం వచ్చిన తరువాత ఏకగ్రీవంగా నెహ్రు మొదటి ప్రధాని అయ్యారని, ఎన్నికల వ్యవస్థ తెచ్చిందే నెహ్రు అని, అన్నారు. ఈ చరిత్ర ని కాదనే శక్తి బీజేపీ నేతలకు ఉందా..? అని ప్రశ్నించారు. ప్రధాని మోడీ..అమిత్ షా అప్పుడు పుట్టనే లేదన్నారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ నిన్నామొన్న పుట్టినోళ్లని, వాళ్లు కూడా కాంగ్రెస్ గురించి మాట్లాడుతుంటే నవ్వొస్తుందని అన్నారు. దేశంలో ఆకలి చావులు ఉండొద్దని ప్రాజెక్టులు కట్టిన చరిత్ర నెహ్రుదని, నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టు లు కట్టింది నెహ్రునేనని తెలిబీపారు. కాంగ్రెస్ ఏం చేసిందీ అని ప్రశ్నిస్తున్న వాళ్లకు ఇవి కన్పించడం లేదా? అని దుయ్యబట్టారు. శ్రీరాముడి చరిత్ర చదువుతున్నారు కానీ గాంధీ.. నెహ్రూల చరిత్ర అక్కరలేదా..? అని ప్రశ్నించారు. నెహ్రు ప్రధానిగా ఉన్నప్పుడు శ్రీరాముడు పాలన మొదలైందన్నారు. అదే పునాది అని, నెహ్రూ పునాదుల నుండే చంద్రబాబు, కేసీఆర్ పాలన సాగించారని, ఇప్పుడు రేవంత్ పాలిస్తున్నారని తెలిపారు. త్యాగాలు చేయడం రాహుల్ గాంధీ కుటుంబం బ్లడ్ లోనే ఉందన్నారు. విద్యా పారిశ్రామిక రంగాల్లో నెహ్రూ విప్లవం తెచ్చారని, బీహెచ్ఈఎల్, పంచవర్ష ప్రణాళికలు, విదేశీ వ్యవహారాలు మొదలు పెట్టింది ఆయనేనన్నారు. 200 దేశాలకు ఆహారం సరఫరా తెచ్చే పరిస్థితికి దేశాన్ని తీసుకెళ్లారని, దేశంలో ఉక్కు కర్మాగారం, ఐడీపీఎల్, ఎన్టీపీసీతో వెలుగులు.. 60 లక్షల కిలో మీటర్లు రోడ్లు వేసింది నెహ్రు నే కదా అని ప్రశ్నించారు. జీరో బల్బులతో కరెంటు గ్రామాలకు తెచ్చారన్నారు. తాను లేవనెత్తిన అంశాలపై చర్చకు వచ్చే దమ్ము ఉందా..? అని ప్రశ్నించారు. గుండు సూది నుండి మొదలుకుని.. శాటిలైట్ వరకు తెచ్చిన చరిత్ర కాంగ్రెస్‌దని, ఆ చరిత్ర చెప్పకండి..కానీ అబద్ధపు ప్రచారం మాత్రం చేయకండని సూచించారు. శ్రీరాముడు అందరి దేవుడని, అన్ని మతాలు, కులాలున్నాయని, ఆయన హయాంలో కులమతాలకతీతంగా పాలించారని తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు

నేరడిగొండ, ఏప్రిల్ 22 (జనం సాక్షి) : జనజాతరకు సిఎం రేవంత్ రెడ్డి సభకు సోమవారం రోజున బోథ్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీ అభిమానులు బయలు దేరారు. ఆదిలాబాద్ డైట్ కళాశాల మైదానంలో మండలంలోని కుప్టీ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీరామోజి నారాయణ కళ్లెం భోజన్న,ఆకుల వెంకటరమణతోపాటు పలువురు నాయకులు నియోజకవర్గ ఇంఛార్జి అడే గజేందర్ మండల అధ్యక్షుడు వసంత్ రావు యేలేటి రాజారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రోజున కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ నామినేషన్ కార్యక్రమనికి వీచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి సితక్క రాష్ట్ర ఐ టీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సమిక్షంలో పార్టీ సభ్యత్వం తీసుకున్నారు.సిఎం జనజాతర సభకు విజయవంతం చేసిన ప్రతిఒక్కరికిబోథ్ ఇంఛార్జి ఆడే గజేందర్ కార్యకర్తలకు అభినందించారు.

భువనగిరి అభ్యర్థిగా క్యామ మల్లేశ్ నామినేషన్

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్22 (జనంసాక్షి) : భువనగిరి పార్లమెంట్ స్థానానికి భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థిగా క్యామ మల్లేష్ రెండు సెట్లతో తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి హనుమంతు కే.జండగేకు అందజేశారు. ఆయన వెంట మాజీ మంత్రులు పొన్నాల లక్ష్మయ్య, ఉమా మాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

వెలిచాల రాజేందర్‌రావు నామినేషన్

- కరీంనగర్ గడ్డమీద కాంగ్రెస్ జెండా ఎగరేద్దామంటూ కదం తొక్కిన కాంగ్రెస్ శ్రేణులు

కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 22 (జనం సాక్షి) : కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , మానకొండూర్ శాసనసభ్యులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ , వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ , చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం , హుజురాబాద్, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జిలు వోడితల ప్రణవ్ , పురుమల్ల శ్రీనివాస్ లతో కలిసి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కి నామినేషన్ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా కరీంనగర్ నగరంలోని జ్యోతిబా పూలే మైదానం నుండి కలెక్టరేట్ వరకు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు వేలాదిగా తరలివచ్చారు.

ప్రకాశ్‌గౌడ్‌ను వారించిన కెటిఆర్

- కాంగ్రెస్‌లో చేరకుండా అడ్డుపుల్ల

హైదరాబాద్, ఏప్రిల్22 (జనంసాక్షి) : రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ కాంగ్రెస్‌లో చేరడంపై సందిగ్ధత నెలకొంది. పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ ఆయనను బుజ్జగించి, వెనక్కి తగ్గేలా చేశారని ప్రచారం సగుతోంది. దీంతో ఆయన కాంగ్రెస్‌లో చేరే నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గౌడ్ కాంగ్రెస్‌లో చేరతారంటూ కొద్దిరోజులుగా వినిపించిన వార్తలకు బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. అయితే ప్రకాష్‌గౌడ్ వ్యతిరేక వర్గం మాత్రం కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. మూడు రోజుల కింద సీఎం రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరికపై ప్రకాష్ గౌడ్ సుముఖత వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ వార్తలపై వెంటనే స్పందించిన బీఆర్ఎస్ అధిష్టానం ఆయనతో చర్చలు జరిపింది. ఎమ్మెల్యేతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ అయ్యారు. కేటీఆర్‌తో భేటీ అనంతరం ప్రకాష్ గౌడ్ మనసు మార్చుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ప్రకాష్ గౌడ్ చేరిక వాయిదా వాడిన్లటైంది. అయితే ఎమ్మెల్యేకు చెందిన వ్యతిరేక వర్గం మాత్రం కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంది. బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్లో ఎమ్మెల్యేపై తిరుగుబాటు చేసిన కార్పొరేటర్లను కాంగ్రెస్ తమ పార్టీకి చేర్చుకోనుంది. ఇటీవలే ప్రకాష్ గౌడ్ దగ్గరి వ్యక్తి మహేందర్ గౌడ్‌ను మేయర్ పదవి నుంచి ప్రకాష్ గౌడ్ వ్యతిరేక వర్గం దింపేసింది. దాదాపు 22 మంది కార్పొరేటర్లలో 16 మంది కార్పొరేటర్లు ప్రకాష్ గౌడ్‌కు వ్యతిరేకంగా వ్యవహరించారు. ఆ 16 మంది కార్పొరేటర్లు మరికాసేపట్లో కాంగ్రెస్ గూటికి చేరనున్నారు.

మానుకోట బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్ నామినేషన్

- ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మంత్రి కిరణ్ రిజు

మహబూబాబాద్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : భారతీయ జనతా పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ నామినేషన్ దాఖలు చేశారు. మానుకోటలో మధ్యాహ్నం 12 గంటలకు పట్టణంలోని వివేకానంద సెంటర్ నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు సాగింది. కేంద్ర మంత్రికి ఘనస్వాగతం పలికారు.కేంద్ర మంత్రి కిరణ్ రిజు ప్రజల నుద్దేశించి మాట్లాడుతూ గ్రామాలకు నేరుగా నిధులు ఇచ్చి పల్లె ప్రగతికి కేంద్రప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. మహిళా సాధికారతకు కేంద్రం ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు.దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని అన్నారు.మూడోసారి ప్రధాన మంత్రిగా మోడీ కావాలని కోరుకుంటున్నారని అన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ బిఆర్ఎస్ కు ఓటేస్తే వృధా అవుతుందని అబద్ధాల హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అమలు చేయలేదని అన్నారు. ఈ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు కాంగ్రెస్, బిఆర్ఎస్ కు లేదని అన్నారు.మానుకోట జిల్లా ప్రజలు ఆలోచించి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం తోనే సాధ్యమని బిజెపి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు అవకాశవాదులు

- దేశం కోసం పనిచేసేది బీజేపీ మాత్రమే..
- రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు కోమల ఆంజనేయులు

కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 22 (జనం సాక్షి) : కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల కోసం పోటీ పడుతుతున్నటువంటి అభ్యర్థులు, రాజేందర్ రావు , వినోద్ కుమార్ రాజకీయ పురావాసం కోరేటువంటి అవకాశవాదులేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల ఆంజనేయులు ఆరోపించారు. బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో శక్తి కేంద్ర ఇంచార్జీలతో సోమవారం మండల కేంద్రం లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైంటువంటి ఆంజనేయులు మాట్లాడుతూ... గ్రామాల్లో బిఆర్ఎస్ పార్టీ కి ఆదరణ లేదని కేవలం ఉనికి కోసమే పోరాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఏనాడైనా ప్రజాక్షేత్రం తో సంబంధం ఉందా అని ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా మోదీ అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే భాద్యత బీజేపీ కార్యకర్తలదేనని పేర్కొన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బండి సంజయ్ చేసిన అభివృద్ధి పనులను వివరించాలని సూచించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ లు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని తెలిపారు. గతంలో కంటే రెట్టింపు మెజారిటీ తో బండి సంజయ్ ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి, అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు మావురపు సంపత్, బూట్ల శ్రీనివాస్, చింతం శ్రీనివాస్, మండల ప్రధాన కార్యవర్గ సభ్యులు కిన్నెర అనిల్, గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, శక్తి కేంద్ర ఇంచార్జిలు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు కెసిఆర్ అండ

- బిఆర్ఎస్‌తోనే సమస్యల పరిష్కారం
- ప్రచారంలో మాజీమంత్రి కొప్పుల వెల్లడి

పెద్దపల్లి, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రం సాధించాక నాడు కేసీఆర్ సింగరేణి కార్మికుల అనేక సమస్యలను పరిష్కరించారని మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మంచిర్యాల పరిధిలోని ఆర్‌కే-7,ఆర్‌కే-7ఎన్‌టీ గనుల వద్ద కార్మికులతో కలిసి గేట్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులు ఉద్యమ సమయంలో ఎంతో చురగ్గా పాల్గొన్నారు. బీఆర్ఎస్‌కు, సింగరేణి కార్మికులకు అవినాభావ సంబంధం ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సింగరేణిని ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర పన్నుతున్నది. దీనిని అడ్డుకోవాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే సింగరేణి కార్మికుల పక్షాన ప్రశ్నించే గొంతుకనవుతానని హామీనిచ్చారు.

విజ్ఞాన వెలుగులో సాహిత్య ప్రయాణం

పుస్తకం అక్షరాల వెలుగు లోకాన్ని చైతన్యం చేస్తుంది. ఒక్కో పుస్తకం ఒక మహాసముద్ర, మనుషులలో జ్ఞాన రత్నాలను నింపి, మనుషులకు విజ్ఞాన ఆహారమవుతుంది పుస్తకం. కథలు కవితలు నవలలు నాటకాలు చరిత్ర శాస్త్రం తత్వం అన్ని రకాలు పుస్తకాలు ప్రతి ఒక్కరికి ఏదో ఒక రకమైన విజ్ఞానాన్ని వినయాన్ని విధేయతను నేర్పిస్తుంది జీవితాన్ని నడిపిస్తుంది పుస్తకం.ప్రతి సంవత్సరం ఏప్రిల్ 23న ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని జరుపుకుంటాం. ఈ రోజున పుస్తకాల ప్రాముఖ్యతను గుర్తుచేసుకోవడమే కాకుండా, వాటిని చదవడం, వాటి గురించి మాట్లాడటం, వాటిని ఇతరులతో పంచుకోవడం కూడా జరుపుకుంటాము. పురాతన కాలం నుండి మానవులు జ్ఞానాన్ని భద్రపరచడానికి, పంచుకోవడానికి పుస్తకాలను ఉపయోగిస్తున్నారు. మట్టి పలక, రాతి శాసనాలు, కాగితం వంటి వివిధ రూపాలలో పుస్తకాలు వికసించాయి. ముద్రాణ యంత్రం ఆవిష్కరణతో పుస్తకాలు మరింత అందుబాటులోకి వచ్చాయి. జ్ఞానాన్ని విస్తృతంగా వ్యాప్తి చేయడానికి దోహదపడుతున్నాయి.

ఈ పుస్తక దినోత్సవం 1995లో యునెస్కో ద్వారా ప్రారంభించబడింది. ముగ్గురు గొప్ప సాహిత్యకారుల జన్మదినాలను ఒకే రోజు జరుపుకోవడం దీనికి ప్రేరణ. వారు,విలియం షేక్స్పియర్, (ఇంగ్లాండ్) మిగ్యుల్ డి సెర్వాన్టెస్ (స్పెయిన్),ఇంకా గార్సిలాసో డి లా వేగా (పెరూ) ప్రపంచవ్యాప్తంగా వందకి పైగా దేశాలు ఈ పుస్తక దినోత్సవం జరుపుకుంటున్నాయి. పుస్తకాలు జ్ఞాన భాండారాలు. అవి మనల్ని వివిధ ప్రపంచాలకు తీసుకెళ్లి, కొత్త ఆలోచనలను పరిచయం చేస్తాయి, మనల్ని వినోదింపజేస్తాయి. మనల్ని మెరుగైన వ్యక్తులుగా మార్చడంలో సహాయపడతాయి. అవి చరిత్ర, సాహిత్యం, శాస్త్రం, కళలు మరియు మరెన్నో అంశాలపై సమాచారాన్ని అందిస్తాయి. ఈ డిజిటల్ యుగంలో కూడా, పుస్తకాలు తమ ప్రాముఖ్యతను కోల్పోలేదు. అవి ఇప్పటికీ మన జీవితాలలో ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. పుస్తకాలు చదవడం వల్ల మనకు లభించే అనేక ప్రయోజనాలు ఉన్నాయి. జ్ఞానం పెరుగుతుంది పుస్తకాలు చదవడం వల్ల మనకు వివిధ అంశాలపై జ్ఞానం పెరుగుతుంది. అభిజ్ఞా నైపుణ్యాలు మెరుగుపడతాయి పుస్తకాలు చదవడం వల్ల మన జ్ఞాపకశక్తి, ఏకాగ్రత మరియు సమస్య పరిష్కార నైపుణ్యాలు మెరుగుపడతాయి. ఊహాశక్తి పెరుగుతుంది పుస్తకాలు చదవడం వల్ల మన ఊహాశక్తి పెరుగుతుంది మరియు మనం కొత్త ఆలోచనలను అభివృద్ధి చేయడానికి సహాయపడుతుంది.ఒత్తిడిని తగ్గిస్తుంది పుస్తకాలు చదవడం వల్ల మనకు ఒత్తిడి తగ్గుతుంది మరియు విశ్రాంతి తీసుకోవడానికి సహాయపడుతుంది.మనో వికాసం పెరుగుతుంది.పుస్తకాలు చదవడం వల్ల మనం మరింత సానుభూతి, అవగాహన మరియు సహనంతో ఉండటానికి సహాయపడుతుంది. పుస్తకాలు వివిధ రంగాలలో జ్ఞానాన్ని సమాచారాన్ని అందిస్తాయి. చరిత్ర, శాస్త్రం, సాహిత్యం, కళలు, తత్తశాస్త్రం, ఇంకా ఎన్నో రకాల అంశాలపై పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పుస్తకాలు కల్పనా శక్తిని పెంపొందిస్తాయి. మనల్ని కొత్త ప్రపంచాలకు తీసుకెళ్లి మన కల్పనా శక్తిని విస్తృతం చేస్తాయి. కథలు, నవలలు, కవితలు, మనల్ని ఊహా లోకంలోకి తీసుకెళ్లి మన జీవితాన్ని మరింత సూసంపన్నం చేస్తాయి. పుస్తకాలు మనకు వివిధ దృక్కోణాలను, ఆలోచనలను అందిస్తాయి. దీని ద్వారా మనకు విమర్శనాత్మక ఆలోచన నైపుణ్యాలు పెరుగుతాయి. ఒత్తిడితో కూడిన జీవితంలో పుస్తకాలు మనకు ఒక విశ్రాంతిని అందిస్తాయి. ఒక మంచి పుస్తకం చదువుతున్నప్పుడు మనం మన బాధలను మరిచిపోయి ఒక కొత్త ప్రపంచంలో మునిగిపోతాము. పుస్తకాలు మనకు సమాజం, సంస్కృతి, ప్రపంచం గురించి మరింత అవగాహన కల్పిస్తాయి. ఇతరుల జీవితాలను అనుభవాలను తెలుసుకోవడానికి పుస్తకాలు ఒక మార్గాన్ని అందిస్తాయి. భారతదేశంలో పుస్తక దినోత్సవం వివిధ రకాలుగా జరుపుకుంటాము. పుస్తక ప్రదర్శనలు,సదస్సులు, రచయితలతో, పాఠకులతో సంభాషణలు, పుస్తక పఠన పోటీలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. పాఠశాలలు, కళాశాలలో ,గ్రంథాలయాలు పుస్తకాలపై అవగాహన పెంపొందించడానికి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తుంటాయి. పుస్తకాలను కొని చదవడం ప్రారంభించండి. మీ స్నేహితులకు, కుటుంబ సభ్యులకు, బంధువులకు, పుస్తకాలను బహుమతిగా ఇవ్వండి. స్థానిక గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలను చదవండి. పుస్తకాలు పట్ల నీకున్న ప్రేమని అభిమానాన్ని సోషల్ మీడియాలో పంచుకోండి. పుస్తకాల రచయితలకు ప్రచురణార్థులకు మద్దతుగా ఉండండి. పుస్తకాలు మన జీవితంలో ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అవి మన ఈ విద్యావంతులుగా మార్చడానికి మన జీవితాలను మెరుగుపరచుకోవడానికి ఉపయోగపడతాయి. కాబట్టి పుస్తకాలు చదవడానికి కొంత సమయాన్నో కటాయించుకుందాం. మన జీవితాలతో మన సమాజాన్ని మెరుగుపరుచుకుందాం.

(ఏప్రిల్ 23 ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా)

పూసపాటి వేదాద్రి
కవి, సాహితీ విశ్లేషకులు
9912197694

లీడర్ల హంగామే ఎక్కువ!

తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి లీడర్ల హంగామానే ఎక్కువ కనిపిస్తున్నది.గత అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి అధికార బిఆర్ఎస్ పార్టీ నేతల హంగామా లాగే, ఇప్పటి అధికార కాంగ్రెస్ నేతల హంగామా ప్రస్తుతం కనిపిస్తున్నది. మొదటి విడతగా దేశంలో ఈ నెల 19 జరిగిన 102 పార్లమెంట్ స్థానాల్లో పోలింగ్ శాతం భారీగా తగ్గింది. చాలా చోట్ల ఎన్నికల బహిష్కరణ జరిగింది. ఇదంతా చూస్తే 2019 పార్లమెంట్ ఎన్నికల లో కన్నా పరిస్థితి చాలా భిన్నంగా కనిపిస్తున్నది. తెలంగాణ అందుకు అతీతం ఏమీ కాదు, అనిపిస్తున్నది. కాంగ్రెస్ ప్రస్తుతం తెలంగాణ లో అధికారంలో ఉన్నది. బిఆర్ఎస్ కు మంచి ప్రతిపక్ష హోదా ఉన్నా, అధికారం పోతుంది అని ఊహించని మాజీ సీఎం కేసీఆర్ పార్టీని, పార్టీ క్యాడర్ ను, ముఖ్యంగా ఎమ్మెల్యే లను, ఎంపీ లను ఒక భరోసా ఇచ్చి, అధికారం పోతే పోయింది, ఛలో విపక్షంలో ఉండి పని చేద్దాం! అనే ధైర్యం కల్పించలేక పోయారు.

ఇటీవల మరీ కాంగ్రెస్ ఎమ్మెల్యే లు తనతో టచ్ లో ఉన్నారని, ప్రభుత్వం ను బీజేపీ కూల్చేస్తుందని, కూలి పోతుంది అని దిగజారుడుగా మాట్లాడడం, ఇప్పటికే అవుట్ డేటెడ్ అయిపోయిన ఆయన మైండ్ గేమ్ మాటల తో ఆయన మాటల్లోనే చెప్పాలంటే టక్కువ,టమారం ఉపన్యాసాలు తుస్సు మంటున్నాయి. కేసీఆర్ వ్యక్తిగత విధానాల కారణంగా ఆయన ను తెలంగాణ ప్రజలు ఇప్పుడప్పుడే నమ్మే పరిస్థితుల్లో లేరు!ఆ తానాషాహీ గిరి విధానం, అహం,ఆయన ఫ్యూడల్ మానసికత ఇంకా కేసీఆర్ ను వెంటాడుతూనే ఉంటుంది. ఆయన కూతురు కవిత, కొడుకు కేటీఆర్ సహా బంధుగణం తప్పిదాలకు, ఒక రకంగా కెసిఆరే స్వయం గా కారణం, ఈ నేపథ్యంలో లో బిఆర్ఎస్ గా పార్లమెంట్ లో ఖాతా ఓపెన్ కావడం కొంత కష్టంగానే ఉన్న పరిస్థితి ఉన్నది. ఏమైనా ఒకటి, రెండు సీట్లు గెలిస్తే అవి వ్యక్తిగతంగా, ఆయా అభ్యర్థుల పలుకు బడి గానే, జనం లో వారికి ఉన్న మంచి పేరుగనే పరిగణింపచ్చు, ఇక బీజేపీ పరిస్థితి అలా లేదు, అభ్యర్థులు ఎవరు ఉన్నా, బీజేపీ కి వేయాలని,గ్రౌండ్ లో ఓటర్లు పీఎం నరేంద్ర మోడీ భక్తులు డిసైడ్ అయితే తెలంగాణ లో రెండు, మూడు సీట్లు రావచ్చు, అయితే కమ్యూనిస్టుల మద్దతు కాంగ్రెస్ పార్టీ కోరింది కాబట్టి, అంతే కాకుండా, కమ్యూనిస్ట్ లు కూడ బీజేపీ రావొద్దు అనే లక్ష్యం తో ఉంటారు కాబట్టి, అది కాంగ్రెస్ కు అసెంబ్లీ లో మాదిరి ప్రయోజనం ఉంటుంది.

ప్రోటోకాల్ యావలో!

అయితే ప్రోటోకాల్ యావలో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే లు, మంత్రులు ఆగమాగం మీటింగులు తప్ప గ్రౌండ్ లెవల్ లో ఓటర్ల దగ్గరకు వెళ్లడం లేదు!దీనివల్ల ప్రమాదం ఉంటుంది. ప్లాన్ చేసుకుని కదిలితే మంచిది. ఇంకా ఈ నేత, ఆ నేత రావాలి, ఆయన రాలేదు, ఈయన రాలేదు, ఆయన అలిగాడు, ఈయన అలిగాడు అంటూ బుజ్జగింపులు చేసుకుంటూ ఉండడం వల్ల, అభ్యర్థులు సైతం తమ పని తాము చేసుకోలేరు. ఇప్పుడు గ్రౌండ్ లో అదే కనిపిస్తున్నది. ఓవర్ కాంఫిడెన్స్ ఎక్కువ కనిపిస్తున్నది. బిఆర్ఎస్ ఓటమికి కారణాలు తెలుసు, మెజారిటీ అభ్యర్థులు ఎమ్మెల్యే లు గా గెలువడానికి, అంతవరదాక ఉన్న ఎమ్మెల్యే ల మీద అసంతృప్తి, ప్రభుత్వం మీద కోపం ప్రధాన కారణం గా పేర్కొనక తప్పదు. ఇది నిజం!ఇంకా ఒక రకంగా ఆ క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డి ది కూడా అనవచ్చు,ఏదో కొన్ని చోట్ల అభ్యర్థుల ప్రభావం ఉండవచ్చు, అంత మాత్రాన గ్రౌండ్ రియాలిటీ ని పరిగణ లోకి తీసుకోకుండా ప్రవర్తన కనిపిస్తున్నది

ఒకరిని మరొకరు పొగడుడే!

కాంగ్రెస్ వాళ్ళ సమావేశాల లో ఒకరిని మరొకరు పొగడుకోవడం, శాలువాలు, దండలు ఇదే జరుగుతున్నది. ఇంకా అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన మత్తులో ఉన్నట్లు కనిపిస్తున్నది, అనే విమర్శలు ఉన్నాయి. కాంగ్రెస్ గాలి ఉంది, కాని వాతావరణం లో మార్పు కు ఎంత సమయం పట్టదు అనేది తెలుసుకోవాలి! కాబట్టి నేల మీదికి వెళ్ళండి! జనం ను కలవండి! ఇష్యూ బేస్డ్ గా ఆలోచించండి! జనం ఏమీ కోరుకుంటున్నారో తెలుసుకోండి! మీ గ్యారంటీ లను జనం దాకా, ఇంటింటికి చేర్చండి!ఓవర్ కాన్ఫిడెన్స్ ఆల్వేస్ డేంజర్! గత అనుభవాలను గుణపాఠాలు గా తీసు కోండి! బీ అలర్ట్!ఏ భాయ్ జర దేఖ్ కే ఛలో! ఆగేభి నహీ! పీచేభి! నీచేభీ!

ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223

మంచి పుస్తకం జీవితాన్ని మార్చుతుంది!

పుస్తకం హస్త భూషణం.పుస్తకం అనేది నోరు తెరవని ఉపన్యాసకుడు మౌనం వహించిన మహా కవి. ఒంటరి తనం పోగొట్టే స్నేహితులు అమ్మ జన్మ ఇస్తుంది. నాన్న ధైర్యం ఇస్తాడు.అన్నయ్య రక్షణ ఇస్తాడు. స్నేహితులు సంతోషాన్ని ఇస్తారు. ఒక చెట్టు నీడను, గాలిని,పండ్లను,పూలను ఇస్తుంది.కానీ ఒక మంచి పుస్తకం ఎవరూ ఇవ్వని జ్ఞానం ఇస్తుంది. ఒంటరిగా వున్న ఓటమిని రుచి చూడనీకుండా చేస్తుంది.బయట ఎలా బతికినా మనకు ఒక విలువ ను ఇస్తుంది.చిరిగిన చొక్కా అయినా తొడుక్కో... కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో.... మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది' అంటారు కందుకూరి వీరేశలింగం. పుస్తకం చదవడంలో ఉన్న ఆనందం... అనుభూతి... అది అనుభవించే వారికే తెలుస్తుంది. పుస్తకాన్ని చదవడం కనుక అస్వాదించగలిగితే... దాన్ని మించిన తృప్తిని మరింకేదీ ఇవ్వదంటే అతిశయోక్తి కాదు. పుస్తకం అమ్మ వలే లాలిస్తుంది. నాన్న వలే ఆదరిస్తుంది. గురువులా బోధిస్తుంది... మార్గదర్శి అవుతుంది. ఒంటరితనంలో స్నేహితుడై ఓదార్పునిస్తుంది... ప్రియురాలై అక్కున చేర్చుకుంటుంది. 'పుస్తకాలు దీపాలవంటివి. వాటి వెలుతురు మనోమాలిన్యమనే చీకటిని తొలగిస్తుంది' అంటారు డాక్టర్ బిఆర్ అంబేద్కర్. ఆయుధం కత్తి అయితే శత్రువును మాత్రమే గెలవగలవు. అదే ఆయుధం పుస్తకం అయితే... ప్రపంచాన్నే గెలవగలము. అందుకే పుస్తకం అనితరమైన ఆయుధం. సమాజాన్ని ప్రగతిపథాన నడిపే దిక్సూచి పుస్తకం. మనమెంతటి ఆధునిక యుగంలో వున్నా, టాబ్‌లలో పిడిఎఫ్ పుస్తకాలు చదువుతున్నా, ఇంటర్నెట్‌లో అనంతమైన సాహిత్యం లభ్యమౌతున్నా... అవన్నీ పుస్తకాన్ని రీప్లేస్ చేయాలేవని, పుస్తకం చదివిన అనుభూతిని అందించలేవు. పుస్తకాలంటే ఇష్టపడే ఎవరికైనా ఈ విషయం అర్థమవుతుంది. ప్రతీ యేటా ఏప్రిల్ 23 న ప్రపంచ పుస్తక దినోత్సవం జరుపుతారు.



ప్రపంచ పుస్తక దినోత్సవం వెనుక ఉన్న ప్రధాన ఆలోచన ఏమిటంటే– చదవడం వల్ల కలిగే ఆనందాన్ని, అనుభూతిని చాటి చెప్పడం. పఠనాన్ని ఎక్కువ చేసి పుస్తకాల పరిధిని గుర్తించాలనేది ప్రణాళిక. యునెస్కో ప్రకారం..2021లో జార్జియాలోని టీబీలీసీ నగరాన్ని ప్రపంచ పుస్తక రాజధానిగా ఎంపిక చేశారు. ప్రతి సంవత్సరం యునెస్కో.. పుస్తక పరిశ్రమలోని మూడు ప్రధాన రంగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఇతర అంతర్జాతీయ సంస్థలు, ప్రచురణకర్తలు, పుస్తక విక్రేతలు, లైబ్రరీలతో కలిసి.. ఒక సంవత్సర కాలానికి ప్రపంచ పుస్తక రాజధానిగా టీబీలీసీ నగరాన్ని ఎంచుకున్నాయి. స్పానిష్ గొప్ప రచయిత మిగుల్ డె సెర్‌వాన్‌టెస్. ఈయన రాసిన డాన్ క్విక్సోట్ అనే నవల బాగా ప్రసిద్ధి చెందింది. ప్రపంచ సాహిత్య శిఖరాల్లో ఈ నవల అగ్రభాగాన నిలిచింది. ఈయన అక్టోబర్ 7న జన్మించగా.. ఏప్రిల్ 23న మృతి చెందారు. ఈయన మరణించిన తేదీనే పుస్తక దినోత్సవంగా జరుపుకొని ఆయనకు గౌరవం ఇవ్వాలనే ఆలోచన ప్రముఖ స్పానిష్ రచయిత విసెంటే క్లావెల్ ఆండ్రెస్‌కు వచ్చిందట. అలాగే విలియం షేక్స్‌పియర్, గార్సియాసా డి లా వేగా వంటి ప్రముఖ రచయితలు కూడా మరణించింది కూడా ఏప్రిల్ 23వ తేదీనే. అలాగే అనేక ఇతర రచయితలు పుట్టిన, మరణించిన తేదీ కూడా ఏప్రిల్ 23న కావడం వల్ల.. 1955, ఏప్రిల్ 23న యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ (యునెస్కో) తొలిసారిగా ప్రపంచ పుస్తక దినోత్సవంను నిర్వహించింది. దీంతో ప్రతిఏడాది స్పెయిన్‌లో ఘనంగా పుస్తక దినోత్సవం జరుగుతుంది. స్పెయిన్‌లోని కాటలోనియాలో పుస్తక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారు. ఇక ప్రత్యేకించి యునెస్కో.. ఈ పుస్తక దినోత్సవం సందర్భంగా.. ప్రతిఏటా పఠనాన్ని ప్రోత్సహించేవిధంగా లక్ష్యాలను ఏర్పరచుకుంది. ఆ లక్ష్యాల దిశగానే.. పుస్తకాల్ని ప్రచురించడంతోపాటు.. కాపీ హక్కులు వంటి విషయాలను ప్రోత్సహించి.. వాటి గురించి విస్తృత ప్రచారం చేయడం వంటివి చేస్తోంది.గతంలో.. వర్తమానంలో...

ఒకప్పుడు టీవీలు, సెల్‌ఫోన్లు ఏమీ లేవు. అందుకే ఎక్కువమంది పుస్తకాలు చదివేవారు. ఇప్పుడలా లేదే.. అరచేతిలో సెల్‌ఫోన్ ఉంటే.. పుస్తకాల జోలికే వెళ్లడం లేదు. ఏమైనా చదవాలనుకున్నా.. సెల్‌ఫోన్‌లోనే బుక్స్ చదువుతున్నారు. అంతలా నేడు సమాజం మారిపోయింది. ఇక పిల్లల సంగతి చెప్పుకోనక్కర్లేదు. హోంవర్క్‌లు, పరీక్షలతోనే వారి సమయం గడిచిపోతుంది. ఇక పుస్తకాల్ని చదివే తీరికెక్కడిది? గతంలో ఇంట్లో పెద్దవాళ్లు ఆదివారమో లేక, దసరా, వేసవి సెలవుల్లోనూ కచ్చితంగా పిల్లలకి నీతిని బోధించే కథల పుస్తకాలు, ఇంకా రకరాల పుస్తకాలు వారి వయసుకు తగ్గట్టుగా ఇచ్చి చదివించేవారు. అలా చదివిన తర్వాత ఎంతో ఓపిగ్గా ఆ స్తకం ద్వారా వారేం గ్రహించారో అడిగి తెలుసుకునేవారు. దీనివల్ల.. పిల్లలకి పుస్తక పఠనంపై ఆసక్తి పెరిగేది. నేడు పిల్లలకి మొబైల్ ఫోన్ ఇచ్చి ప్రోత్సహించినంతగా.... మంచి పుస్తకాలు చదివేందుకు ప్రోత్సహించడంలేదనేది నిర్వివాదాంశం. ఈ బిజీ లైఫ్‌లో పడి పిల్లల మానసికోల్లాసానికి అడ్డుకట్టలేస్తున్నామా? అనేది ఈ పుస్తక దినోత్సవం సందర్భంగా ప్రతిఒక్కరూ తమను తాము ప్రశ్నించుకోవాలి. గతంలో పుస్తకాన్ని చేతిలో తీసుకుని ప్రశాంతమైన వాతావరణంలో చదివేవారు. దాంతో వారి ఊహాశక్తితోపాటు, మానసిక ఒత్తిడి తగ్గేది. ఇప్పుడు సెల్‌ఫోన్‌లో చదవడం వల్ల అనేకంటే... ఇతరత్రా పనులకు సెల్‌ఫోన్ ఎక్కువగా వాడటం వల్ల కంటి సమస్యలు తలెత్తుతున్నాయి. 'పుస్తకం మనలో గడ్డకట్టిన సముద్రాల్ని గొడ్డలిలాగా పగలగొట్టాలి' అంటాడు ప్రముఖ రచయిత కాఫ్కా.. మన మెదడులో గడ్డకట్టిన నిర్లిప్తత, నిరాశక్తతలను బద్దలు కొడితే, అప్పుడు పుస్తకం తేటగా కనిపిస్తుంది. పుస్తకం చేతిలోకి తీసుకుంటే... పసిపాపను చేతుల్లోకి తీసుకున్నంత ఆహ్లాదం కలుగుతుంది. పుస్తకం పట్టుకుని చదవడం అలవాటు చేసుకుంటే.. ఆ పుస్తకానికి మనకి అవినాభావ సంబంధం ఏర్పడుతుంది. ఎన్నో జ్ఞాపకాల్ని మనసుల్లో నింపుతుంది. అందుకు పుస్తకాన్ని మించిన స్నేహితులు లేరు.పుస్తకం... మూడు అక్షరాలే ఉన్నా.. మానవ మెదడుకి సరికొత్త ఆవిష్కరణలను నేర్పుతుంది. కొత్త ఆలోచనల్ని రేకెత్తిస్తుంది. మనిషికి ఊహాశక్తిని కల్పిస్తుంది. పాత సమాజపు లోపాలను కనిపెట్టి.. ముందు తరాలకు ప్రగతిపథాన్ని నిర్మిస్తుంది. సమాజ పురోగతికి తోడ్పడుతుంది. తరతరాలకు విజ్ఞానాన్ని అందిస్తుంది. సమాజ పురోగతికి దోహదపడుతుంది. మానవ సంబంధాలు మెరుగుపడేందుకు సహాయం చేస్తుంది. మరీ ముఖ్యంగా మానసిక ఒత్తిడిని అధిగమించేలా చేస్తుంది. పుస్తకం వల్ల ఇన్ని ప్రయోజనాలున్నాయి. అందుకే ఈ 'పుస్తక దినోత్సవం' నుంచి కచ్చితంగా పుస్తకాలు చదవాలనే నిబంధన పెట్టుకుందాం. పుస్తక పఠనం చేద్దాం.మనస్సును ప్రశాంతంగా ఉంచుదాం.

(ఏప్రిల్ 23న ప్రపంచ పుస్తక దినత్సవం)

కామిడి సతీష్‌రెడ్డి,
తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు
9848445134

అంబేద్కర్...ఒక విజ్ఞాన ఖని!

నాడు
మంచితనం
మానవత్వమున్నజి
బరోడా మహారాజు
ఉదారహృదయంతో
అమృతహస్తాలతో ఆశీర్వదించి
అందించిన స్కాలర్ షిప్ తో
భార్యాపిల్లలను ఊరిలో
వదిలేసి
ఒంటరిగా ఓడల్లో
విదేశాలకేగి...
కసితో కృషితో...
ఒక ఆశయంతో...
గట్టి పట్టుదలతో...
తెల్లదొరల మధ్య సూటు
బూటు వేసుకొని
"తెల్లనికొంగై"తిరుగుతూ
సనాతన భారతాన తనను
సంస్కృతం చదవనివ్వకున్నా...
ఇంగ్లీష్ విద్యలో పట్టును
సాధించి
విదేశాల్లో విశ్వవిద్యాలయాల్లో
ఆర్థిక...రాజకీయ...గ్రంథాలను
న్యాయ...తత్త్వ...శాస్త్రాలను
రాత్రింబవళ్ళు ఔపాసన బట్టి
ఉన్నత విద్యను ఆర్జించి...
ఇటు భారత దేశంలోను
అటు ప్రపంచంలోను
సకల సౌకర్యాలున్న
ధనవంతుల శ్రీమంతుల
అగ్రవర్ణాల విద్యార్థులెవరూ
కలలోనైనా ఊహించని
తమ జీవితాల్లో సాధించలేని
డిగ్రీలెన్నిటినో సాధించి...
నిద్రాహారాలు మాని
ఏళ్ళతరబడి
పురాతన గ్రంథాలను
పరిశోధించి
ఏ బహుభాషా పండితులు
సైతం
వ్రాయలేనన్ని అతివిలువైన
విజ్ఞానదాయకమైన బృహత్
గ్రంథాలను భావితరాలకోసం
వ్రాసిన
చరిత్రగదిలో రహస్యనిధిలా
దాచిన
అపర మేధావి...విజ్ఞాన గని
అంబేద్కర్
ఓ జాతినేతా...
ఓ అందరివాడా...
ఓ ఆత్మబంధువా...
ఓ జ్ఞానసూర్యుడా...
ఓ విశ్వమానవుడా...
ఓ పోరాటయోధుడా...
ఓ బహుముఖ ప్రజ్ఞాశాలీ...
ఓ ఉద్యమాల యుద్ధనౌకా...
ఓ భారత రాజ్యాంగ
నిర్మాతా...
ఓ భావిభారత స్ఫూర్తి
ప్రదాతా...
ఓ అణగారిన వర్గాల
ఆశాజ్యోతీ...
ఓ చదువులమ్మ ముద్దుల
తనయుడా...
ఓ భారతరత్న అమరజీవి
అంబేద్కరా...
రాజ్యాంగంసాక్షిగా మీకిదే మా
అక్షరాంజలి

పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్
9110784502

ఎన్నికలలో... ఎన్ని కళలో...

ఎన్ని కలలో ఎన్ని కలలో
ఎన్నికల వేళ ఎన్నెన్ని కలలో
ఎన్ని హామీల సునామీలో
ఎన్ని వాగ్దాన ప్రవాహాలో

ఎన్ని కలలో మరెన్ని కలలో
ఎన్నికల వేళ ఎన్ని
ఇంద్రజాలాలో
ఎన్ని కండువాల మార్పిడీలో
ఎన్నికల పండుగ
కోలాహలాలో

ఎన్ని కలలో ఎన్ని కలలో
ఎన్ని కుల సమీకరణాలో
ఎన్ని సంకుల సమరాలో
ఎన్ని స్నేహ సంగమాలో

ఎన్ని కలలో ఎన్నికలలో
ఎన్ని కళలో ఎన్ని వలలో
ఎన్ని అలకలో ఎన్ని కలతలో
ఎన్ని తాయిలాల పంపకాలో
ఎన్ని ఆశలో ఎన్ని బాసలో
ఎన్ని మార్పులో ఎన్ని
చేర్పులో
ఎన్ని కూర్పులో ఎన్ని నేర్పులో
ఎన్నెన్ని బుజ్జగింపులో ఎన్నెన్ని
సయోధ్యలో

జాగ్రత్త ఓటరన్నా నోటు కన్నా
ఓటు మిన్నా
బాగా ఆలోచించి మంచికి
చోటివ్వుమన్నా
బాటిల్ బిర్యానీ ఆశల వలలో
చిక్కకన్నా
ఆత్మాభిమానమే చంపుకుని
హీనంగా బ్రతక కన్నా
ఓటు విలువే తెలుసుకుని
విచక్షణతో మెలుగు మన్నా
ప్రజాస్వామ్యం పచ్చని చెట్టు
నడుంకట్టి రక్షించుమన్నా
ప్రతి ఒక్కరు భాధ్యతగా
ఓటునే వెయ్యాలన్నా
ఓటనే వజ్రాయుధాన్ని
ధీరుడవై ధరించుమన్నా
అభివృద్ధి సంక్షేమాలే దేశ
ప్రగతికి సోపానమన్నా

– గుండాల నరేంద్రబాబు
తెలుగు సాహిత్య
పరిశోధకులు
శ్రీ వెంకటేశ్వర
విశ్వవిద్యాలయం,
తిరుపతి,
9493235992

మా వోడు కనిపించాడా..

ఎందుకో గాని..
నాకు నేను
బాగా ఇష్టపడుతున్న వాళ్లు
పరాయి వాళు గా
కనిపిస్తున్నారు..
పలకరింపుగానో..
పనిబడో..
మాట్లాడాల్సివచ్చినా
సూటిగా కళ్ళల్లోకి
చూడలేకపోతున్నాను..
ఏది చెప్తున్నా
వాళ్లు కూడా..
వాళ్ళ అప్పటి అవసరం కోసం
వొకటీరొండు పొడి మాటలకు
పదాలు పరిమితం చేసి
అలా పలకరించేవాళ్ళు..
ఏమాత్రం ముఖ్యమైనవి
ఉండవు కానీ
ఇష్టమైన వాళ్ళతో
సమయాన్ని లెక్కపెట్టకుండా
గలగలా పారే
సెలయేటి
పొంగులైపోతుంటారు..
అది వేరులే.
విషయాలూ మాటలూ
లేవనడానికి లేదు కానీ..
ఇటొచ్చేసరికి
సమస్య ఏమిటంటే
వాళ్ళతో
సరిపడాలి కదా మనం..
అసలా చూపులకు
ఆనాలి కదా మనం..
అనేవాడు..
ఏం చూశాడో
ఏం విన్నాడో గానీ..
చెదమేసిన చెత్తనెల్లా
కప్పుకు పోయే ధోరణి
అలవాటైపోతెట్లనెవాడు..
కీర్తి కాంక్షల కక్కుర్తి
సోయి దప్పి
చిందులేస్తుందని
అగ్గయ్యే టోడు..
ఇంతకీ.. మీకెవరికైనా
కలిశాడా మావాడీమధ్య..
రోజంతా జరిగినవన్నీ
నాతో చెప్పుకోలేకుండా
ఉండలేడు వాడు..
నేనుకూడా నీవెంటే
ఉండి చూసాను కదాఅన్నీను..
అన్నా వినకుండా
చెప్పుకు పోయే వాడు..
నిజానికి
నేనూ వాడూ వేరుకాదు..
దేహమూ మనస్సూ
సగం సగమో..
సంపూర్ణ ఐక్యమో గాని..
మావాడిని వదిలి
నేనొక్క క్షణముండిందీ లేదు.
నా తోడు లేకుండా
మావాడొక్క ఘడియ
గడిపిందీ లేదు..
ఏమవుతామో..
ఒకరికొకరం
మే మేమౌతామో..
బహుశా
వాడి అనుభవాలన్నీ
భద్రపరిచే
బ్లాక్ బాక్స్ నేమో నేను..
గుట్టుగా
గుండెమీద రాల్చుకున్న
కన్నీటి చుక్కల్ని
ఒడిసి పట్టి
వళ్ళో కెత్తుకున్న
విత్తనాల బుట్టనేమో నేను..

డాక్టర్ ఇక్బాల్ బాషా.
జోగులాంబ గద్వాల,
944077 5732.

మాట్లాడే మిత్రులు

బడిలో
పెన్నుల్ని పోగొట్టుకున్నాను
పుస్తకాల్ని పోగొట్టుకున్నాను
బస్సుల్లోజి
పర్సుల్ని పోగొట్టుకున్నాను
టిఫిన్ బాక్స్ని పోగొట్టుకున్నాను
దళారుల చేతుల్లో
ప్లాట్లని పోగొట్టుకున్నాను
దాయాదుల పోరుల్లో
ఇళ్ళను పోగొట్టుకున్నాను
కానీ
మాట్లాడే మిత్రుల్ని
అక్కున చేర్చుకునే ఆప్తుల్ని
పోగొట్టుకోలేదు

కోటం చంద్రశేఖర్
9492043348

దేశ భవిష్యత్తును మార్చే ఎన్నికలివి

- ఇండియా కూటమిలో ఒకరంటే ఒకరికి పడదు
- పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ వ్యాఖ్యలు
- ప్రత్యేక నిధులు తెచ్చి చేవెళ్లను అభివృద్ధి చేస్తా..
- నామినేషన్ దాఖలు చేసిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి

రాజేంద్రనగర్/రంగారెడ్డి ఏప్రిల్ 22 (జనం సాక్షి)

చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి రాజేంద్రనగర్లోని ఎమ్మార్వో కార్యాలయంలో తన నామినేషన్ ను దాఖలు చేశారు. కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్, రాజ్యసభ సభ్యులు, బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కే. లక్ష్మణ్ వెంట రాగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి నామినేషన్ ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా పీయూష్ గోయెల్ మాట్లాడుతూ..ఈ ఎన్నికలు దేశ భవిష్యత్తును మార్చే ఎన్నికన్నారు. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని మంత్రి కావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి ఎదురులేదన్నారు. ప్రతిపక్షాలు తమ తమ సిద్ధాంతాలను పక్కనపెట్టి ఇండియా కూటమి పేరుతో ఏకమయ్యాయన్నారు. అయితే ఆ కూటమిలోని పార్టీలకు ఒకరంటే మరొకరికి పడదని పియూష్ గోయెల్ ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ కేరళకు వెళ్లి విజయన్ ను, బెంగాల్ కు వెళ్లి మమతా బెనర్జీని విమర్శించడం ఇందుకు నిదర్శనమని ఆయన చెప్పారు. ఇక దేశంలోని నిరుపేదలు, మహిళలు, వృద్ధులు, యువత సహా అన్ని వర్గాల ప్రజల కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం పని చేస్తోందని పియూష్ గోయెల్ తెలిపారు. మోదీ అనుసరించిన సమర్థవంతమైన విధానాలతో భారతదేశంలో పేదరికం తగ్గిందని ఆయన చెప్పారు. 2030నాటికి భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని గోయెల్ ఆశాభావం వ్యక్తం చేశారు. 2030 నాటికి దేశంలో పేదరికం అంతరించిపోనుందని ఆయన అన్నారు.

భారీ మెజార్టీతో గెలవబోతున్నా : కొండా

చేవెళ్ల నియోజవర్గంలో తాను భారీ మెజార్టీతో గెలవబోతున్నానని బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అన్నివర్గాల ప్రజలు తన గెలుపులో భాగం కాబోతున్నారని ఆయన చెప్పారు. దేశం కోసం అహర్నిశలు పని చేస్తున్న నరేంద్ర మోదీని మరోసారి ప్రధానిని చేయడానికి చేవెళ్ల ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు. తాను ఎంపీగా విజయం సాధించిన వెంటనే కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులను తీసుకొచ్చి చేవెళ్లను అభివృద్ధి చేస్తానని కొండా విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆయుష్మాన్ భారత్, ఫసల్ బీమా యోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన వంటి పథకాలు రాష్ట్రంలో అమలు కాకపోవడంతో ప్రజలు నష్టపోయారని ఆయన చెప్పారు. రాష్ట్రంలో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన చెప్పారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ దేవి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, కంటెస్టెడ్ ఎమ్మెల్యేలు రవికుమార్ యాదవ్, అందెల శ్రీరాములు, వీరేందర్ గౌడ్‌తో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న బిజెపి నాయకులు, కార్యకర్తలు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి అనుచరులు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యం

'ఓక్రిడ్జ్' ప్రిన్సిపాల్ బల్జీత్ ఒబెరాయ్

హైదరాబాద్ ఏప్రిల్ 22 (జనం సాక్షి)

పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యమని ఓక్రిడ్జ్ బాచుపల్లి ప్రిన్సిపాల్ బల్జీత్ ఒబెరాయ్ తెలిపారు. ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ బాచుపల్లి ఆధ్వర్యంలో 'టెడో థాట్ లీడర్స్ ఇన్ ది మేకింగ్' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ఐదు నుంచి ఏడు సంవత్సరాల వయస్సు గల యువకులు సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్డీజీలు), పిల్లల హక్కులపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి రావడం ఆనందంగా ఉందన్నారు. ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ బాచుపల్లి హెడ్ నందిని మాథుర్ మాట్లాడుతూ.. ఇది పిల్లల్లో ఒక మార్పును సూచిస్తుందన్నారు. మా యువ అభ్యాసకులు ప్రదర్శించే మేధో ఉత్సుకత తాదాత్మ్యతను చూడటం విశేషమైనదన్నారు. చిన్న వయస్సులోనే ప్రపంచ సమస్యలతో నిమగ్నమవ్వడం ద్వారా కేవలం నేర్చుకోవడమే కాదు, ప్రపంచాన్ని చూడగలుగుతారని తెలిపారు.

బిజెపి గెలుపుకై ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలి

కర్ణాటక రాష్ట్రం బెల్గం బిజెపి ఎమ్మెల్యే అభయ్ పాటిల్

మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)

మహబూబ్ నగర్ బిజెపి ఎంపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపు కోసం పార్టీ శ్రేణులు కష్టపడి పని చేయాలని కర్ణాటక రాష్ట్రం బెల్గం బిజెపి ఎమ్మెల్యే అభయ్ పాటిల్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారి శృతిలు అన్నారు. సోమవారం పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్ రెడ్డి అధ్యక్షతన మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో మహబూబ్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గం, దేవరకద్ర అసెంబ్లీ నియోజక వర్గాల బిజెపి పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను బూత్ స్థాయిలో ప్రతి ఒక్క ఓటర కలిసి ప్రచారం నిర్వహించాలని సూచించారు. కాంగ్రెస్కు ఎందుకు ఓటు వేయకూడదో, బిజెపికి ఎందుకు వేయాలో ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. దేశం కోసం నరేంద్ర మోడీ చేస్తున్న కృషి గురించి ప్రజలకు వివరించాలని వారు సూచించారు. ఈ విషయంలో ముఖ్యంగా యువత పార్టీ కోసం కష్టపడి పని చేయాలని వారు కోరారు. ఎన్నికల్లో మన అభ్యర్థి గెలవాలంటే ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త ఒక సైనికునీ వలె పనిచేయాలని వారు సూచించారు. మళ్లీ ప్రధాని నరేంద్ర మోడీ అయితేనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, శత్రు దేశాల నుండి భారతదేశాన్ని కాపాడుకునే సత్తా ఒక బీజేపీకే ఉందని, అది నరేంద్ర మోడీకే సాధ్యమని వారు పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో పార్టీకి సంబంధించి మండల అధ్యక్షులు వారి వారి మండల స్థాయి లో జరిగిన సమావేశాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ గెలుపు కోసం కార్యకర్తలకు వారు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఇంఛార్జి ఏవిఎన్ రాజు రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు పి శ్రీనివాస్ రెడ్డి, ఎగ్గని నర్సింలు, సుదర్శన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ రమేష్ కుమార్, కిరణ్ కుమార్ రెడ్డి, కొండా ప్రశాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి

మహేశ్వరం, ఏప్రిల్ 22 (జనం సాక్షి)

చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టీపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణ పురం డివిజన్ బిఆర్ఎస్ బీజేపీ నుండీ పార్టీ ముఖ్య నాయకులు, సీనియర్ మాజీ కౌన్సిలర్, డెక్కర్ నాయక్, పాంమ్ యాదగిరి,మహమ్మద్ షఫీ, మహమ్మద్ పటేల్, ఎండి పాషా, ఇస్మాయిల్, సురేష్ ముఖ్య నాయకులు భారీ ఎత్తున చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతూ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టీపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి. చిలుక ఉపేందర్ రెడ్డి, రామకృష్ణ పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే ప్రజలు దేశవ్యాప్తంగా గత 10 ఏళ్లలో బిజెపి వారు బిఆర్ఎస్ దోపిడి పాలనతో విసిపోయారని తెలిపారు, అదే క్రమంలో గడిచిన 100 రోజుల్లోనే కాంగ్రెస్ ఇచ్చిన మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు మహాలక్ష్మి, రైతు భరోసా, ప్రతి కుటుంబానికి 200 ఉచిత విద్యుత్, యువ వికాసం హామీలను ప్రజలు గుర్తించాలని అన్నారు. అదేవిధంగా చేవెళ్ల పార్లమెంట్ నుంచి మన గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, రామకృష్ణ పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత పిట్ట హరినాథ్ రెడ్డి, టీపిపిసి ఎన్నికల ఇన్చార్జి నిజాముదిన్, నేరేల్ల శారద, అమరేందర్ రెడ్డి, జడ్పిటిసి ఛైర్పర్సన్ అనిత హరినాథ్ రెడీ యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్ నేత, గట్ల రవీంద్ర, యాదయ్య, లింగస్వామి గౌడ్, పగడాల ఎల్లయ్య, జ్ఞానేశ్వర్ యాదవ్, రాజు నాయక్, శేఖర్ ముదిరాజ్, పగడాల శ్రీశైలం, అక్బర్, కల్యాణ్ యాదవ్, పురుషోత్తం , సత్తి, సురేష్, సాలి, విజయ్, కృష్ణ, దల్లి, మణికంఠ, రఫీ, కిరణ్, హరీ, జాంగిర్, శివ, సురేష్ ఇస్మాయిల్, పింటు, శ్రీకాంత్ రెడ్డి, సలీం, శ్రవణ్, కాళిదాస్, శ్రీధర్, శ్రీనాథ్, శ్రీశైలం, లక్ష్మి, రేణుక, సరస్వతి, మాధవి, సుజాత రెడ్డి, శైలజ రెడ్డి, సంతోష్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్లోళ్ల కుటుంబం తుదిశ్వాస విడిచే వరకు చేవెళ్ల ప్రజలకు సేవలందిస్తా

మాజి మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి

చేవెళ్ల, ఏప్రిల్ 22 (జనం సాక్షి)

పట్లోళ్ల కుటుంబం చేవెళ్ల ప్రాంత ప్రజలకు అండగా ఉంటామని మా కుటుంబానికి రాజకీయ జీవితం ఇచ్చిన చేవెళ్ల ప్రాంత ప్రజలకు ప్రతి శ్వాస విడిచే వరకు సేవ చేస్తానని మహే శ్వరం ఎమ్మెల్యే మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. దివం గనేత మాజీ హోం మంత్రి ఇంద్రారెడ్డి 24వ వర్ధంతి సందర్భంగా సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలోని శంకర్పల్లి చౌరస్తాలో ఇంద్రా రెడ్డి విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. అంతరం చేవెళ్ల మండల పరిధిలోని సొంత గ్రామమైన కౌకుంట్ల గ్రామంలో ఇంద్రారెడ్డి సమాధిపై పూలు వేసి కుటుంబ సభ్యులు కార్తిక రెడ్డి, కళ్యాణ్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, కోడళ్ళు చేవెళ్ల ఎమ్మెల్యే కాల యాదయ్య, పలువురు నాయకులతో కలిసి సబితా ఇంద్రారెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్, జడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, బిఆర్ఎస్ కెవి రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, చేవెళ్ల మాజీ ఎంపీపీ బాలరాజు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి హన్మంత రెడ్డి, వైస్ ఎంపీపీ కర్నే శివప్రసాద్, ఎంపిటిసి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పట్టా పాస్ బుక్కులు వచ్చాయంటూ చదును చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు

- ఎన్నికల హడావిడిలో అధికారులు
- మిగత భూమి కాపాడాలంటూ తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేసిన గ్రామస్తులు

శంషాబాద్, ఏప్రిల్ 22 (జనం సాక్షి)

సుల్తాన్ పల్లి భూములను రైతులకు చెందే విధంగా చొరవ తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. శంషాబాద్ మండల పరిధిలోని సుల్తాన్ పల్లి రెవెన్యూ పరిధిలోని భూములను రైతులకు చెందే విధంగా చొరవ చూపాలని సోమవారం గ్రామ మాజీ వార్డు సభ్యులు వీరాచారి, నవీన్, కషాప్ కుమార్‌లు శంషాద్ మండల తాసిల్దార్ కార్యాలయంలోని డిప్యూటీ తాసిల్దార్ సంతోష్ కుమార్‌కి ఫిర్యాదు చేశారు. సందర్భంగా మాట్లాడుతూ శంషాబాద్ మండలం సుల్తాన్ పల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 122,143 వరకు 150 నుంచి 152 బై ఏ,వరకు 152, బై, బీ,153 ,నుంచి 154 లలో మొత్తం 232 ఎకరాలు భూమి ఉంది. ఆ భూములలో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమదేనని పట్టాదార్ పాస్ బుక్కులు వచ్చాయంటూ భూమిని కబ్జా తీసుకుంటున్నారు. ఆ భూమిని డోజర్ల సహాయంతో చదును చేస్తున్నారు. స్థానికులమైన మేము ప్రశ్నిస్తే మాకు హైకోర్టు ఆర్డర్ వచ్చిందంటూ చూపుతున్నారు. ధరణి ప్రకారం హైకోర్టు నుంచి 186, ఎకరాల 18 గుంటల భూమికి మాత్రమే పత్రాలు ఉన్నాయి. ఎన్నికల హడావిడిలో అధికారులు ఉండడంతో సదురు వ్యక్తులు 232 ఎకరాలను కబ్జాకు తీసుకుంటున్నారు. మిగతా భూమిని గ్రామ రైతులకు చెందే విధంగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు రెవెన్యూ అధికారులను కోరారు.

ఆరు గ్యారంటీలు..భస్మాసుర హస్తం

- రేవంత్ రెడ్డి అంటే మాటల కోతలు.. కాంగ్రెస్ అంటే కరెంట్ కోతలు
- మాజీమంత్రి హరీష్ రావు

సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 22 (జనం సాక్షి)

ఆరు గ్యారెంటీలు ఆ పార్టీ పాలిట భస్మాసుర హస్తం అవుతుందని హరీష్ రావు కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ పచ్చి అబద్ధాలు చెప్పి అధికారం లోకి వచ్చిందని హరీష్ రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో మాజీ మంత్రి హరీష్ రావు సమావేశంనిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడతూ.. అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా సాధ్యం కానీ హామీల తో పార్టీ ఊదరగొడుతుందని ప్రస్తుతం లోక్ సభభ ఎన్నికల్లోను ప్రజలని మోసం చేస్తుందని కాంగ్రెస్ పార్టీపై హరీష్ రావు మండిపడ్డారు.పార్టీ కార్యక్రమాలు సీఎం రేవంత్ రెడ్డికి ముఖ్యమైపోయాయని అన్నారు. మార్కెట్ యార్డుల్లో రైతులు ధాన్యం తడిస్తే పరామర్శించాల్సింది పోయి బహిరంగ సభలు జరుపుతున్నారని మండిపడ్డారు. ప్రజా పాలనని సీఎం రేవంత్ రెడ్డి గాలికి వదిలేసారని అన్నారు. 6 గ్యారంటీలే ఆ పార్టీ పాలిట బస్మాసుర హస్తం అవుతుందని హరీష్ రావు అన్నారు .ఆగస్టు 15 లోపు 39 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేయకపోతే రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తావా అంటూ సవాల్ విసిరారు. రైతు బంధు పూర్తిగా ఇవ్వలేదు ఇంకా ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తా అంటున్నాడని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మీరిచ్చిన గ్యారెంటిలే మీకు భస్మాసురహస్తం అవుతాయని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నన్ను ఎందుకు ఓడించాలో చెప్పాలని ప్రశ్నించారు. రైతురుణమాఫీ, రైతు భరోసా, ధాన్యానికి బోనస్, ఆసరా పెన్షన్ పెంపు, మహిళలకు 2500 రూపాయల సహాయం, కళ్యాణాలక్ష్మికి తులం బంగారం, నిరుద్యోగ భృతిపై మాట తప్పినందుకు కాంగ్రెస్ ని ఓడించాలని పిలుపునిచ్చారు.

నేహా హత్యకు కారణమైన నిందితుడు ఫయాజ్‌ను బహిరంగంగా ఉరితీయాలి

ఏబీవీపీ పాలమూరు జిల్లా కన్వీనర్ సతీష్

మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)

కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీలో బివిబి కాలేజీలో ఎంసీఏ చదువుతున్న విద్యార్థిని నేహా హిరేమత్‌ను లవ్ జిహాదీలో భాగంగా ఫయాజ్ దారుణంగా హత్య చేయడాన్ని ఖండిస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో క్యాండిల్ మార్చ్ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సతీష్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు, విజ్ఞాన దేవాలయాలని, అలాంటి దేవాలయంలో విద్యార్థిని నేహా హిరేమత్ దారుణ హత్యకు గురైన ఘటన విద్యార్థి లోకంలో భయానక వాతావరణాన్ని సృష్టించిందన్నారు. కెవిబి టెక్నికల్ యూనివర్సిటీలో ఎంసీఏ చదువుతున్న విద్యార్థిని నేహా హిరేమత్ లవ్ జిహాదీలో భాగంగా క్రూరమైన జిహాదీ మనస్తత్వానికి చెందిన పయాజ్ తో ప్రేమలో పడాల్సిందిగా ఒత్తిడి తెచ్చాడనీ, ప్రేమను తిరస్కరించినందుకు ఆమెను అనాగరికంగా ఆమె కళాశాలలోకి ప్రవేశించి కత్తితో 9 సార్లు పొడిచి దారుణంగా హత్య చేశాడని ఆయన ఆరోపించారు. కర్ణాటక రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయనడానికి ఇది ఒక ఉదాహరణ అన్నారు. చట్టాలు, పోలీసులు అంటే భయం లేని జిహాదీ మనస్తత్వం ఉన్న ఫయాజ్ లాంటి దుర్మార్గులు ఇలాంటి ఘోరాలకు పాల్పడతారని, ఇలాంటి వారు కర్ణాటక లాంటి అలసత్వ ప్రభుత్వం లో రేపు చట్టం నుండి కూడా తప్పించుకునే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో దేశం లోని విద్యార్థి లోకం భయాందోళనకు గురవుతోందన్నారు. కర్ణాటక పోలీసులు వెంటనే తగు విచారణ జరిపి నిందితుడిని కఠినంగా శిక్షించి విద్యార్థినీ కుటుంబానికి న్యాయం చేయాలని, కర్ణాటక రాష్ట్ర పోలీసులు పాఠశాలలు మరియు కళాశాలలకు సమీపంలో అమ్మాయిల భద్రత దృష్ట్యా తగు రక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కర్ణాటకలో రోజురోజుకు దిగజారుతున్న శాంతిభద్రతలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి చర్యలు చేపట్టాలన్నారు. ఇలాంటి నిందితులను ప్రభుత్వాలు కఠినంగా శిక్షించాలని, ఈ కేసులో పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత స్థాయి విచారణ చేపట్టాలని, లేదా ఈ కేసును సిబిఐకి అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి కేసుల్లో నిందితులకు కఠిన శిక్ష పడకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి పోలీస్ శాఖకు చెడ్డ పేరు వస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు వరుణ్, అరుణ్, వేణు కార్తీక్, నగేష్, భాస్కర్, అరవింద్, శంకర్, దీపు, తదితరులు పాల్గొన్నారు.

మీ ఆశీస్సులు తోడైతే పాలమూరు భవిష్యత్తుకు ఢోకా లేదు

మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)

మీ ఆశీస్సులు తోడైతే పాలమూరు భవిష్యత్తుకు ఢోకా లేదని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివిటిపల్లి డబుల్ బెడ్ రూం పూజారులు (అయ్యగార్లు , అమ్మగార్లు)అధిక సంఖ్యలో మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరూ క్షేమంగా ఉండాలని ఆకాంక్షించే మీరు మాకు తోడుగా ఉండి కాంగ్రెస్ పార్టీ లో చేరడం మాకు సంతోషం తో పాటగా కాంగ్రెస్ పార్టీ కి మరింత బలాన్ని, శక్తిని అందిస్తుందని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తు లో మీ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబ్ నగర్ జిల్లా వాసి కాబట్టి అన్ని విధాల జిల్లా అభివృద్ధికి ఆయన కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు . పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చి ఎంపీ అభ్యర్థి చల్ల వంశీచందర్ రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చేరికలు కమిటీ చైర్మన్ సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, ఎపి మిథున్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, ధర్మపురం ప్రతాప్ రెడ్డి, ఆజ్మత్ ఆలి, జేసిఆర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కనీస సౌకర్యాలు సిద్ధం చేయాలి

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి బ్యూరో ఏప్రిల్22 (జనంసాక్షి)

మే 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కనీస మౌలిక సౌకర్యాలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం పెద్ద మందడి మండల పరిధిలోని జగత్ పల్లి, మణిగిల్ల గ్రామాల పరిధిలో ఉన్న 81, 82, 79, 80 నెంబర్ పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. ఆయా పోలింగ్ స్టేషన్లలో ఓటర్ల జాబితాలను పరిశీలించారు. బి.ఎల్వో వద్ద ఉన్న ఓటరు జాబితాను పరిశీలించారు. డూప్లికేట్ ఓట్ల తొలగింపు, 85 సంవత్సరాల వయస్సు పూర్తి అయిన వారు, దివ్యాంగుల పేర్లు గుర్తించి మార్కింగ్ చేసిన వివరాలను పరిశీలించారు. పోలింగ్ స్టేషన్లలో కనీస మౌలిక సదుపాయాలు(లైట్లు, ఫాన్‌లు, తాగు నీరు, మరుగుదొడ్లు) ఉండాలని ఆదేశించారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించే దిశగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. మణిగిల్ల గ్రామ శివారులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కేంద్రం ఇంచార్జికి సూచించారు. రైతులకు ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పించాలని సూచించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన

పెద్ద మందడి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్సకై వచ్చిన రోగులను, ఆసుపత్రి పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఎమ్మార్వో వెంకటేశ్వర్లు, వైద్యధికారి సాయి ప్రసాద్, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
23 ఏప్రిల్ 2024

సంక్షేమ పథకాలను పాతరేసిన రేవంత్ సర్కార్

సమన్వయంతో పని చేద్దాం.. రికార్డు మెజారిటీ అందిద్దాం

- రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ గెలిచే మొదటి పార్లమెంట్ సీటు మెదక్
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్చెరు ఏప్రిల్ 22 (జనం సాక్షి)

తెలంగాణ ప్రజలు ఎంతో నమ్మకంతో కాంగ్రెస్ పార్టీకి అధికారం అందిస్తే, ఐదు నెలల పాలనలో సంక్షేమ పథకాలకు పాతర వేస్తూ.. రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. రాబోయే లోక్ సభ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకటరామిరెడ్డి విజయానికి కార్యకర్తలు నాయకులు, సమన్వయంతో పనిచేసి.. పటాన్చెరు నియోజకవర్గం నుండి రికార్డు మెజార్టీ అందించాలని స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ పార్టీ పటాన్చెరు డివిజన్ మరియు పటాన్చెరు మండలాల మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్న లోక్ సభ ఎన్నికలు ఇటు రాష్ట్రానికి అటు బిఆర్ఎస్ పార్టీకి కీలకమని తెలిపారు. పార్లమెంట్లో తెలంగాణ వాదం బలంగా వినిపించాలన్న,రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలపై ప్రశ్నించాలన్న,బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పటాన్చెరు అసెంబ్లీ నియోజకవర్గం నుండి మూడుసార్లు బిఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించిందని, ఇదే స్ఫూర్తితో లోక్ సభ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త పనిచేయాలని కోరారు. ప్రతి పార్టీలో లోటు పాట్లు ఉండడం సహజమని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఇవి సెమీఫైనల్స్ లాంటివని తెలిపారు. బూత్ స్థాయి నుండి ప్రణాళికబద్ధంగా పనిచేసి, ఓటర్ కు బిఆర్ఎస్ పార్టీ ఆవశ్యకతను వివరించాలని కోరారు. మాజీ కలెక్టర్, సమర్థుడైన బిఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి లాంటి వ్యక్తిని పార్లమెంటుకు పంపిస్తే, మెదక్ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయింపచేస్తారని తెలిపారు. ప్రభుత్వ నిధులతో పాటు 100 కోట్ల రూపాయలతో పేద ప్రజల కోసం ట్రస్ట్ ఏర్పాటు చేయబోతున్నట్లు ఇప్పటికే ఆయన హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, సీనియర్ నాయకులు శంకర్ యాదవ్, ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, జెడ్పిటిసి సుప్రజా వెంకట్ రెడ్డి, పటాన్చెరు కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీలు యాదగిరి యాదవ్, శ్రీశైలం యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పార్టీ మండల అధ్యక్షులు పాండు, డివిజన్ అధ్యక్షులు ఆష్టల్, ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, కుమార్ గౌడ్, మెరాజ్ ఖాన్, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి:జిల్లా ఎస్పీ

నారాయణపేట జిల్లా బ్యూరో ఏప్రిల్ 22 (జనం సాక్షి):

ప్రజావాణి కార్యక్రమంలో బాగంగా వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ బాధితుల నుండి 08 ఫిర్యాదులను స్వీకరించారు. వాటిని చట్టప్రకారం పరిశీలించవలసిందిగా సీఐ, ఎస్సైలకు సూచించారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని ఫిర్యాదుదారులకు ఎస్పీ సూచించారు. బాధితులు తీసుకొవచ్చే ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్లో ఉంచరాదని వాటిని తక్షణమే పరిష్కరించాలని ఫోన్లో మాట్లాడి సంబంధిత అధికారులకు సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తుందని, పోలీసులు ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించి వారికి సరైన న్యాయం అందించి భరోసా, భద్రత కల్పించాలని సూచించారు.ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ పెరుగుతున్నందున సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి కావున ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయంలో డయల్ 100 లేదా 1930కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

కళాకారుల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే

గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 22 (జనం సాక్షి)

గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు త్వరలో జరగబోయే నాగర్ కర్నూల్ పార్లమెంటు ఎన్నికల సందర్భంగా అభ్యర్థి డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ తరపున గద్వాల నియోజకవర్గంలోని ప్రచారానికి సంబంధించిన కళాకారుల వాహనాన్ని సోమవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత గడ్డం కృష్ణారెడ్డి, జెడ్పిటిసి రాజశేఖర్, వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి ధరూర్ మండల పార్టీ అధ్యక్షుడు డి.ఆర్ విజయ్, మున్సిపల్ కో ఆప్షన్ నెంబర్ మోబిన్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సతీష్, వంట భాస్కర్, మోబిన్, పవన్ యాదవ్, ఈశ్వర్, మన్యం, ప్రదీప్, కళాకారులు చరణ్ బృందం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తులకు అండగా నిలిచిన కెసిఆర్

- ఉపాధి హామీ పథకం వ్యవసాయానికి అనుసంధానం చేయాలి
- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కి మద్దతుగా అధికార ప్రతినిధి వాకిటిశ్రీధర్ ముమ్మర ప్రచారం

శ్రీరంగాపూర్ ఏప్రిల్ 22 (జనం సాక్షి)

శ్రీరంగాపూర్ మండలం తాటిపాముల గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్నర్ మీటింగ్ నందు శ్రీదర్ మాట్లాడుతూ హామీలు అమలు పరచనీ కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాతపెట్టాలని అన్నారు. చేపలు పడుతున్న మత్యకారుల దగ్గరకువెళ్ళి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌రికి మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. మత్యకారుల సంక్షేమం కోసం కెసిఅర్ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చెరువులు నింపి చేప పిల్లలను ఇచ్చి వాటిని సంరక్షించి రవాణా చేయడానికి వాహనాలు సమకూర్చి వారి అభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. ఉపాధి కూలీలతో మాట్లాడుతూ వ్యవసాయానికి అనుసంధానం చేసి జీవిత భీమా,కూలీల భద్రత చర్యలు కె.సి.అర్ చేపట్టారని అన్నారు. కె.సి.అర్.ఆశీర్వదించి పంపిన ప్రవీణ్ కుమార్ గారి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు వెంకటస్వామి, సింగిల్ విండో చైర్మెన్ జగన్నాథ నాయుడు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ యాదవ్, సుదర్శన్ రెడ్డి, హరిఫ్, మాజీ ఉపసర్పంచ్ కురుమన్న, మాజీ వార్డ్ మెంబర్ ఆంజనేయులు, కురుమన్న, బాలరాజు, చక్రవర్తి, హరికృష్ణ, చంద్రయ్య, వెంకటేష్, స్వామి, సాయిలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

వంశీ చందర్ రెడ్డిని గెలిపిస్తే మాగనూరు మండలంలో ప్రత్యేక అభివృద్ధి

ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మాగనూరు ఏప్రిల్ 22 (జనం సాక్షి):

పార్లమెంట్ సభ్యునిగా కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీ చందర్ రెడ్డిని గెలిపిస్తే మాగనూరు మండలంలో ప్రత్యేక అభివృద్ధి పనులు చేపడతామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. హర్ గావ్ ఎక్ గంటే కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన మండల కేంద్రంతో పాటు మండలంలోని వడ్వాట్, అమ్మపల్లి, అడవి సత్యారం, కొల్పూర్ గ్రామాల్లో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ..మాగనూరు మండలాన్ని వ్యవసాయ హబ్బుగా తీర్చిదిద్దుతానని, ఉమ్మడి మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని అన్నారు. ఎంపీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి వంశీచందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు గవినోల గోపాల్ రెడ్డి, రవి కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆనంద్ గౌడ్, రాజప్ప గౌడ, నాయకులు నరసింహారెడ్డి ,వాకిటి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, శివరాంరెడ్డి, రవీందర్, శంకర్ లింగం, ఉజ్జల్లి కృష్ణయ్య, ముష్టి లక్ష్మన్న, ఉదయ్ కుమార్, వేణుగోపాల్, గడ్డం నరేష్, యువ నాయకులు వేణు గౌడ్ దండు ఆనంద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిఆర్ఎస్, కాంగ్రెస్‌కు ఓటువేసి మోసపోవద్దు

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబి రెడ్డి వెంకట్ రెడ్డి

వనపర్తి బ్యూరో ఏప్రిల్ 22 (జనం సాక్షి)

స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన బిఆర్ఎస్, కాంగ్రెస్ కు ఓటు వేసి మోసపోవద్దని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం అచ్యుతాపురం గ్రామంలో బిజెపి ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబిరెడ్డి వెంకటరెడ్డి ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ గ్రామాలలో సిసి రహదారులు, డ్రైనేజీ నిర్మాణం స్వచ్ఛభారత్ ద్వారా మరుగుదొడ్ల నిర్మాణం, నర్సరీల నిర్వహణ, హరితహారం కింద మొక్కలు నాటడం వాటిని సంరక్షించడం, వీధులలో ఎల్ఈడి లైట్లు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, రైతు వేదికలు, గ్రామపంచాయతీ ద్వారా చెత్త సేకరణ మరియు సెగ్రిగేషన్ చేయడం, ఉపాధి హామీ పథకం ద్వారా 150 రోజుల ఉపాధి కల్పన, రైతులు ధాన్యం ఆరబెట్టుకోవడానికి కల్లాల నిర్మాణం, కనీస మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు, చెత్త సేకరణకు వాహనాల ఏర్పాటు కార్మికులకు జీతాలు చివరికి గ్రామ సర్పంచుల జీతాలు కూడా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని కేంద్రానికి, ప్రజలకు మధ్య అనుసంధానంగా ఉండవలసిన రాష్ట్ర ప్రభుత్వాలు బ్రోకర్ గిరి చేసుకుంటూ కేంద్రం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వాటి అమలుకై రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులు పంపిస్తే వారిని తమ సొంత పథకాలుగా చెప్పుకుంటూ దారి మళ్లించి రాష్ట్ర ప్రజల నోట్లు మట్టి కొడుతున్నారని కావున ఇప్పుడు జరుగుతున్న పార్లమెంటు ఎన్నికలలో నరేంద్ర మోడీ ఆశీస్సులతో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోతుగంటి భరత్ ప్రసాద్ ను మద్దతుగా నిలబడి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో జిల్లా అధికార ప్రతినిధి, వనపర్తి మండలం ఇన్చార్జి పెద్దిరాజు జిల్లా ఉపాధ్యక్షులు రామన్న గారి వెంకటేశ్వర రెడ్డి, పి విష్ణువర్ధన్ రెడ్డి, వనపర్తి మండల అధ్యక్షుడు సంద వెంకటేష్, మాజీ మండల అధ్యక్షులు మాజీ సర్పంచ్ ఎద్దుల దేవేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పసుపుల సుదర్శన్, బూత్ కమిటీ అధ్యక్షుడు గాంధీ, విజయ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌కు షాక్

బిజెపిలో చేరిన దన్వాడ జడ్పీటిసి

నారాయణపేట జిల్లా బ్యూరో ఏప్రిల్ 22 (జనం సాక్షి):

నారాయణపేట జిల్లా దన్వాడ జడ్పీటిసి విమల అంజి యాదవ్ బిఆర్ఎస్‌కు రాజీనామా చేసి సోమవారం నారాయణపేట బిజెపి పార్టీ కార్యాలయంలో బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు పాలమూరు పార్లమెంట్ అభ్యర్థి డి కే.అరుణమ్మ బిజెపి రాష్ట్ర నాయకులు నాగురావు నామ జీ.కే. రథంగ పాండు రెడ్డి సమక్షంలో బిజెపిలో చేరారు. వారికి వారి అనుచరులకు అరుణమ్మ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జడ్పీటిసి విమలఅంజి యాదవ్ మాట్లాడుతూ దేశానికి ప్రధాని నరేంద్రమోడీ అవసరమని పాలమూరుకు అరుణమ్మ అంటే అవసరమని అన్నారు. అందుకోసం ప్రతి కార్యకర్త పట్టుదలతో పని చేద్దామని కోరారు.

పరీక్ష ఫలితాల దృష్ట్యా విద్యార్థులు ఒత్తిడిలకు లోనుకావద్దు

డిఎంహెచ్ఓ డాక్టర్ శశికళ

గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 22 (జనం సాక్షి)

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు వెలుబడుతున్న దృష్ట్యా విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అయితే అభద్రత భావాలకి లోను కావద్దని,విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోను కావద్దని జోగులాంబ గద్వాల జిల్లా డిఎం హెచ్ఓ డాక్టర్ శశికళ అన్నారు. ఒకవేళ ఫెయిల్ అయితే పట్టుదలతో చదివి సప్లమెంటరీ పరీక్ష నందు పాస్ కావాలి తప్ప, ఆత్మహత్యలకు పాల్పడవద్దని తెలిపారు.ఒకవేళ మానసిక సమస్యలు ఉంటే టెలిమానస్ టోల్ ఫ్రీ నెంబర్ 14416 కాల్‌కు ఫోన్ చేయాలని వీరు 24 గంటల సదుపాయం కలదని సూచనలు సలహాలు ఇస్తారని తెలిపారు. అటు వంటి వారికి వైద్యులు ఉచితంగా కౌన్సిలింగ్ ఇస్తారని అన్నారు. ప్రత్యేకంగా కౌన్సిలింగ్ అవసరమని గుర్తిస్తే కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మానసిక ఆరోగ్య విభాగాన్ని సమరించాలని డిఎంహెచ్ఓ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి. రాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ శ్యాంసుందర్, మక్సూద్‌లు పాల్గొన్నారు.

నెలాఖరులోపు మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ శ్రీ హర్ష

నారాయణపేట జిల్లా బ్యూరో ఏప్రిల్ 22 (జనం సాక్షి):

నారాయణపేట జిల్లాలో ఏర్పాటు చేసే మెడికల్ కళాశాల నిర్మాణ పనులను నెలాఖరులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం ఆయన నారాయణపేట మండలంలోని అప్పక్ పల్లి వద్ద నిర్మిస్తున్న నూతన జిల్లా ఆస్పత్రి భవనంలో కొనసాగుతున్న మెడికల్ కళాశాల వసతి, సౌకర్యాల పనులను పరిశీలించారు.నూతన జిల్లా ఆస్పత్రి భవనంలోని రెండో అంతస్తులో పూర్తి కావస్తున్న మెడికల్ కళాశాల తరగతి గదులు, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, ఉపన్యాసకుల గదులు, లైబ్రరీ, ల్యాబ్లు, అడ్మిన్ బ్లాక్, అనాటమీ డిపార్ట్మెంట్, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, ల్యాబ్‌లు, లెక్చర్ హాల్స్, ప్రొఫెసర్స్ రూమ్స్, ట్యూటర్ రూమ్స్, డెమో రూమ్స్, ఫార్మసీ స్టోర్ రూమ్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ నెలాఖరు నాటికి పనులన్నీ పూర్తి చేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణం పూర్తయిన గదుల ముందు ఆయా డిపార్ట్మెంట్‌ల బోర్డులను పెద్ద అక్షరాలతో రాయించి పెట్టాలని సూచించారు. ప్రస్తుతం రాసి ఉంచిన బోర్డులతో పాటు అక్షరాలు కూడా చిన్నగా ఉన్నాయని, పెద్ద అక్షరాలతో పెద్ద బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అంతకు ముందు కలెక్టర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో గల మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ గదిలో అధికారులతో మెడికల్ కాలేజీకి అవసరమైన వైద్యుల జాబితాను పరిశీలించారు.మెడికల్ కాలేజీలో విధులు నిర్వహించే వైదుల హాజరును బయోమెట్రిక్ ద్వారా నమోదు చేయాలని సూచించారు. మొత్తం 19 మంది వైద్యుల ఆధార్ కార్డులతో బయోమెట్రిక్ హాజరు కు అనుసంధానం చేయాలని తెలిపారు. అలాగే ఆసుపత్రి పై అంతస్థులో ఇటీవలే ఏర్పాటు చేసిన కొత్త వార్డును, స్టోర్ రూమ్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య విద్య డీ.ఎం.ఈ శివ ప్రసాద్, మహబూబ్ నగర్ మెడికల్ కాలేజి డైరెక్టర్ డాక్టర్ రమేష్, నారాయణ పేట మెడికల్ కాలేజి ప్రిన్సిపల్ రాంకిషన్, టీఎస్ ఎంఐడిసి ఈఈ జైపాల్ రెడ్డి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంజిత్ కుమార్, ఆర్ఎంవో పావని పాల్గొన్నారు.

మోడీతోనే దేశం సురక్షితం

ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ్ కుమార్

నారాయణపేట జిల్లా బ్యూరో ఏప్రిల్ 22 (జనం సాక్షి):

దేశ రక్షణ ప్రజా సంక్షేమం ప్రధాని నరేంద్ర మోడీకే సాధ్యమని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్.విజయ్ కుమార్ అన్నారు. సోమవారం ఉట్కూరు మండల కేంద్రంలో బూత్ స్థాయిలో ఇంటింటి ప్రచారం ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ దేశ హితం కోసమే పనిచేస్తూ ప్రపంచ దేశాల్లో భారత్ ను వాటి సరసన నిలబెట్టారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని అన్నారు. దశాబ్ది సంవత్సరాలుగా పరిష్కారం కానీ సమస్యలను ప్రధాని నరేంద్రమోడీ పరిష్కరించారని అన్నారు.5 వందల ఏళ్లుగా హిందువుల ఆరాధ్య దైవం అయిన శ్రీరాముడిని ఎండకు వానకుచలికి గాలికి గుడారం కింద వదిలి పెట్టారని అన్నారు. కానీ నరేంద్రమోడీ శ్రీరామునికి దివ్యమైన మందిరం నిర్మించి ధర్మాన్ని కాపాడారని అన్నారు. బిజెపికి 4వందలకు పైగా సీట్లు గెలిపించి మనమంతా శ్రీ రాముడిని దర్శించుకుని తరిద్దామని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఆరు గ్యారెంటీల్లో ఒక్క హామీ నెరవేర్చలేదని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వస్తుందని తెలిసి అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి రైతులను మోసం చేసిందని అన్నారు..కానీ నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం రైతులకు మేలు చేసే అనేక పతకాలను అమలు చేస్తున్నారని అన్నారు.ఎకరాకు అవసరమయ్యే ఎరువులపై 19 నుంచి 20 వేల సబ్సిడీ ఇస్తున్నారని గిట్టుబాటు ధర పెంచారని,కూలీలకు రోజు కూలీ 3 వందలకు పెంచారని తంచన్‌గా ఏడాదికి కిసాన్ సమ్మాన్ కింద 6వేల ఆర్థిక సహాయం రైతులకు అందిస్తున్నారని అన్నారు. కానీ రైతులకు లేనిపోని ఆశలు చూపి అడియాశలు చేసిన కాంగ్రెస్‌కు రైతులు, ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు భారత్, రఘువీర్, లక్ష్మణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ ప్రధాని కావడం ఖాయం

ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్

బిజినేపల్లి ఏప్రిల్ 22 (జనం సాక్షి)

దేశానికి ముచ్చటగా మూడవసారి నరేంద్ర మోడీ ప్రధానమంత్రి కావడం ఖాయమని బిజెపి ఎంపీ అభ్యర్థి భారత్ ప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు పాలెం మంగనూర్ గ్రామాలలో మహనీయులు అంబేద్కర్ సాకలి ఐలమ్మ, పాలెం సుబ్బయ్య, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామాలలో గడపగడపకు తిరుగుతూ పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరంఆయన మాట్లాడుతూ. దేశం అన్ని రంగాలలో మరింత అభివృద్ధి చెందాలంటే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మరో మారు రావాలని ఆయన అన్నారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సెగ్మెంట్లో బిజెపి అభ్యర్థిని గెలిపించుకుంటే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం మనకుంటుందని తెలిపారు. కేంద్రంలో ఏ పార్టీ గెలిచే ప్రసక్తి లేదని ప్రధాని మోదీ గాలివీస్తుందని 400 ఎంపీ సీట్లకు బిజెపి ఎంపీ అభ్యర్థులే కచ్చితంగా గెలుస్తున్నారని ఆయన అన్నారు. ప్రజలకు సేవ చేయడానికి వచ్చాను నన్ను ఆశీర్వదించి ఆదరిస్తారని ఆశిస్తున్నానని అత్యధిక ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తారని ప్రజలను కోరారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన నాయకులను పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ ప్రచారంలో బిజెపి రాష్ట్ర నాయకులు దిలీపాచారి.మండల అధ్యక్షులు భూషయ్య.నారాయణ చారి. దోమ తిరుపతిరెడ్డి. నాగేంద్రం. మహేష్. వెంకటేష్. వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బూటకపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకటరామ్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం

వెల్దుర్తి ఏప్రిల్ 22 (జనం సాక్షి)

నర్సాపూర్ నియోజకవర్గానికి ఈశాన్య ప్రాంతమైన రామంతపూర్ గ్రామం నుండి సోమవారం నాడు నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి ఎంపీ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. రామంతాపూర్ లింగారెడ్డిపల్లి రామంతపూర్ తండా మాసాయిపేట గ్రామాలలో ఆమె ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు కాంగ్రెస్ ప్రభుత్వం బూటకపు మాటలతో అధికారాన్ని చేపట్టిందన్నారు. ఇప్పటి వరకు 6 గ్యారంటీ పథకాలను ఎక్కడ కూడా అమలు చేయడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలకు విశ్వాసం పోయిందని టిఆర్ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను ఆమె విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు ఒక్క రైతుకు కూడా పూర్తిస్థాయిలో రైతుబంధు పడలేదని డిసెంబర్ 9న కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని ఏ ఒక్క రైతు కూడా బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను చెల్లించొద్దని అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తామని ప్రగల్భాలు చెప్పి దాన్ని ఊసే ఎత్తడం లేదని పింఛన్ల మాటే కరువైందని ఆమె అన్నారు. మంచి సంఘసేవకర్త అయిన వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో మెదక్ ఎంపీ అభ్యర్థిగా గెలిపించాలని కోరారు.

కృతజ్ఞతకు నోచుకోని స్త్రీ జీవితం



"పగలస్తమానం బండచాకిరీ చేస్తూ పైగా మీరు వచ్చేసరికి స్నానానికి నీళ్ళదగ్గర నుండి భోజనానంతరం కిళ్ళీ దాకా రెడీగా ఉండాలి%ొ% యింట్లో భార్యను ఒక దాసీ క్రింద కట్టేస్తున్నారు మీ మగవాళ్ళు" (పుట:101) అంటూ కుటుంబంలో స్త్రీ దాసిలాగా అన్నీ తనే చేయాల్సిన స్థితి ఉంది. కనుకనే కేవలం మార్క్సిజం కూడా స్త్రీ వాదుల సమస్యకు పోరాటానికి ఆలంబనం కాలేకపోయింది.

"పెద్ద చదువులు చదివి, ఉద్యోగాలు చేసే స్త్రీలు స్వతంత్రంగా స్వేచ్ఛగానుంటున్నారు. కానీ, మాబోటి గృహిణులకు చదువు సంధ్యలనే సమస్యలేకుండా, కూపస్తమండూకముల వలె తయారు చేశారు. స్త్రీ అంటే బయటి ప్రపంచం నుండి వంట యింట్లోకి విసిరి పారేసిన యంత్రమని మీ యుద్దేశ్యం కాబోలు" (పుట : 102) అంటూ ప్రశ్నించే చైతన్యం కథానాయికలో వచ్చింది. 'ఆధునిక మహిళలు భారతదేశ చరిత్రను తిరగరాస్తారు' అన్న ఆశాభావం గురజాడది. ఆ భావం ఈ మాటల్లో వ్యక్తమవుతుంది. "భార్యభర్తలు కుటుంబ నిర్వహణలో సమానులే. పూర్వపు ఆ యుద్దేశ్యాలు పోయి, "పోషించేవాడు %-% పోషింపబడేది" అనే భావం మీలో పాతుకుపోయింది. కుటుంబ నిర్వహణ, పిల్లల పోషణ, గృహకృత్యాలూ, ఇవి బండచాకిరిగానూ, ఆఫీసుకెళ్ళి దర్జాగా కుర్చీల మీద కూర్చొని చేసేవి వుద్యోగాలు కాబోలు%ొ%" (పుట : 102) అనీ, "%ొ%. పురుషులకున్నంత స్వాతంత్ర్యం స్వేచ్ఛలు స్త్రీలకెందుకుండకూడదు? స్త్రీ స్వాతంత్ర్యం కొరకు మా మహిళా సంఘములు కృషి చేయకతప్పదు" (పుట:103) అనీ ఈనాటి స్త్రీవాద భావాలను స్పష్టంగా ప్రకటించింది కథానాయిక. ఇంటి చాకిరీ గురించి స్త్రీల దృక్పథం నుండి ఎంతో సాహిత్యం రావాల్సిన అవసరం ఉంది. ఈ విషయం సామాజిక పునాదిలో భాగమని సమాజం గుర్తించేంత వరకూ ఈ సాహిత్యం రావాలన్నది ఈ కథల ద్వారా స్పష్టమవుతోంది.

ముగింపు : ఋగ్వేద కాలం నుండి మహిళలను అబలలని చులకన చేస్తూనే క్రమంగా ఇంటికే పరిమితం చేశారు. పతియే ప్రత్యక్షదైవంగా, పిల్లలు ఆదైవాంశ సంభూతులుగా, గృహమే స్వర్గసీమగా బోధిస్తూ, స్త్రీలకు వ్రతాలు, నోములు, పూజలూ ఆపాదించారు. ఇవన్నీ భర్త పిల్లల ఆయురారోగ్యాలకే కానీ స్త్రీ సుఖసంతోషాల కోసం కాదు. "స్త్రీ ఈ పూజలకూ, వ్రతాలకూ, ఇంటి పనులకూ పరిమితమైపోయి, తనలోని సృజనాత్మకశక్తిని, వ్యక్తిత్వాన్ని తానే గుర్తించలేక అణచివేసుకుంది" (డా. రావిప్రేమలత). స్త్రీలోని శక్తి సామర్థ్యాలు తనకే తెలియకుండా పోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. "స్త్రీలను అణచివేయడం వల్ల మనదేశం ఎంతోమంది స్త్రీ కళాకారులను, విద్యావేత్తలనూ పోగొట్టుకుంది. స్త్రీ కుటుంబానికే కాకుండా సమాజానికి బానిస అయింది" (చలం). అది అక్షరాలా నిజమని కొన్ని కథలు నిరూపిస్తున్నాయి. మరికొన్ని కథలు స్త్రీలో జ్ఞాన చైతన్యం కలిగి తన ఉనికిని కాపాడుకుంటూ స్థిరత్వాన్ని ముద్రించుకుంటూ ముందుకు సాగుతోందని వక్కాణిస్తున్నాయి.

మహార్ణవ మథనం

"మెచ్చుకునే హృదయం వుండాలి. కాని ప్రతి వారిలోనూ ఏదో ఒక గొప్పతనం వుంటుంది" అని నమ్మే హృదయం, మేధ ఉన్న యువ రచయిత్రి శ్రీమతి శ్రీవల్లీ రాధిక. తన హృదయాన్ని స్పందింపజేసిన వ్యక్తుల్నీ, సంఘటనలనీ చిత్రించిన ఈమె కథలు సున్నితంగా, అనాయాసంగా చదివించేలా, ఆలోచనాత్మకంగా ఉంటాయి. ఈ సంపుటిలో ఎక్కువగా స్త్రీ పురుష సంబంధాల గురించీ, స్త్రీ వ్యక్తిత్వం గురించీ, నేటి విద్యావిధానం గురించీ, యువత గురించీ, దేవుడి అస్తిత్వాన్ని గురించీ ఆలోచనాత్మకంగా రాసిన కథలు ఉన్నాయి. స్త్రీ పురుష సంబంధాల్లో - దాంపత్య ప్రేమనీ, భార్యా భర్తల మధ్య సంఘర్షణల్నీ, వయో భేదం ఎక్కువగా ఉన్న స్త్రీ పురుషుల మధ్య విలక్షణ అనుబంధాల్నీ చిత్రించిన కథలున్నాయి. మూఢాచారాలను ప్రశ్నించే కథలున్నాయి. మొత్తం మీద వైవిధ్యంతో కూడిన కథలున్నాయి ఈ సంపుటిలో. రెండు కథల్లోని పురుషులు అమ్మాయిలకన్నా బాగా పెద్ద వాళ్ళు. " నా స్నేహితుడు" అనే కథలో -" నా స్నేహితుడు దేవుడు" అనీ, "మీరంటే నాకు చాలా ఆరాధన, దేవుడేననుకునేటంత ఆరాధన" అంటుంది పక్కింటి "అంకుల్"తో సంధ్య అనే అమ్మాయి. ఆ అమ్మాయి చేత దేవుడు అనేవాడు లేడని నమ్మించడానికి, దేవుడిపైన ఉన్న మూఢభక్తిని తొలగించడానికీ ఆమెని ఒంటరిస్థలానికి తీసికెళ్ళి ఒక పరీక్ష పెడతాడు. ఆ అమ్మాయి ఆత్మ విశ్వాసాన్ని కోల్పోకుండా, తిరిగి వచ్చేటప్పుడు దారిలో అతనంతట అతనే "గుడికి వెడదాం" అనేటట్లు చేస్తుంది. సంభాషణలూ, కథనం ఎంతో ఆసక్తికరంగా ఉన్నాయి. మరొరకం జంట గురించి రాసిన కథ "మహార్ణవం". ఇందులోని కథానాయకుడు కూడా కథానాయిక కన్న వయస్సులో పెద్దవాడే. చిన్నపిల్లగా పరిచయమై అతన్ని ఒక మేధావిగా స్నేహపూర్వకంగా అభిమానించి ఆరాధించిన అమ్మాయి సరిత, తర్వాత పెళ్ళి చేసుకుని, బిడ్డనికని కొన్నాళ్ళకి ఆ పసిపిల్లవాడ్ని తీసుకుని అతన్ని చూడటానికి వచ్చినప్పుడు అతను పసిపిల్లవాడి పట్ల చూపిన నిర్లక్ష్యం, అమానుష వైఖరి ఆమె "మహార్ణవ" వ్యక్తిత్వాన్ని జాగృతం చేస్తుంది. సంభాషణల్లోనూ, కథనంలోనూ రచయిత్రి పరిణతి ప్రస్ఫుటమవుతుంది.

పురుషుడు చెపుతున్నట్లు సహజంగా రాసిన మరో కథ, "యుగళగీతం". పురుషుడు కథ చెపుతున్నట్లు రాయడం ఒక "టెక్నిక్" గానే కాకుండా, ఒక "వ్యూహం"గా ప్రయోగించినట్లనిపిస్తుంది. పురుషులు తమ్ము తాము అర్థం చేసుకుని స్వయంగా మారేటట్లు చేయడానికి ఉద్దేశించినట్లనిపిస్తుంది. పురుషుడు కోరుకునే ఆధిపత్యాన్నీ, స్త్రీ కోరుకునే స్వేచ్ఛనీ అందంగా, మృదువుగా, గెలుపు - ఓటమిల ప్రసక్తి తెస్తూ పురుష కంఠంతో చెప్పిన చక్కని స్త్రీవాద కథ - "యుగళగీతం". సంసారం యుగళగీతంలా సాగాలని అందరూ కోరుకుంటారు. కానీ ఈ కథలో చూపించినంత సులభంగా పురుషుడిలో ఆశించిన మార్పువస్తే అంతకన్న కావల్సిందేముంది!

వివాహం కాగానే స్త్రీకి భర్తే సర్వస్వం అనిపిస్తుంది సాధారణంగా తన ఆనందానికి భర్త మీదే ఆధారపడుతుంది. పురుషుడికి అలా కాదు - అతని జీవితంలో స్త్రీ ఒక భాగం మాత్రమే. పురుషుడి మీద పూర్తిగా ఆధారపడకుండా స్వీయ శక్తి మీద ఆధారపడినప్పుడు ఆమె కూడా వివాహానికి పూర్వం తాను అనుభవించిన ఆనందాన్నీ స్వేచ్ఛనీ అనుభవించగలుగుతుందనీ, నిరాశా నిస్పృహలకు చోటుందనీ చెప్పిన కథ "స్వార్జితం". ఆడపిల్లలందరూ నేర్చుకోవాలసిన పాఠం ఇది.భార్యాభర్తలు పరస్పరం ప్రేమించుకోవడం సహజం. కానీ యిద్దరిలో తానే గొప్పగా ప్రేమిస్తాననే అహంభావాన్ని ప్రదర్శించడం, తను చూపే ప్రేమని ఇతరులు గుర్తించాలని

రేపటి సంచికలో

స్త్రీవాద ఆలోచన, ఆచరణ

ఆడవాళ్ళూ, మగవాళ్ళూ ప్రేమ గురించి తెలుసుకోవాలని మనం భావిస్తే స్త్రీవాదాన్ని మనసారా కోరుకోవాలి. స్త్రీవాద ఆలోచన, ఆచరణ లేకుండా మన మధ్య ప్రేమ బంధాలకు పునాది ఏర్పడదు. మొదట్లో మగవాళ్ళతో సంబంధాల్లోని తీవ్ర అసంతృప్తి ఆడవాళ్ళని స్త్రీ విముక్తి వైపు నడిపించింది.

ప్రేమ, పెళ్ళి తర్వాత అంతులేని ఆనందం దొరుకుతుందని ఆశించిన ఆడవాళ్ళకి, పెళ్ళి కాగానే తెల్ల గుర్రం మీద రాజకుమారుడి బదులు పితృస్వామ్య ఇంటి యజమాని లభించాడు. అటువంటి బంధాల్లో కలిగిన క్రోధాన్ని, కటుత్వాన్ని ఆ స్త్రీలు ఉద్యమంలోకి తెచ్చారు. తాము ఏర్పర్చుకున్న బంధాలు కూడా పితృస్వామ్య విలువలతో నిండిపోవడంతో తాము మోసపోయామని భావించిన లెస్బియన్ స్త్రీలు కూడా వారికి తోడయ్యారు. ఇద్దరి వేదనా కలిసింది. దీనితో మొదటి నుండి కూడా స్త్రీవాద ఉద్యమంలో అసలు ఈ రొమాంటిక్ ప్రేమతో ఉండే అనుబంధాన్ని వదిలేసుకుంటే తప్ప స్త్రీలు నిజమైన స్వేచ్ఛ పొందలేరనే భావన బలంగా ఏర్పడిరది.

చైతన్యం పెంపొందించే బృందాల్లో (కాన్షన్‌నెస్ రైసింగ్ గ్రూప్) ఇటువంటి రొమాంటిక్ ప్రేమ మనలని పితృస్వామ్య ప్రేమికులతో - మగవాళ్ళు కావచ్చు - ప్రేమలో పడేసే వశీకరణ కుట్రనీ, వాళ్ళు ఆ ప్రేమని మనల్ని లొంగదీసుకోవటానికి, తొక్కి పెట్టటానికి వాడుకుంటారని మాకు చెప్పే వాళ్ళు. ఉద్యమంలో చేరేటప్పటికి ఏ పురుషుడితో లైంగిక సంబంధం లేని నేను మగవాళ్ళ పట్ల అంత తీవ్రమైన క్రోధం, ద్వేషం చూసి దిగ్భ్రాంతి చెందాను. కానీ నాకు దాని మూల కారణాలు అర్థమయ్యాయి. నా టీనేజీలో కుటుంబంలో అందరి మీదా మా నాన్న ఆధిపత్యమే నన్ను స్త్రీవాదం వైపు నడిపించింది. నాన్న ఆర్మీలో పనిచేశాడు. ఎథ్లెట్, చర్చిలో డీకన్, కుటుంబాన్ని చూసుకునే వాడు, చాలామంది ఆడవాళ్ళతో సంబంధాలు పెట్టుకునేవాడు. ఒక్క మాటలో చెప్పాలంటే పితృస్వామ్య విలువలు మూర్తీభవించిన పురుషుడు. నేను మా అమ్మ పడే వేదన చూశాను, తిరగబడ్డాను. మా నాన్న ఎంత హింసించినా, అవమానించినా మా అమ్మ ఎప్పుడూ స్త్రీలకి జరిగే అన్యాయం పట్ల కోపం గానీ, క్రోధం గానీ ఒక్కసారి కూడా వ్యక్తం చెయ్యలేదు.

చైతన్యం పెంపొందించే బృందాల్లోకి వెళ్ళినప్పుడు, మా అమ్మ వయసు ఆడవాళ్ళు తమ బాధ, వేదన, కోపం వ్యక్తీకరిస్తూ ఆడవాళ్ళందరూ ఈ ప్రేమ నుండి దూరంగా ఉండాలని అంటుంటే, నాకు వాళ్ళు చెప్పింది సరైందేనని అన్పించింది. అయినా సరే, నాకు ఒక మంచి మగవాడి ప్రేమ కావాలనిపించింది. ఆ ప్రేమ నాకు దొరుకుతుందని కూడా అనిపించింది. నా ప్రేమికుడు స్త్రీవాద రాజకీయాలకి కట్టుబడి ఉండాలని మాత్రం అర్థమయ్యింది. 1970ల మొదట్లో, పురుషులతో జీవించాలని నిర్ణయించుకున్న ఆడవాళ్ళకి ముందు ఆ పురుషులని స్త్రీవాద ఆలోచనలోకి ఎలా మార్చాలనేది ఒక సవాలుగా పరిణమించింది. ఎందుకంటే, మగవాళ్ళు స్త్రీవాదులుగా మారకపోతే వారితో జీవితాంతం సంతోషంగా ఉండలేమని వారికి తెలుసు.

పితృస్వామ్య సంస్కృతిలో చాలామంది కోరుకునే రొమాంటిక్ ప్రేమలు మనుషులని చైతన్య రహితంగా, జీవితాలపై అధికారం, నియంత్రణ లేకుండా చేస్తాయి. ఇటువంటి ప్రేమ పితృస్వామ్య పురుషులు, స్త్రీల ఆసక్తులని పెంచి పోషిస్తుందని స్త్రీవాద ఆలోచనా పరులు అందరి దృష్టికి తెచ్చారు. ప్రేమ పేరుతో ఏమైనా చెయ్యొచ్చని ఈ భావన చెప్తుంది: కొట్టటం, వారి కదలికల్ని నియంత్రించటం, వారిని చంపటం, చంపి 'ప్రేమ వల్ల జరిగిన నేరాలు' అనటం, 'ఆమెంటే నాకు ఎంతో ప్రేమ, అందుకే చంపాను అనటం' వంటిది. పితృస్వామ్య సంస్కృతుల్లో ప్రేమ 'ఆధీనం', 'ఆస్తి' అనే భావనలతో ముడిపడి ఉంటుంది. ఆధిపత్యం, లొంగి ఉండటం అనే ఈ నమూనాలో ఒకరు ప్రేమ ఇచ్చే వాళ్ళయితే, మరొకరు పుచ్చుకునే వాళ్ళు. ఆడవాళ్ళు మగవాళ్ళకి మధ్య ఏర్పడే అసమాన పరలింగ సంబంధాల్లో ఆడవాళ్ళు - ప్రేమ, భావోద్వేగాలతో నిండి ఉంటారు కాబట్టి - మగవాళ్ళకి ప్రేమని ఇవ్వాలని, దాని బదులు, మగవాళ్ళు - అధికారం, దాడి చేసే భావనలతో నిండి ఉంటారు కాబట్టి - ఆడవాళ్ళని రక్షించి, పోషించాలని అనుకుంటారు. అయితే, అనేక కుటుంబాల్లో పురుషులు ఈ ప్రేమ, సంరక్షణలకి పెద్దగా స్పందించకపోయినా, నియంతలుగా ప్రవర్తిస్తూ తమ అధికారాన్ని అన్యాయంగా ఇతరులని బలవంత పెట్టటానికి, నియంత్రించటానికి వాడుకున్నారు. అందుకనే పరలింగ సంబంధాల్లోని స్త్రీలు తమ ప్రేమ బంధాలని తెగ్గొట్టటానికి స్త్రీ విముక్తి పోరాటానికి తరలి వచ్చారు.

ఇంకో కీలకమైన విషయం ఏమిటంటే అప్పట్లో ఆడవాళ్ళు కేవలం పిల్లల కోసం మాత్రమే జీవించకూడదని కూడా బలంగా చెప్పారు. ఆడవాళ్ళు తమ జీవితాలని సాఫల్యం చేసుకోవడానికి ఈ పిల్లల బంధం కూడా ఒక అడ్డంకేనని అన్నారు. తమ పిల్లల ద్వారా జీవితాన్ని జీవించాలని అనుకునే తల్లులు ఆ క్రమంలో క్రూరంగా, పిల్లలని అన్యాయంగా శిక్షించే రాక్షసులుగా తయారవుతారని హెచ్చరించారు. యుక్త వయసులో స్త్రీవాద రాజకీయాల్లోకి వచ్చిన వాళ్ళు అప్పటికే తమ తల్లుల మీద తిరుగుబాటు చేస్తున్నారు. మేం మా అమ్మలలాగా తయారవదలచుకోలేదు, మా జీవితాలు సాధ్యమయినంతగా వాళ్ళకంటే భిన్నంగా ఉండాలని అనుకున్నాం. అలా ఉండాలంటే ఒక దారి పిల్లల్ని కనకుండా ఉండటం.

మొదట్లో ప్రేమ గురించి స్త్రీవాద విమర్శ అంత సంక్లిష్టంగా లేదు. ప్రేమ గురించిన పితృస్వామ్య భావనలని సవాలు చెయ్యటానికి బదులు ఆ విమర్శ అసలు ప్రేమనే ఒక సమస్యగా చూపించింది. ప్రేమని పూర్తిగా పక్కన పడేసి, దాని బదులు హక్కులు, అధికారం సాధించాలని అనుకుంది. అయితే స్త్రీవాద తిరుగుబాటు పేరుతో మనం కూడా భావోద్వేగాలు లేని పురుషులు, బుచ్ ఆడవాళ్ళలాగా తయారవుతామనే వాస్తవం గురించి ఎవరూ మాట్లాడలేదు. అయితే అదే జరిగింది. ప్రేమ, దాని విలువ, ప్రాధాన్యతల గురించి పునరాలోచించటం బదులు స్త్రీవాద చర్చ అసలు ప్రేమను గురించి ఆలోచించటమే మానేసింది. ప్రేమ కావాలనుకున్న స్త్రీలు, ముఖ్యంగా పురుషులతో ప్రేమ ఆశించిన స్త్రీలు అటువంటి ప్రేమను పొందటానికి దారుల కోసం వేరే చోట వెతుక్కోవాల్సి వచ్చింది. స్త్రీవాద రాజకీయాలలో ప్రేమకి, కుటుంబ సంబంధాలపై, ఇతరులతో కలిసి జీవించే సమూహానికి ప్రాధాన్యత ఇవ్వట్లేదని చాలామంది స్త్రీలు స్త్రీవాద రాజకీయాల నుండి పక్కకి వెళ్ళిపోయారు.

రేపటి సంచికలో

బోస్‌పై కేసుల ట్రిగ్గర్!

- మెసలకుండా ముప్పేట దాడి
- ఆయన చుట్టే తిరుగుతున్న ట్యాపింగ్ పాము
- తాజాగా ఓ మహిళ వద్ద కోటి నగదు తీసుకున్న వ్యవహారం
- అర్బన్ పోలీస్ స్టేషన్‌లో నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు
- అంటకాగిన రాజకీయ నేత పట్టించుకోని ధైన్యం

ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి, జనం సాక్షి :

సమయం కలిసొచ్చినంత కాలం నాకు తిరుగేలేదంటారు.. ఏం చేసినా చెల్లుబాటవుతుందని బీరాలు తీస్తారు.. అండ చూసుకుని అడ్డగోలు పనులు చేసి కాలర్ ఎగరేస్తారు.. కానీ పాపం.! ఆ సమయం ఎప్పుడూ ఒకేలా ఉండదని గ్రహించలేకపోతారు.. అది కళ్ళకు కమ్మిన కావరం కలిగించే మాయ ఫలితం.. మరి ఆ సమయమే తిరగబడితే..? ముప్పేట దాడి చేస్తే..? ఇప్పుడు మాజీ డీసీపీ బోస్ పరిస్థితి కూడా అచ్చం అలాగే ఉంది.. "యద్భావం తత్ భవతి.." అంటూ మహా భారతంలో శ్రీ కృష్ణుడు చెప్పిన సూక్తిని అనుసరించి మనం మంచి చేస్తే మంచి, చెడు చేస్తే చెడు మన వెంటే వాయు వేగంతో ప్రయాణం చేస్తూ వస్తాయన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలి మరి.!

నాటి బీఆర్ఎస్ సర్కారులో జిల్లా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అండదండలు చూసుకుని ఆ డీసీపీ అన్నీ అడ్డగోలు పనులే చేశాడు. ఆయనకు మంత్రి పదవి, ఈయనకు పోలీసు శాఖలో ఉన్నతాధికారి ఉద్యోగం రెండూ శాశ్వతమే అనుకున్నారు. ఆ ధీమాతో వీరి దాస్టీక చర్యలు ఎంతగా శృతి మించాయంటే చివరికి కొందరు రాజకీయ పెద్దల ఫోన్లను సైతం ట్యాపింగ్ చేసి వారి వ్యక్తిగత స్వేచ్ఛను కూడా హరించాలని పన్నాగం పన్నారు. చివరికి కాలం తిరగబడి ఆ నేత పదవి కాస్తా ఊడిపోయింది. ఈ అధికారి బలవంతంగా ఉద్యోగం వదిలేయాల్సిన దుస్థితి దాపురించింది. ఆనక వీళ్ళు అధికారాన్ని అడ్డం పెట్టుకుని చేసిన ఒక్కో అడ్డగోలు పని వారి మెడకు పాముల్లా చుట్టుకుంటున్నాయి. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కూడా ఉన్నత స్థాయి విచారణ దశలో ఉన్న సంగతి తెలిసిందే. ఈలోపే ఆ మాజీ అధికారి మెడకు మరో కేసు ఉచ్చు బిగిసింది.

కోటి నొక్కేసి పైగా బెదిరింపు..

ఉద్యోగం వెలగబెట్టిన రోజుల్లో మన మాజీ ఖాకీ అధికారి ఒక మహిళ దగ్గరి నుంచి అక్షరాలా రూ.కోటి 20 లక్షల నగదు తీసుకున్నాడట. అయితే తిరిగి ఇవ్వాల్సిన ఆ నగదు గురించి ఆమె అడిగితే దాటవేత ధోరణిని అవలంభిస్తూ వస్తున్నాడట. ఆ డబ్బులే కాదండోయ్.! ఆమె దగ్గర్నుంచి మెడలో గొలుసు కూడా లాగేసుకుని దబాయించినట్లు తెలుస్తోంది. ఒక దశలో తీవ్రంగానే బెదిరించినట్లు ఆ మహిళ వాపోయిందట. దీంతో బోస్ రాక్షస బుద్ధిని గ్రహించిన ఆ మహిళ ఖానాపురం హావేలీ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు 384, 356,506,109 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇలా వరుస పరిణామాలతో బోస్ మెడకు కేసుల ఉచ్చు బిగిస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే నాడు ఈ అధికారి అంటకాగిన నేత పదవి కూడా పోవడంతో ఇతగాడి పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారింది.

భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్యయత్నం

మానవపాడు, (జనం సాక్షి) : భర్త వేధింపులు భరించలేక ఓ వివాహిత మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మానవపాడు మండలంలోని పెద్దపోతులపాడు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన పరుశరాముడుతో పెద్దపోతులపాడు గ్రామానికి చెందిన సుకన్యకు గత పదేళ్ల క్రితం వివాహం జరిగింది. కర్నూల్ లోని సహస్ర ఆసుపత్రిలో సుకన్య ఆయాగా పని చేస్తుంది. భర్త గత కొంతకాలంగా తాగుడుకు బానిస కావడంతో పాటు కొంత అప్పులు చేశాడు. అయితే ఉగాది పండుగ కోసం సుకన్య పుట్టింటికి వచ్చింది. భర్త ఈనెల ఏప్రిల్ 20వ తేదీన రాత్రి 10 గంటల సమయంలో ఫోన్ చేసి తాను చేసిన అప్పులు చెల్లించాలని బెదిరింపులకు పాల్పడ్డాడు. అలాగే తరచూ వేధించేవాడు. భర్త వేధింపులను భరించలేక ఈనెల 20వ తేదీన అర్ధరాత్రి సమయంలో సుకన్య పెద్దపోతులపాడు గ్రామం లోని తమ పుట్టింట్లో ఉన్న గుర్తు తెలియని టాబ్లెట్లను మింగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ప్రస్తుతం ఆమె కర్నూల్ లోని సహస్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది అని తెలిపారు .సుకన్య స్టేట్ మెంట్ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయడమైనది అని మానవపాడు ఎస్సై చంద్రకాంత్ తెలిపారు.

హెచ్ఎం గుండేటి యోగేశ్వర్ సేవలు ఆదర్శనీయం

జిల్లా అదనపు కలెక్టర్ బి రాహుల్/డిఈఓ యాదయ్య

కోటపల్లి, (జనంసాక్షి) :

సుదీర్ఘకాలం విద్యా శాఖలో ముప్పై ఏడు సంవత్సరాలు విశిష్టమైన సేవలు అందించి వేలాది మంది విద్యార్థుల భవిత్తుకు బంగారు బాటలు వేసి విద్యా శాఖకు వివిధ రంగాల్లో తనదైన శైలిలో విలువైన సేవలు అందించిన పారిపెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు,రాష్ట్రపతి అవార్డు గ్రహీత,జిల్లా "గుండేటి యోగేశ్వర్ అరుణ "ఉద్యోగ విరమణ సన్మానోత్సవం పారుపెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల ఆవరణలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అదనపు పాలనాధికారి బి.రాహుల్, డిఈఓ ఎస్.యాదయ్య, రాష్ట్ర పర్యావరణ విద్య ప్రాజెక్టు అధికారి బి.విద్యాసాగర్ పాల్గొని మాట్లాడుతూ ఆయన అందించిన వివిధ సేవల్ని కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో రాహుల్ అధిక కలెక్టర్ యోగీశ్వర్ దంపతులతో కలిసికలిసి మొక్కలు నాటారు. పర్యావనహిత సంచులను ఆవిష్కరించి ఉచితంగా పంపిణీ చేశారు. అతిథులకు ఆహ్వానం హాజరైన ప్రముఖులకు శాలువా జ్ఞాపకాలతో సన్మానం చేశారు. యోగేశ్వర్ రాష్ట్రపతి స్థాయి అవార్డు అందుకోవడానికి కారణమైన ముఖ్యమైన ఫోటోలను ఉపాధ్యాయ వృత్తి జ్ఞాపకాలను చాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసి చేశారు అడిషనల్ కలెక్టర్ వాటిని తిలకించి ఎంతో సంతోషం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా. యోగేశ్వర్ మాట్లాడుతూ పాఠశాలలతో ఉన్న అనుబంధం జీవితంలో మర్చిపోలేదని విద్యాశాఖకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మళ్లీ జన్మంటూ ఉంటే ప్రభుత్వ ఉపాధ్యాయ అధ్యాపక వృత్తుల కొనసాగుతున్న.. ప్రాణం ఉన్నంత వరకు పర్యావరణ సేవలో తరిస్తానని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ వివిధ అధికారులు కే చౌదరి శ్రీనివాస్ సత్యనారాయణమూర్తి రాజకుమార్. డిఏస్ఓ మధు బాబు, కోటపల్లి ఎంఈఒలు పి.తిరుపతి రెడ్డి, గెజిటెడ్ మాస్టర్స్ సంఘం, పిఆర్‌టియుటిఎస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి. హనుమాండ్లు, రాథోడ్ రమేష్, పిఆర్‌టియుటిఏస్ ప్రధాన కార్యదర్శి కొట్టే శంకర్, సీ. ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్,వివిధ అధికారులు ప్రాంతాల ఉపాధ్యాయులు, కవులు, కళాకారులు, పర్యావరణహితులు, గ్రామ ప్రజలు విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో కరాటే సెమినార్‌కు తెలంగాణ వాసుల ఎంపిక

చేర్యాల ఏప్రిల్ 22, (జనంసాక్షి) :

ఈనెల 27, 28 తేదీలలో కేరళ రాష్ట్రంలోని కొల్లం జిల్లాలో చిల్డ్రన్స్ పార్క్ లో రెండు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయిలో కరాటే సెమినార్ తెలంగాణ నుండి పలువురు ఎంపిక య్యారు. ఈ సెమినార్‌కు జపాన్ హంబుడోజో ఇన్స్ట్రక్టర్ సెన్సాయి 'ఇనోడా' హాజరుకానున్నట్లు తెలంగాణ టీం కోచ్ ఎంఎస్ పాషా తెలియజేశారు. ఈ సెమినార్ కు సెన్సాయి ఎమ్మెస్ పాషా తెలంగాణ ముఖ్య శిక్షకుడు, అధ్యక్షుల ఆధ్వర్యంలో తెలంగాణ నుండి పలువురు సీనియర్లతో పాటు జూనియర్ల బృందం హాజరు కానున్నారు. తెలంగాణ నుండి సొప్పరి ఎల్లదాసు, విజ్జగిరి ప్రభాకర్, సిహెచ్ మల్లేశం, పొన్నబోయిన నవీన్, జూనియర్స్ విభాగంలో మెహరా మిరాజ్, జిర్రి లోకేష్, సిహెచ్. రిషిత్ వెళ్లనున్నారు. వీరిని రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎల్లా గౌడ్ పలువురు అభినందనలు తెలిపారు.

నీలం.. ముమ్మర ప్రచార వ్యూహం

- 25 నుంచి క్షేత్రస్థాయిలోకి ఎంపీ అభ్యర్థి మధు ముదిరాజ్
- ఏడు రోజుల్లో ఏడు నియోజకవర్గాల్లో పర్యటన, రోడ్ షోలు
- చిట్కుల్ క్యాంప్ ఆఫీస్ లో పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జీలు, ముఖ్య నేతలతో సన్నాహక సమావేశం



పటాన్ చెరు, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :

మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ఎన్నికల ప్రచారం ఈనెల 25 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు చిట్కుల్ ఎంపీ అభ్యర్థి క్యాంప్ ఆఫీసీలో మెదక్ పార్లమెంటు పరిధి అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్య నేతల సమావేశం సోమవారం నిర్వహించారు. పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్, టీఎస్ఐఐసీ చైర్మన్, డిసిసి అధ్యక్షులు నిర్మల జగ్గారెడ్డి, మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, సిద్దిపేట పూజల హరికృష్ణ, గజ్వేల్ ఇన్చార్జి నర్సారెడ్డి, నర్సాపూర్ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, దుబ్బాక ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, పటాన్ చెరు ఇన్చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, ఎలక్షన్ రెడ్డి, ఎన్నికల కోఆర్డినేటర్ అశోక్ గౌడ్, మహిళా నాయకురాలు సుహాసిని, ఐఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి, తదితరులు హాజర య్యారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ నియోజకవర్గంలో ఎన్నికలకు సంబంధించి పలు సలహాలు సూచనలు చేశారు. వారివారి నియోజకవర్గాల్లో చేయాల్సిన కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. మండలాలు, గ్రామస్థాయిలో కమిటీలను వేసుకు ని, పార్టీ పటిష్టతకు ముందుకు వెళ్లేలా కార్యాచరణ రూపొందించా రు. ఈనెల 25 నుంచి ప్రచారాన్ని ప్రారంభించి, వచ్చేనెల 11వ తేదీతో ముగిసేలా నిర్ణయం తీసుకున్నారు. ఏడు రోజుల్లో

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
23 ఏప్రిల్ 2024
తెలంగాణ

పోలీస్ కుటుంబాలకు ఆర్థిక భరోసా
జిల్లా ఎస్పీ చందనా దీప్తి

నల్గొండటౌన్, ఏప్రిల్ 22 (జనంసాక్షి):
జిల్లా పోలీసు కార్యాలయంలో ఏ.హెచ్. టి.యు విభాగంలో విధులు నిర్వర్తిస్తూ గుండె పోటుతో మరణించిన పీసీ ఎస్ కె నజీర్ సతీమణి సయ్యద్ సనా సమీరన్ కి భద్రతా పార్ట్ ఫైనల్ కింద 8,00,000/- రూపాయల చెక్కు అందజేసి కుటుంబ సభ్యులను యస్.పి పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చనిపోయిన పోలీసుల కుటుంబాలకు పోలీస్ శాఖ అన్ని రకాలుగా అండగా నిలుస్తుందని, ప్రభుత్వం ద్వారా వారికి రావాల్సిన అన్ని రకాల లబ్ది సాధ్యమైనంత త్వరగా ఇప్పించేలా కృషి చేస్తామని అన్నారు. చనిపోయిన పోలీస్ కుటుంబాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ సబిత,జూనియర్ అసిస్టెంట్ ప్రమోద,మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సాయి అలేఖ్య ను అభినందించి సత్కరించిన జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్

ఖమ్మం టౌన్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :
అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే సివిల్ సర్వీసెస్ పరీక్ష-2023 లో 938 వ ర్యాంక్ సాధించిన జిల్లాకు చెందిన సాయి అలేఖ్య సోమవారం నూతన కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సాయి అలేఖ్య ను అభినందించి సత్కరించారు. సాయి అలేఖ్య బోనకల్ మండలం, గోవిందాపురం (ఎల్) గ్రామ వాస్తవ్యులు కాగా, ఆమె తండ్రి పోలీస్ శాఖలో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేయుచున్నారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, సాయి అలేఖ్య తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

వరి పంటను కోసి ప్రయోగం

పెనుబల్లి ,ఎప్రిల్22(జనంసాక్షి)
వరి పంట కోత ప్రయోగం ద్వారా దిగుబడి అంచనా వేసి ప్రణాళికను సిద్ధం చేయుట కోసం హైదరాబాద్‌డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ అధికారుల బృందం సోమవారం, ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం గౌరారం గ్రామంలో పర్యటించింది. శ్రీనివాస రెడ్డి అనే రైతు సాగు చేస్తున్న వరి పంట పొలాన్ని పరిశీలించి 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పుతో వరి పంటను కోసి ప్రయోగం నిర్వహించారు. ఈ ప్రయోగంలో 9.760 కిలోల పంట దిగుబడి వచ్చిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమములో అర్థ గణాంక శాఖ అధికారులు రామభద్రం, ఉపగణాంక అధికారి కే వెంకట్రావు, గణాంక అధికారి కె. వెంకటేశ్వర్లు , ఉపగణాంక అధికారి శ్రీకాంత్ ,మండల గణాంక అధికారి రఘు స్థానిక రైతులు పాల్గొన్నారు.

మంచినీళ్ల కోసం ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు

అధికారుల నిర్లక్ష్యంతో మా గొంతు ఎండుతుంది అంటున్న మహిళలు

కల్లూరు ఏప్రిల్ 22 (జనంసాక్షి) :
వేసవికాలంలో ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించేందుకు గ్రామాలలో ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా వేసవిలో ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారుల నుండి మండల స్థాయి అధికారుల వరకు సమావేశాలు పెట్టి.ప్రకటనలు చేస్తున్నారు. తప్ప అవసరం ఉన్న చోట మంచినీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రజల ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. యజ్ఞ నారాయణపురం గ్రామంలో మంచినీటి కొరతతో ప్రజలు అల్లాడి పోతు మంచినీటి సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు తమకేమీ పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని అందుకు నిరసనగా గ్రామస్తులు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఈ ఏడాది ప్రతికూల వాతావరణ ప్రభావంతో సకాలంలో వర్షాలు పడకపోవడంతో పాటు, సాగర్ నీటి సరఫరా లేకపోవడం తో మండలంలో చుట్టుపక్కల ఉన్న కొన్నిచెరువులు ఎండిపోయి వేలవేల పోతున్నాయి. దీనికి తోడు భూగర్భ జలాలు అడుగంటడంతో వైఎన్ పురం గ్రామంలో మంచినీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన బోరు ఎండిపోయింది. అప్పట్నుంచి సుమారు రెండు నెలల నుండి మంచినీటి కోసం ఊరికి దూరంగా ఉన్న వ్యవసాయ బావి నీరు దిక్కయింది. ఈ బావి నుండి కూడా నీళ్లు తోడుకొని ఇంటి వరకు మోసుకొని పోవాల్సిన రావడం సుమారు దళితవాడకు అర కిలోమీటర్ దూరం ఉండటం మహిళలు ఇబ్బందులు పడుతు దీంతో నిరసనకు దిగారు. తమ గ్రామంలో మంచినీటి సరఫరా లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలంటూ ఇటీవల గ్రామస్తులు గ్రామాల్లోని పెద్దలు మండల స్థాయి అధికారుల దృష్టి కి సమస్యను తీసుకుపోయారు దీంతో జువాలజిస్ట్ వచ్చి బోర్ పాయింట్ పెట్టాడు బోర్ బండి వచ్చి బోర్ వేయడం జరిగింది. వెంటనే మోటర్ తీసుకొచ్చారు బోర్లు దించారు. కానీ బోరు దగ్గర నుండి మంచినీటి ట్యాంక్ వరకు సుమారు 400 మీటర్లు పైప్ లైన్ వేసి మంచినీటి ట్యాంకు కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. అధికారులు, క్షేత్రస్థాయిలో ఉన్న సిబ్బంది గత నెల రోజులు దాటిన పైపు కనెక్షన్ ఇవ్వలేదు అధికారులకు చెప్పిన పట్టించుకోకపోవడంతో మహిళలు ఖాళీ బిందెలు తీసుకొని రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామ మొత్తానికి ఒకే మంచినీటి సరఫరా ట్యాంక్ ఉంది. ఈనేపద్యంలో కొంతమంది రైతులు స్తోమత ఉన్నవారు ఇళ్లల్లో బోర్లు వేయించు కోవడం వల్ల త్రాగునీటికి ఇబ్బందులు పడవలసిన పరిస్థితి వారికి లేదు. దళితవాడల్లో ప్రజలు ప్రభుత్వం సరఫరా చేసే నీటిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. గతంలో అధికారం చేపట్టిన టిఆర్ఎస్‌రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటి సరఫరా చేయాలని లక్ష్యంతో ఏర్పాటుచేసిన మిషన్ భగీదర నీటి సరఫరా యజ్ఞ నారాయణపురం గ్రామ ప్రజలకు అందని ద్రాక్షగా మిగిలింది. . మిషన్ భగీరథ పథకాన్ని గత ప్రభుత్వం అమలు చేసి సుమారు ఐదు సంవత్సరాలు దాటిన నేటి వరకు కూడా మిషన్ భగీర నీరు ఆ గ్రామాన్ని చేరటం లేదు. దళితవాడలో మిషన్ భగీర మంచినీటి సరఫరా కోసం ట్యాంక్ నిర్మించడం జరిగింది. నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో అప్పట్లోనే ట్రయల్ కోసం నీటిని వదలడంతో ట్యాంక్ మొత్తం లీక్ కావటంతో నీటి సరఫరా నిలిపివేశారు . ఆ తర్వాత ట్యాంకు తాత్కాలి మరమ్మత్తులు చేశారు కానీ నేటి వరకు నీటి సరఫరా ఇవ్వలేదు. దీంతో లక్షలు పెట్టి ట్యాంక్ నిర్మించినప్పటికీ అలంకారప్రాయంగా మారిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలో మారుమూల గ్రామీణ ప్రాంతం కావడం వల్ల మంచినీటి సరఫరా కావడం లేదు. మిషన్ భగీదర నీటి సరఫరా విషయం పై అధికారులు, సిబ్బంది పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రత్యమ్మాయంగా ఏర్పాటు చేసిన మంచినీటి బోరుకి వెంటనే కనెక్షన్ ఇచ్చి మంచినీటి బాధలు తప్పించాలని ఆ గ్రామంలోని మహిళలు జిల్లా అధికారులను వేడుకుంటున్నారు.

అందరికీ అందుబాటులో ఉండే నాయకుడు వేణారెడ్డి

మాజీ మంత్రి ఆర్డీఆర్

సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):
అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ గత 35 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో నిజాయితీ, నిబద్ధతతో సేవలందిస్తున్న నాయకులు కొప్పుల వేణారెడ్డి అని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్చార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు.సోమవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొప్పుల వేణారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రెడ్ హౌస్ లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేణారెడ్డితో గత 50 సంవత్సరాలుగా అనుబంధం ఉందన్నారు. నాటి ఉమ్మడి రాష్ట్ర సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డితో సహా అనేక మంది ముఖ్యమంత్రులు, మంత్రులు వేణారెడ్డిని పేరు పెట్టి పిలుస్తారని గుర్తు చేశారు.కాంగ్రెస్ పార్టీ కాకుండా అన్ని రాజకీయ పార్టీలతో సత్సంబంధాలు కలిగిన నాయకుడు వేణారెడ్డి అన్నారు. సూర్యాపేట, తుంగతుర్తి రెండు నియోజకవర్గాల్లో ప్రతి గ్రామంలో 50 మందిని పేరు పెట్టి పిలువగల మేధా సంపన్నుడని కొనియాడారు. పదేళ్లు పార్టీ అధికారంలో లేకున్నా కార్యకర్తలను, నాయకులను కంటికి రెప్పల కాపాడుకున్న ఘనత వేణారెడ్డిదే అన్నారు. కాంగ్రెస్ పార్టీలో 35 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉన్న వేణారెడ్డి ఉన్నత పదవులు అధిరోహించి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బైరు శైలేందర్, నాయకులు చకిలం రాజేశ్వర్ రావు, అంజద్ అలీ, ధరావత్ వీరన్న నాయక్, పోలగాని బాలు గౌడ్, రుద్రంగి రవి, మాద నవీన్, రావుల రాంబాబు, వీర్ల వాసు, పోలేపోయిన నరసయ్య యాదవ్, ఆలేటి మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు

సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):
ధాన్యం కొనుగోలు, రవాణా, దిగుమతి వేగంగా జరగాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు.సోమవారం వెబ్ ఎక్స్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్పెషలాఫీసర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు ,పౌరసరఫరాల అధికారులతో అదనపు కలెక్టర్లు సిహెచ్.ప్రియాంక, బిఎస్.లతతో కలిసి వెబ్ ఎక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండల ప్రత్యేక అధికారులు సమన్వయంతో పని చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఫోటోలకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వొద్దని, కొనుగోలు కేంద్రాలకు దగ్గరలో ఉండి కొనుగోలు రవాణా త్వరగా అయ్యేలా చూడాలని అన్నారు.సివిల్ సప్లై అధికారులు మిల్లుల వద్ద వచ్చిన ధాన్యాన్ని లారీల నుండి వేగంగా దిగుమతి అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్డు రవాణా అధికారులు లారీలను అవసరమైన చోటుకు వెంటనే చేర్చాలని వాటిని ధాన్యం కొనుగోలు వద్ద ధాన్యాన్ని మిల్లులకు రవాణా వెంటనే జరిగేలా మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు చూడాలని పేర్కొన్నారు.కోదాడ, హుజూర్ నగర్ మిల్లుల వద్ద ధాన్యం లారీల నుండి దిగుమతి అయ్యేలా ఆర్డీవోలు ప్రత్యేక కమిటీలు పెట్టి పర్యవేక్షించాలని ఆదేశించారు.కొనుగోలు కేంద్రాలలోని ధాన్యాలను ఈ నెల 30లోగా గల పూర్తిగా రవాణా అయ్యే విధంగా చూడాలని తెలిపారు. దిగుమతులు వద్ద లేబర్ ను ఎక్కువగా పెట్టుకునే విధంగా సివిల్ సప్లై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. నాగారం, తుంగతుర్తి ధాన్యం కొనుగోలు కేంద్రాలు సరిగా పర్యవేక్షించడం లేదని తన దృష్టికి రావడం జరిగిందని, త్వరగా ధాన్యం కొనుగోలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని వసతులు ఏర్పాటు చేయాలని, త్వరగా దాన్యం మిల్లులకు రవాణా అయ్యేలా, మిల్లుల వద్ద దిగుమతి త్వరగా చేసి ఇతర రాష్ట్రాల నుండి కేటాయించిన లారీలను వెంటనే పంపాలని ఆదేశించారు.

ఖమ్మంలో బీఆర్‌యస్ పార్టీ జెండా
ఎగరడం ఖాయం

- కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది

- పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటాం

ఖమ్మం రూరల్ , ఏప్రిల్ 22 (జనంసాక్షి):
తెలంగాణ రాష్ట్ర ప్రజల హక్కులను కాపాడాలి అంటే బీ.ఆర్.యస్ పార్టీ ఎంపీలు పార్లమెంట్ లో ఉండాలని అలానే కష్టకాలం లో పార్టీకి అండగా నిలబడుతానని ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు తెలిపారు రానున్న రోజుల్లో బీ.ఆర్.యస్ పార్టీదే భవిష్యత్ అన్నారు. సోమవారం నాడు ఖమ్మం రూరల్ మండలం మండలం పల్లెగూడెం గ్రామం లోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్ నందు బీ.ఆర్.యస్ పార్టీ మండల ముఖ్య నాయకులతో జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశం లో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ,ఎంఎల్సీ ,జిల్లా పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి తో కలసి పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో ఏనాడు తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం మన రాష్ట్ర ప్రజల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్, బీజేపీ పార్టీల ఎంపీలు మాట్లాడలేదని పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో బీ.ఆర్.యస్ జెండా ఎగరడం ఖాయమ్మన్నారు. శాసనసభ ఎన్నికల ముందు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఆరు గ్యారెంటీలను నమ్మి కాంగ్రెస్ కు ఓటేసి తప్పు చేశామని రైతులు, ప్రజల నుండి వినిపిస్తుందని తెలంగాణ ప్రజలు తిరిగి కేసీఆర్ పాలన కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. సాగునీరు, తాగునీరు లేక రైతాంగం తో పాటుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. రైతులకు ఎకరాకు 25 వేలు పంట నష్టపరిహారం తో పాటుగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు పండిన వరి పంటకు రూ. 500/- వందల రూపాయలు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు బిడ్డగా ఎప్పుడు రైతు శ్రేయసు కోసం ఆలోచిస్తా అని అందులో భాగంగానే నష్టాల్లో ఉన్న రాజేశ్వరపురం షుగర్ ఫ్యాక్టరీ కొనుగులు చేసి ఆనాటి నుండి నేటి వరుకు రైతుల కోసమే నడపడం జరుగుతుందని గుర్తు చేశారు. గ్రామాల్లో పార్టీ శ్రేణులు ప్రజల వద్దకు వెళ్లి కేసీఆర్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకు అందించిన తీరును వివరించాలని కోరారు, రైతుల కోసం రైతు బంధు, రైతు బీమా లాంటి విప్లవాత్మక పథకాలు దేశం లోనే ఎక్కడ లేవని అలాంటి పథకాలను తెలంగాణ రాష్ట్రం లో అమలు చేసి రైతుకు పెట్టుబడి సహాయం, పుష్కలంగా సాగునీరు, ఉచిత విద్యుత్, పంట కొనుగోలు చేసి రైతు కుటుంబాలకు అండగా నిలిచిన ఏకైక నాయకుడు కేసీఆర్ అన్నారు. తను ఎంపీ గా గెలవకముందు ఉమ్మడి ఖమ్మం జిల్లా లో ఒక్క నేషనల్ హైవే కూడా ఉండేది కాదని తరువాత కేంద్రం పై పోరాడి పలు రోడ్లను నేషనల్ హైవే లాగా మార్చడం తో పాటుగా వందల కోట్ల నిధులు కేంద్రం నుండి తీసుకువచ్చి ఎన్నో గ్రామాల మధ్య లింక్ రోడ్లను బీటీ రోడ్లగా మార్చమని గుర్తు చేశారు అలానే రైల్వే పనులు కూడా పూర్తి చేసుకున్న మన్నారు. పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటామని ఆయన బరోసా ఇచ్చారు. ఈ సమావేశం లో జిల్లా నాయకులు తాళ్లూరి జీవన్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణు, జడ్పీటీసీ వరప్రసాద్, ఎంపీపీ బెల్లం ఉమా, వైస్ ఎంపీపీ దర్గయ్య, లక్ష్మణ్, పేరం వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

చెల్లింపుల్లో అలసత్యం వద్దు
అకాల వర్షాలు పడుతున్నందున దృష్టి పెట్టండి
జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు

సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి) :
కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం సత్వరమే ట్యాగింగ్ మిల్లులకు పంపాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు సూచించారు. సోమవారం చివ్వెంల మండలం వల్లభాపురం లోని పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రైతు చిడిమట్ల వెంకన్న తెచ్చిన ధాన్యాన్ని పరిశీలించి రైతుతో మాట్లాడారు. కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా జరగాలని,అలాగే కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యం తెచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 89598.280 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, చెల్లింపులు దాదాపు రూ. 60 కోట్లకు పైగా చేశామని అన్నారు. జిల్లాలో అకాల వర్షాలు పడుచున్నందున తార్పాలిన్లు అన్ని కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని అలాగే మండల , ప్రత్యేక అధికారులు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు వెంటనే లారీల ద్వారా దిగుమతి చేసుకోవాలని సూచించారు.కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యం వివరా లను వెంటనే టాబ్ ఎంట్రీ చేయాలని, రైతులకు చెల్లింపుల్లో ఆలస్యం చేయవద్దని సూచించారు. అన్ని కేంద్రాల్లో ధాన్యం శుద్ధి యంత్రాలు, తేమశాతం, కాంటాలు,గొనె సంచులు, తార్పాలిన్లు తప్పక ఉండాలని ఆదేశించారు.తదుపరి కోదాడలో తమ్మర బండపాలెంలోని శ్రీ ధనలక్ష్మి పార్ బాయిల్డ్ రైస్ మిల్ ను తనిఖీ చేసి పెండింగ్ సిఎంఆర్ సత్వరమే ఎఫ్సిఐకి అందించాలని, మిల్లులో గల స్టాక్‌ను పరిశీలిం చారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సూర్యనారాయణ, డిఎస్ఓ మోహన్ బాబు, తహశీల్దార్లు కృష్ణయ్య, సాయిగౌడ్, మిల్లు యజమాని ఎన్.నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్కిడ్స్ ఉన్నత పాఠశాల లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22 (జనంసాక్షి):
ఆర్కిడ్స్ ఉన్నత పాఠశాల లో సోమవారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కామారెడ్డి పట్టణంలోని ఆర్కిడ్స్ ఉన్నత పాఠశాలలో గ్రాడ్యు యేషన్ డే కార్యక్రమాన్ని చైర్మన్ అండ్ ప్రిన్సిపల్ సిహెచ్ గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మెన్ అండ్, ప్రిన్సిపాల్ సిహెచ్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈ వేడుక కేవలం విద్యా విషయక విజయాల వేడుక మాత్ర మే కాదని, నేర్చు కోవడం మరియు వృద్ధికి సంబంధించిన కొత్త అధ్యయనం చేయడం అని అన్నారు. ఈ వేడుకలో అధిక సంఖ్యలో పిల్లల తల్లి దండ్రులు పాల్గొని విజయవంతం చేసారు.ఈ వేడుకల్లో భాగంగా యూకేజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు యాజమాన్యం చేతుల మీదుగా కాన్వోకేషన్ సర్టిపికేట్లు అంద జేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ అండ్ ప్రిన్సిపాల్ సిహెచ్ గోవర్ధన్ రెడ్డి, ఆర్కె గ్రూప్ ఆఫ్ సీఈవో. ఎం. జైపాల్ రెడ్డి, డైరక్టర్ యం సదా శివరెడ్డి, ఆర్కె డీన్ నవీన్ కుమార్, ఉపాధ్యాయ బృందం విద్యర్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఓ ఆర్ ఎస్ తీసుకోవడం ద్వారా వడదెబ్బ ఉపశమనం

ప్రభుత్వ వైద్యాధికారి నవ్య కాంత్

కల్లూరు ఏప్రిల్ 22(జనం సాక్షి)
ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే ప్రయాణికులకు ఆర్టీసీ సిబ్బందికి ఓఆర్ఎస్ ద్రావణం వేసవిలో ఉపశమనాన్ని కలిగిస్తుందని కల్లూరు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ నవ్య కాంత్ అన్నారు. సోమవారం కల్లూరు బస్టాండ్ లో టీం సత్తుపల్లి , కల్లూరు ప్రభుత్వ వైద్యశాల సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఓఆర్ఎస్ పాకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రయాణికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రయాణ సమయంలో ఎండ నుండి ఉపశమనం పొందేందుకు పిల్లలు, వృద్దులు, గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకొని వెళ్లాలని సూచించారు. ఓ ఆర్ ఎస్ ద్రావణం దగ్గర ఉంచుకొని ప్రయాణం చేయడం వలన డి హైడ్రేషన్ అవకుండా కాపాడుకోవచ్చునని తెలిపారు. శరీరానికి కావలసిన నీటిని లవణాలను తగు మోతాదులో అందించుట వల్ల వడదెబ్బ నుండి ఉపశమనం లభిస్తుందని అన్నారు. నాలుగు చెంచాల ఓఆర్ఎస్ పొడిని ఒక లీటర్ నీటిలో కలుపుకొని త్రాగినట్లయితే ఎండ నుండి కాపాడుకున్న వారము అవుతామని సూచించారు. కల్లూరు బస్టాండులో ప్రతిరోజు ఓఆర్ఎస్ ప్యాకెట్లు కావలసినన్ని అందుబాటులో ఉంటాయని , ప్రయాణికులు ఆర్టీసీ సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ నవ్య కాంత్ కోరారు.. ఈ కార్యక్రమంలో విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు, ట్రాఫిక్ గైడ్ వెంకటేష్, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

లాభాల్లో సూచీలు

దేశీయ స్టాక్‌మార్కెట్‌లు లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా ప్రతి కూల అంశాలు ఉన్నప్పటికీ వాటి ప్రభావం దేశీయ స్టాక్ మార్కెట్‌లపై నామమాత్రంగానే చూపినట్లు తెలుస్తోంది.ఫలితంగా సోమవారం మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 560 పాయింట్ల లాభంతో 73,648 వద్ద, నిఫ్టీ 189 పాయింట్ల లాభంతో 22,336 వద్ద నిలిచాయి.టాప్ నిఫ్టీ బీపీసీఎల్, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్, ఎథేర్ మోటార్స్, ఎల్‌అండ్‌టీ, శ్రీరామ్ ఫైనాన్స్ స్టాక్స్ నిలవగా ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఇండస్ ఇండ్ బ్యాంక్, టాటా స్టీల్ షేర్లు నష్టపోయాయి.ఇక ఆటో, పీఎస్‌యూ బ్యాంక్, కేపిటల్ గూడ్స్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్‌ఎంసీజీ, హెల్త్‌కేర్, రియలిటీ షేర్లు సుమారు 3 శాతం లాభపడ్డాయి.దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో మన సూచీలూ రాణించాయి. ముఖ్యంగా ప్రైవేటు బ్యాంకులు, ఇన్‌ఫ్రా స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది.దీంతో సూచీలు వరుసగా రెండోరోజూ రాణించాయి. సెన్సెక్స్ 560 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 22,300 పాయిం ట్ల ఎగువన ముగిసింది.సెన్సెక్స్ ఉదయం 73,66 6.51 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యం తం అదే ఒరవడిని కొనసాగించింది. ఇంట్రాడేలో 73,227.32 – 73,767.80 మధ్య కదలాడిన సూచీ.. 560.29 పాయింట్లు లాభపడి 73,648.62 వద్ద ముగిసింది. నిఫ్టీ 189.40 పాయింట్లు లాభపడి 22,336.40 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.36గా ఉంది. సెన్సెక్స్‌లో ఎల్‌అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, విప్రో షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఇండస్ ఇండ్ బ్యాంక్, టాటా స్టీల్ ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ రకం బ్యారెల్ చమురు ధర 86.74 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.వొడాఫోన్‌రూ. 18వేల కోట్ల నిధుల సమీకరణలో భాగంగా ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్‌కు వచ్చిన వొడాఫోన్ చివరిరోజు 6.92 రెట్లు (సాయంత్రం 3.50 గంటల సమయానికి) సబ్‌స్క్రైబ్ అయ్యింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల నుంచి 19.20 రెట్లు, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు 4.52 రెట్లు స్పందన లభించింది. రిటైల్ పోర్షన్ మాత్రం 0.92 శాతమే సబ్‌స్క్రైబ్ అయ్యింది.

'ఫుల్ సెల్ఫ్ డ్రైవింగ్' వ్యవస్థ ధరనూ కుదించిన టెస్లా

న్యూయార్క్: ప్రముఖ విద్యుత్తు కార్ల తయారీ సంస్థ టెస్లా 'ఫుల్ సెల్ఫ్ డ్రైవింగ్ వ్యవస్థ ధరను సైతం తగ్గించింది. 12,000 డాలర్ల నుంచి 8,000 డాలర్లకు కుదించింది. కార్లపైనా కంపెనీ 2,000 డాలర్ల వరకు ధరల్ని తగ్గించిన విషయం తెలిసిందే. చైనా మార్కెట్‌కూ ఆ నిర్ణయాన్ని వర్తింపజేసింది. ఇలా వరుసగా ధరలు తగ్గించటం.. ఇతర కంపెనీల నుంచి టెస్లా ఎదుర్కొంటున్న పోటీని సూచిస్తోందని వాహనరంగ నిపుణులు తెలిపారు.ఇటీవల టెస్లా విక్రయాలు గణనీయంగా పడిపోయాయి. మరోవైపు పోటీ కూడా తీవ్రమవుతుండటంతో కస్టమర్లను ఆకర్షించేందుకు టెస్లా ధరల కోత వ్యూహాన్ని అనుసరిస్తోంది. టెస్లా షేరు విలువ శుక్రవారం 150 డాలర్ల దిగువకు కుంగింది. 2024లో కంపెనీ స్టాక్ ధర ఇప్పటివరకు 40 శాతం మేర కుంగడం గమనార్హం. ఈ తరుణంలో కార్లు సహా ఎఫ్ఎస్‌డీ ధరలను తగ్గించడం గమనార్హం.అమెరికా సహా వివిధ మార్కెట్లలో ఖరీదైన కార్లపై వెచ్చించడానికి కస్టమర్లు వెనకాడుతున్నారు. అధిక వడ్డీరేట్లే దీనికి కారణం. దీంతో టెస్లా పాత కార్లను పెద్దగా అప్‌గ్రేడ్ చేయడం లేదు. అదే సమయంలో చైనాలో వివిధ కంపెనీలు అందుబాటు ధరలో కొత్త ఈవీ మోడళ్లను ప్రవేశపెడుతున్నాయి. విక్రయాలు కుంగడం, పోటీ పెరగడంతో టెస్లా కొత్త వ్యూహాలను అనుసరిస్తోంది. మరోవైపు వ్యయ నియంత్రణ చర్యలను సైతం చేపట్టింది. అందులోభాగంగా ఇటీవల 10 శాతం ఉద్యోగులను తొలగించింది.టెస్లా మోడల్ కార్లన్నీ 'ఆటో పైలట్' మోడ్ ఫీచర్‌తో వస్తాయి. ఇది ఒక డ్రైవర్ అసిస్టెన్స్ వ్యవస్థ. ట్రాఫిక్‌ను బట్టి వేగాన్ని నియంత్రించడం, నిర్దిష్ట వరుసలోనే వెళ్లేలా కమాండ్ ఇవ్వడం వంటివాటిని కారు దానికదే చేసుకుంటుంది. ఈ ఆటోపైలట్‌ను మరింత అధునాతనంగా తీర్చిదిద్ది 'ఫుల్ సెల్ఫ్ డ్రైవింగ్' సిస్టమ్‌ను తీసుకొచ్చారు. దీంట్లో డ్రైవర్ ప్రమేయం లేకుండానే పరిస్థితులకు అనుగుణంగా కారు కొన్ని పనులను సొంతంగా నిర్వహిస్తుంది. రోడ్డుపై ఒక వరుస నుంచి ఇంకో వరుసకు మారడం, పార్కింగ్, మొబైల్ యాప్‌తో కారును మూవ్ చేయడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గుర్తించి తదనుగుణంగా నడుచుకోవడం ఆటోమేటిక్‌గా జరిగిపోతుంది.కారు చుట్టూ ఉండే కెమెరాలు, అల్ట్రాసౌండ్ సెన్సర్ల ద్వారా ఇది సాధ్యమవుతుంది. ఇవి కారులో ఉండే సాఫ్ట్‌వేర్‌కు అనుసంధానమై ఉంటాయి. ఎప్పటికప్పుడు పరిస్థితులను అంచనా వేసి కావాల్సిన ఔట్‌పుట్‌ను ఇస్తుంది. అందుకు అనుగుణంగా కారు ముందుకెళ్తుంది. అయితే, డ్రైవర్ పర్యవేక్షణ మాత్రం తప్పనిసరి.

సెకండ్ హ్యాండ్ లగ్జరీ కారు కొనుగోలు వల్ల లాభనష్టాలు

పాత కారు కొనుగోలు ప్రయోజనమేనా?



సొంతంగా కారును కొనుగోలు చేసి దానిలో తమ దైనందిన కార్యక్రమాలకు వెళ్లడానికి చాలా మంది ఆసక్తి చూపుతారు. మరికొందరు ఏదో ఒక కారు అని కాకుండా విలాసవంతమైన కారును సొంతం చేసుకోవడానికి ఇష్టపడతారు.విలాసవంతమైన కారు కొనడం అనేది చాలామందికి ఒక కల. దీంతో చాలామంది సెకండ్ హాండ్ లగ్జరీ కారును కొనుగోలు చేసి తమ కలను నెరవేర్చుకుంటున్నారు. ఈ మధ్యకాలంలో సెకండ్ హ్యాండ్ లగ్జరీ కార్ల మార్కెట్ భారత్‌లో ఏటా 15-20% వృద్ధి చెందుతోంది. సగటున సంవత్సరానికి 60 వేలకు పైగా విక్రయాలు జరుగుతున్నాయి. వివిధ కార్ల కంపెనీలు కూడా సెకండ్ హ్యాండ్ లగ్జరీ కార్ల అమ్మకాల నిమిత్తం అనేక షోరూంలను తెరిచి బ్యాంకు లోన్ సౌకర్యం కూడా కల్పిస్తున్నాయి. సెకండ్ హ్యాండ్ లగ్జరీ కార్లను కొనడం ప్రయోజనమేనా? చాలామంది కారు కొనుగోలు చేయడానికి సిద్ధమైనా దాని ధర చూసి ఆగిపోతారు. లగ్జరీ కారు అయితే ధర ఎక్కువే ఉంటుంది. అయితే, కొత్త కారు షోరూం నుంచి బయటకు వచ్చిన వెంటనే, దాని విలువ మార్కెట్లో తగ్గుతుంది. 6 నెలల నుంచి 1 సంవత్సరం వ్యవధిలో కారు 15-25 శాతం విలువను కోల్పోతుంది. వాహనం ఐదేళ్ల తర్వాత దాదాపు సగం విలువను కోల్పోతుంది. అదే విధంగా తరుగుదల రేటు ప్రతి సంవత్సరం గడిచేకొద్దీ పెరుగుతూనే ఉంటుంది. ఇది కొత్త కార్లను కొనుగోలు చేసిన యజమానులకు నష్టం అయినప్పటికీ, వారి నుంచి ఈ వాహనాలను కొనుగోలు చేసే వినియోగదారులకు లాభదాయకం. అంతేకాకుండా, కొత్త కారుతో పోల్చితే సెకండ్ హ్యాండ్ లగ్జరీ కారు ధరలు చాలా నెమ్మదిగా తగ్గుతాయి. ఇలాంటి పరిస్థితిలో సెకండ్ హ్యాండ్ లగ్జరీ కారును కొనుగోలు చేయడం మంచి ఎంపిక.నాన్ లగ్జరీ కారు కొనుగోలు బడ్జెట్ కాస్త పెంచితే సెకండ్ హ్యాండ్ లగ్జరీ కారును కొనుగోలు చేయొచ్చు. ఆడి, బీఎండబ్ల్యూ, మెర్సిడెజ్ బెంజ్, ల్యాండ్ రోవర్ వంటి బ్రాండ్ల సెకండ్ హ్యాండ్ లగ్జరీ కారు సగటు ధర రూ.25-40 లక్షలు వరకు ఉంటుంది. ఇవే కొత్తవి అయితే రూ.50-65 లక్షల నుంచి ప్రారంభమవుతాయి. ఉదాహరణకు కొత్త ఃఓచి 3 సిరీస్ 320ఆ లగ్జరీ ఎడిషన్ ధర 60.50 లక్షలయితే.. అదే 2015 మోడల్‌ను రూ.21-22 లక్షలకు కొనుగోలు చేయొచ్చు. ఇది కొత్త టొయోటా ఇన్నోవా క్రిస్టా, లేదా హ్యుందాయ్ వెర్నా ఎస్ఎక్స్ ధరతో సమానంగా ఉంటుంది. కాబట్టి, ప్రీ ఓన్డ్ లగ్జరీ కారు లాభదాయకమైన ఆఫర్ అని చాలా మంది కొనుగోలుదారులు భావిస్తున్నారు.ఎవరైనా సౌకర్యాలు ఆశించి కారును కొనుగోలు చేస్తారు. సాధారణ కార్లతో పోలిస్తే లగ్జరీ కార్లు చాలా సురక్షితమైనవి. లగ్జరీ కార్లలో సౌకర్యాలు చాలా ఎక్కువే ఉంటాయి. 6/7 ఎయిర్ బ్యాగ్‌లు, రివర్స్ పార్కింగ్ సెన్సార్స్, హిల్- హోల్డ్ అసిస్ట్, క్రూయిజ్ కంట్రోల్, జీపీఎస్ ట్రాకింగ్, 360 డిగ్రీ కెమెరా సదుపాయం వంటి యాంటీ-థెఫ్ట్ ఫీచర్స్‌తో పాటు బ్లైండ్ స్పాట్ మానటరింగ్ ఎనేబుల్ చేయడానికి కార్లు ఆటోమెటిక్, అధునాతన సెన్సార్‌లు ఉంటాయి. నాన్ లగ్జరీ కార్లలో లేని ఫీచర్లు.. సెకండ్ హ్యాండ్ లగ్జరీ కార్లలో కనిపిస్తాయి. వినియోగదారులు నిరంతరం అధునాతన సాంకేతికతలు, ఫీచర్లు, డిజైన్లు, హై-ఎండ్ టెక్నికల్ ఫీచర్లను, భద్రతను కోరు కుంటారు. ఇటువంటి అన్ని అంశాలు గల లగ్జరీ కారు ను సెకండ్ హ్యాండ్ మార్కెట్‌లో కొనుగోలు చేయడం వినియోగదారులకు మేలే అని చెప్పవచ్చు.సెకండ్ హ్యాండ్ కార్లకు బీమా ఖర్చులపై గణనీయమైన తగ్గింపు ఉంటుంది. కారు వయసును పరిగణనలోకి తీసుకుం టే, బీమా ప్రీమియం మొత్తం స్థిరంగా తగ్గుతుంది. బీమా కోసం చెల్లించాల్సిన మొత్తం సాధారణంగా కారు ప్రస్తుత విలువపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా ప్రమాదం జరిగినప్పుడు మరమ్మతులకు అయ్యే ఖర్చు ఎక్కువగా ఉండడంతో బీమా కంపెనీలు కొత్త వాహ నాలకు అధిక ప్రీమియం వసూలు చేస్తాయి.

గుడ్ల ధరలు

హైదరాబాద్	వరంగల్
₹ 3.75	₹ 3.77

బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

₹67,550 (22 క్యారెట్లు)	₹ 73,690 (24 క్యారెట్లు)

చెన్నై

₹ 68,450 (22 క్యారెట్లు)	₹ 74,670 (24 క్యారెట్లు)

వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్
₹ 89,000

నిఘా వైఫల్యం ఫలితం..

ఇజ్రాయెల్ మిలటరీ అధికారి రాజీనామా

టెల్‌అవీవ్(జనంసాక్షి):అక్టోబరు 7నాటి హమాస్ దాడులతో ఇజ్రాయెల్ ఉలిక్కిపడిన విషయం తెలిసిందే. ప్రపంచంలో అత్యంత సమర్థమం తమైనవిగా గుర్తింపుపొందిన ఇజ్రాయెల్ నిఘా వర్గాలు..హమాస్ కదలికలను అంచనా వేయడంలో విఫలమయ్యాయి. దీనిపై భద్రతా అధికారులు క్షమాపణలు సైతం చెప్పారు. ఈ క్రమంలోనే నాటి ఇంటెలిజెన్స్ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ.. ఇజ్రాయెల్ మిలటరీ నిఘా విభాగం అధిపతి మేజర్ జనరల్ అహరోన్ హలీవా రాజీనామా చేశారు. హమాస్ దాడుల వ్యవహారంలో రాజీనామా చేసిన మొదటి సీనియర్ సైనికాధికారి ఆయనే. హలీవాకు సైన్యం లో 38 ఏళ్ల అనుభవం ఉంది. ఉగ్రవాదుల ప్రణాళికలను గుర్తిం చడంలో తమ విభాగం వైఫల్యాన్ని ఆయన అంగీకరించారు. "మేం ముఖ్యమైన పనిని పూర్తి చేయలేదు. మిలటరీ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఈ వైఫల్యానికి పూర్తి బాధ్యత వహిస్తాను" అని పేర్కొన్నారు. యుద్ధం మొదలైన ఆరు నెలల తర్వాత రాజీనామా చేశారు. తన స్థానంలో మరొకరు నియమితులైన తర్వాత వైదొలగనున్నట్లు వెల్లడించారు. అక్టోబరు 7నాటి దాడుల్లో ఇజ్రాయెల్‌లో దాదాపు 1200 మందికిపైగా మృతి చెందారు. దీంతో హమాస్ అంతమే లక్ష్యంగా టెల్‌అవీవ్ యుద్ధం ప్రకటించింది.

జాతీయం అంతర్జాతీయం
జనంసాక్షి

వినూత్న ప్రయత్నం

'పచ్చని' పోలింగ్ బూత్‌కు ఓటర్లు ఫిదా!

చెన్నై: దేశంలో లోక్‌సభ ఎన్నికల సందడి కొనసాగుతోంది. మొత్తం ఏడు దశల్లో ఇవి జరుగుతుండగా.. ఇప్పటికే మొదటి విడత పూర్తయ్యింది.అయితే, ఈ వేసవిలో భానుడి ప్రతాపానికి మండుటెండల్లో క్యూలో నిలబడి ఓటు వేయాలంటే ప్రజలు భయపడిపోతున్నారు. ఈనేపథ్యంలోనే ఆహ్లాదకర వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు తమిళనాడు అధికార యంత్రాంగం చేసిన వినూత్న ఆలోచన అందరినీ ఆకర్షిస్తోంది.ఎండ నుంచి ఉపశమనం కోసం తిరుపత్తూరు జిల్లాలోని పోలింగ్ బూత్ ఎదుట కొబ్బరి, వెదురు, అరటి ఆకులతో పందిరి వేసి అందంగా ముస్తాబు చేశారు. దీంతో అక్కడ పండగ వాతావరణం నెలకొంది. ఎలాంటి ఇబ్బంది లేకుండా వృద్ధులు సైతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీనికి సంబంధించిన వీడియోను ఐఏఎస్ అధికారిణి సుప్రియసాహు 'ఎక్స్'లో షేర్ చేశారు. "ఎండ, వడగాల్పుల నుంచి ఓటర్లకు ఉపశమనం కలిగించేలా.. పర్యావరణం కోసం పనిచేసే ఓ స్వచ్ఛంద సంస్థ నేతృత్వంలోని యువకులతో కలిసి జిల్లా యంత్రాంగం గ్రీన్ పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేసింది. పచ్చని తోరణాలు ఓటర్లకు స్వాగతం పలికాయి" అని పేర్కొన్నారు.సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన ఈ వీడియో నెటిజన్లను ఆకట్టుకొంది. "అద్భుతమైన చొరవ. ఈ ఆలోచన అదుర్స్" అని ఒకరు.. "చూడటానికి ఎంతో అందంగా ఉంది. ఈ గొప్ప ప్రయత్నానికి ధన్యవాదాలు" అని మరొకరు కామెంట్ చేశారు.

తొలిసారి కువైట్‌లో హిందీ రేడియో ప్రసారం ప్రారంభం

జనంసాక్షి:భారత్-కువైట్ మధ్య దౌత్యపరంగా మంచి సంబంధాలు ఉన్నాయి. కువైట్‌లో తొలిసారి హిందీ రేడియో ప్రసార కార్యక్రమం ప్రారంభమైనట్లు భారత రాయబార కార్యాలయం సోమవారం ఎక్స్ వేదికగా వెల్లండించింది.ప్రతి ఆదివారం ఎఫ్ఎం 93.3, ఏఎం 96.3 ఫ్రిక్వెన్సీల్లో కువైట్‌లోని రేడియోల్లో ఇక నుంచి హిందీ కార్యక్రమాలు ప్రసారం కానున్నాయి. రేడియోలో హిందీ కార్యక్రమాలు ప్రసారం ప్రారంభించటంపై కువైట్ సమాచార మంత్రిత్వ శాఖపై భారత రాయబార కార్యాలయం ప్రశంసలు కురిపించింది.'కువైట్‌లో రేడియో ప్రసార కార్యక్రమం ప్రారంభించటం.. ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింతగా మెరుగుపరుచుకోవటంలో కీలకంగా మారనున్నాయి. కువైట్‌లో సుమారు 10 లక్షల మంది ప్రవాస భారతీయులు ఉన్నారు. భారతీ వ్యాపార కమ్యూనిటీ కువైట్ రిటైల్ మార్కెట్‌లో చాలా కీలకంగా వ్యవహరిస్తోంది. 1961 నుంచి భారత్.. కువైట్‌కు ఒక ప్రధానమైన భాగస్వామ్య దేశంగా ఉంది. 2021-2022 సంవత్సరానికి ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన సంబంధాలు ఏర్పడి 60 ఏళ్లు అవుతోంది' అని భారత రాయబార కార్యాలయం తెలిపింది.

30 వారాల గర్భవిచ్ఛిత్తికి అనుమతి

14 ఏళ్ల బాలిక కేసులో సుప్రీం అసాధారణ తీర్పు

దిల్లీ: అత్యాచారానికి గురై గర్భం దాల్చిన ఓ 14 ఏళ్ల బాలికకు సుప్రీంకోర్టు ఊరట కల్పించింది. దాదాపు 30 వారాల ఆమె గర్భాన్ని వైద్యపరంగా విచ్ఛిత్తి చేసుకునేందుకు అనుమతిం చింది.దీనిని 'అసాధారణ' కేసుగా పరిగణించిన అత్యున్నత న్యాయస్థానం.. విస్తృత అధికారాలను ఉపయోగించుకుని తీర్పు వెలువరించింది.మహారాష్ట్రకు చెందిన 14 ఏళ్ల బాలిక లైంగిక దాడికి గురై గర్భం దాల్చింది. కాస్త ఆలస్యంగా ఈ విషయం తెలుసుకున్న ఆమె తల్లి బాంబే హైకోర్టును ఆశ్రయించింది. తన కుమార్తె 28 వారాల గర్భాన్ని తొలగించేందుకు అనుమతించాలని ఈ నెల ఆరంభంలో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గర్భవిచ్ఛిత్తికి నిరాకరించింది. ప్రస్తుతం ఆమె ప్రెగ్నెన్సీ చివరి త్రైమాసికంలో ఉందని.. ఇప్పుడు విచ్ఛిత్తి చేస్తే పూర్తిగా రూపుదిద్దుకున్న పిండస్థ శిశువు జన్మించే అవకాశముందని అభిప్రాయపడింది. ఈ మేరకు బాలిక తల్లి పిటిషన్‌ను ఏప్రిల్ 4వ తేదీన కొట్టేసింది.ఈ తీర్పుపై బాధితురాలి తల్లి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై గతవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. ముంబయిలోని సియాన్ ఆసుపత్రి మెడికల్ బోర్డును నివేదిక కోరింది. గర్భవిచ్ఛిత్తిపై తీసుకునే నిర్ణయం వల్ల బాలిక శారీరక, మానసిక పరిస్థితి ఎలా ఉండనుందో చెప్పాలని సూచించింది. దీనిపై మెడికల్ బోర్డు న్యాయస్థానానికి నివేదిక సమర్పించింది. "ఈ సమయంలో గర్భవిచ్ఛిత్తితో కొంత ప్రమాదం ఉన్నప్పటికీ.. కాన్పు తర్వాత ఎదురయ్యే ముప్పుతో పోలిస్తే ఇది ఎక్కువ కాదు. ఈ గర్భాన్ని కొనసాగించడం వల్ల బాలికపై శారీరకంగా, మానసికంగా ప్రతికూల ప్రభావం పడుతుంది" అని ఆ

నివేదికలో పేర్కొంది.దీన్ని పరిశీలించిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం బాలిక 30 వారాల గర్భవిచ్ఛిత్తికి అనుమతినిచ్చింది. ఈ కేసులో బాధితురాలికి సంపూర్ణ న్యాయం అందించేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద ఉన్న విస్తృత అధికారాలతో ఈ తీర్పు వెలువరిస్తున్నట్లు తెలిపింది. ఆ బాలికకు తక్షణమే వైద్య పరంగా గర్భవిచ్ఛిత్తి చేయాలని సియాన్ ఆసుపత్రి డీన్ ఆదేశించింది.సాధారణంగా మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం ప్రకారం.. వివాహిత మహిళలు, ప్రత్యేక అవసరాలున్నవారు, అత్యాచారా బాధితులు 24 వారాల వరకు తమ గర్భాన్ని వైద్యుల సూచనల మేరకు విచ్ఛిత్తి చేసుకునేందుకు అనుమతి ఉంది. ఆ సమయం దాటితే న్యాయస్థానం అనుమతి తప్పనిసరి.

అప్పటిదాకా ఎందుకు..?

హైస్కూల్ తర్వాతే లా ప్రాక్టీస్ చేయండి సుప్రీం ఆగ్రహం

దిల్లీ: ఇంటర్మీడియట్ లేదా 12వ తరగతి తర్వాత నేరుగా మూడేళ్ల లా కోర్సు (ఎల్ఎల్‌బీ) చదివేందుకు అవకాశం ఉండాలని అభ్యర్థిస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది.ఇందులో ఆలోచించడానికి ఏం లేదని, ప్రస్తుత కోర్సు విధానం సరిగ్గానే ఉందని తేల్చి చెప్పింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపేందుకు నిరాకరించింది.ప్రస్తుతం.. డిగ్రీ పూర్తి చేసినవారు మూడేళ్ల లా కోర్సులో, ఇంటర్ లేదా 12వ తరగతి ఉత్తీర్ణులైనవారు అయిదేళ్ల లా కోర్సులో చేరడానికి అర్హులు. అయితే, ఇంటర్ తర్వాత నేరుగా మూడేళ్ల కోర్సుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిం చేందుకు నిపుణుల కమిటీని నియమించేలా కేంద్రం, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆదేశించాలని కోరుతూ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ పిటిషన్ దాఖలు చేశారు. మేధావులైన విద్యార్థులు మూడేళ్లలోనే న్యాయవాద కోర్సును పూర్తి చేయగలరని, ప్రస్తుత విధానం వల్ల అయిదేళ్ల కోర్సుతో వారికి సమయం వృథా అవుతుందని పేర్కొన్నారు. దీనివల్ల పేదలు, ముఖ్యంగా అమ్మాయిలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు.ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి నేతృత్వం లోని ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది.

కవిత బెయిల్‌పై విచారణ వాయిదా

ఈడీ అరెస్ట్ లో తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ కవిత ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ విచారణలో భాగంగా కవిత తరపున న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి కోర్టులో తన వాదనలు వినిపించారు. విచారణకు సహకరిస్తున్న కవితను అరెస్ట్ చెయ్యాల్సిన అవసరం లేదని కోర్టులో కవిత తరపు న్యాయవాది వెల్లడించారు. 'అరుణ్ రామచంద్రన్ పిళ్ళై 10 స్టేట్మెంట్స్ ఇచ్చారు. అరుణ్ రామచంద్రన్ పిళ్ళై ను ఈడీ అరెస్ట్ చెయ్యలేదు. కవితకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవు. అనుమనితురాలిగా కూడా లేని కవితను నిందితురాలిగా మార్చారు. 5,6 గంటలు విచారణకు హాజరైన ఒక టెర్రరిస్టు, కరుడుగట్టిన నేరస్థులను ట్రీట్ చేసినట్లు చేశారు. మార్చి 15న చట్టవిరుద్ధంగా కవితను అరెస్ట్ చేశారు. కవిత-కేజ్రీవాల్ లను కలిపి విచారించడంలో ఈడీ విఫలం అయింది. విజయ్ నాయర్ సోషల్ మీడియా హ్యాండ్లర్, ఆయనతో సోషల్ మీడియా అంశం పైనే కవిత భేటి అయ్యింది. బుచ్చిబాబు నాలుగు స్టేట్మెంట్స్ ఇచ్చాడు. ఈడీ అనుకూలంగా స్టేట్మెంట్ ఇచ్చాక ఆయనకు బెయిల్ వచ్చింది. రాఘవ రెడ్డి బీజేపీ నుంచి పొత్తులో ఉన్న పార్టీ నుంచి పోటీలో ఉన్నాడు. బీజేపీకి ఎలాక్టోరల్ బాండ్లను శరత్ రెడ్డి కొనుగోలు చేసి అందించారు. వీళ్ళు ఇచ్చిన స్టేట్మెంట్స్ ఆధారంగా కవితను అరెస్ట్ చేశారు. కవిత ఆధారాలు ధ్వంసం చేశారు అంటున్నారు.. కానీ, ఆవిడ వాడిన ఫోన్లన్నీ ఈడీకి ఇచ్చారు' అని కవిత తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి కోర్టులో తన వాదనలు వినిపించారు. అయితే ఈడీ తరపున న్యాయవాది జోయబ్ హొస్సేన్ కోర్టులో కవితకు వ్యతిరేకంగా వాదనలు వినిపించారు. లిక్కర్ కేసులో భాగంగా ఈడీ కవితను ఫోన్లు అడిగిన తర్వాత ఆమె ఫోన్లను ఫార్మాట్ చేశారంటూ కోర్టు ముందు వెల్లడించారు. దీంతో ఇరు వర్గాల వాదనలు విన్న రౌస్ అవెన్యూ కోర్టు.. విచారణను రేపటికి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. మంగళవారం ఈ పిటిషన్ పై మరోసారి విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది. ఇదిలా ఉండగా.. సీబీఐ కేసులో కూడా కవితకు మరో షాక్ తగిలింది. లిక్కర్ కేసులో భాగంగా సీబీఐ అరెస్ట్ లో బెయిల్ కోరుతూ ఎమ్మెల్సీ కవిత కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ లో భాగంగా ఇరువురి న్యాయవాదుల వాదనలు విన్న జడ్జి కావేరి బవేజ తీర్పును మే 2వ తేదీకి వాయిదా వేశారు. అరెస్ట్ నుంచి విచారణ వరకు ఎటువంటి మెటీరియల్ లేదు. ఎలాంటి ఆధారాలు లేకుండానే అరెస్ట్ చేశారు. ఈడి కస్టడీలో ఉండగా, సీబీఐ ఎందుకు అరెస్ట్ చేసింది?.. అరెస్ట్ చెయ్యాల్సిన అవసరం లేనప్పటికీ అరెస్టు చేశారు. కవిత బీఆర్ఎస్ పార్టీకి స్టార్ క్యాంపైనర్. చిదంబరం కేసులో తీర్పు కవిత విషయంలో సరిపోతుంది. ఏడేళ్ల లోపల శిక్ష పడే కేసులకు అరెస్ట్ అవసరం లేదు. అరెస్టుకు సరైన కారణాలు లేవు' అంటూ వాదించారు.

'మక్కాన్' ఆధ్వర్యంలో కాంగ్రెస్ చేరిక..

రామగుండం, ఏప్రిల్ 22, (జనంసాక్షి):
రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాగూర్ మక్కాన్‌సింగ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన కో ఆప్షన్ సభ్యులు గౌస్‌బాబా, అంతర్గాం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హనుమాన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలురాజ్, పొట్యాల ఎంపిటిసి మస్కం శ్రీనివాస్, వారి సమక్షంలో అంతర్గాం మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ గౌస్‌పాషా, మాజీ వార్డ్ సభ్యులు దాసరి నంబయ్య (రమేష్)తో పాటు 100 మందితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.రామగుండం శాసనసభ్యులు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని మా పార్టీ అని ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలలో 4 పథకాలు అమలయాని ఎలక్షన్ కోడ్ తర్వాత మరిన్ని బతకలతో పాటు అనేక సంక్షేమ పథకాల అభివృద్ధి కొరకు కాంగ్రెస్ పార్టీ పాటు పడుతుందన్నారు, మే 13 తేదీన జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో వివేక్ వెంకటస్వామి తనయుడు గడ్డం వంశి కృష్ణని భారీ మెజార్టీతో ప్రతి కార్యకర్త, ప్రజలు గెలిపించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్స్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆకనపల్లిలో ఉపాధి కూలీలను కలిసిన మనాలి ఠాకూర్..

రామగుండం, ఏప్రిల్ 22, (జనంసాక్షి):
నిరంతరం రామగుండం నియోజకవర్గ అభివృద్ధి కోసం అనుక్షణం పరితపించే వ్యక్తి నాయకులు రాజ్‌ఠాకూర్..ఆయన గెలుపొందిన మొదలు అటు అసెంబ్లీలోనే రామగుండం నియోజకవర్గ అభివృద్ధి కోసం పలుమార్లు పవర్ ప్లాంట్ గురించి అడిగిందే అడిగి మమ్మల్ని పట్టువదలని విక్రమార్కుడిలాగా నిరంతరం కార్యసాధన కోసమే కృషి చేస్తున్న వ్యక్తి ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ అని అన్నారు.ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణను ఐటీ శాఖ మంత్రివర్యులు దుద్దులు శ్రీధర్ బాబు, శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ బలపరిచిందంటే ఆయన విజయం దాదాపు ఖరారు అయినట్లే , రేపు జరగబోయే ఎంపీ ఎలక్షన్లలో గడ్డం వంశీకృష్ణ భారీ మెజారిటీతో గెలవబోతున్నాడని, అలాగే పెద్దపెల్లి ఎంపీ స్థానం కాంగ్రెస్ పార్టీదే అయితే రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి మరింతగా ఉపయోగపడనున్నది, అంతేకాకుండా పారిశ్రామిక ప్రాంతాన్ని టీ హబ్‌గా, అలాగే మక్కాన్సింగ్ రాజ్‌ఠాగూర్ ఆధ్వర్యంలో మరింత అభివృద్ధి అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా మాట్లాడటం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ సోషల్ మీడియాఉగాది సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్టి తిరుపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు .

అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలు ఉపయోగిస్తే చర్యలు

పట్టణ సిఐ బొల్లం రమేష్

హుజూరాబాద్, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :
అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలు ఉపయోగించినా, విక్రయించినా వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హుజూరాబాద్ పట్టణ సీఐ బొల్లం రమేష్ హెచ్చరించారు. మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఓలపు రమేష్ ఇంట్లో జిలెటిన్ స్టిక్స్ డిటోనేటర్లు పేలుడు పదార్థాలు సమాచారంతో ఆదివారం రాత్రి పోలీసులు తనిఖీ చేయగా 200 జిలెటిన్ స్టిక్స్, పది డిటోనేటర్లు, డి కార్డు వైరు లభించినట్లు తెలిపారు. రమేష్ను విచారించగా హుజురాబాద్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి వద్ద పేలుడు పదార్థాలను పోర్భలంతో కొనుగోలు చేసి ప్రభుత్వానికి సంబంధించిన గుట్టలను పేల్చేందుకు ఉపయోగిస్తున్నామని, బండరాయిని క్రషర్ లకు అమ్మి డబ్బు సంపాదిస్తున్నానని ఒప్పుకున్నాడని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వం కు సంబంధించిన గుట్టలను పేల్చడం ద్వారా జంతువులకు, మనుషులకు ప్రాణహాని ఉందని తెలిసి కూడా పేలుడు పదార్థాలను ఉపయోగిస్తున్న రమేష్ పై , అతనికి పేలుడు పదార్థాలను అమ్మిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రమేష్ ను కోర్టుకు హాజరు పర్చినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలు విక్రయించినా. ఉపయోగించినా, నిల్వ చేసిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని సిఐ రమేష్ హెచ్చరించారు.

కూలీలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలి..

అమ్మ ఆదర్శ పాఠశాలో మరమ్మత్తుల పనులను ప్రారంభం : డిఆర్‌డివో రవీందర్ రాథోడ్

ముత్తారం (జనంసాక్షి) :
ముత్తారం మండలం మచ్చుపేట గ్రామ శివారులో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను సోమవారం రోజున డిఆర్డివో రవీందర్ రాథోడ్ పరిశీలించారు.ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ దినసారి కూలి పని ప్రదేశంలో ఇబ్బందుల గురించి వివరణ అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం సంభవిస్తున్న తరుణంలో కూలీలకు ఇబ్బందులు కలకుండా ముందస్తుగా కవర్ టెంట్లతోపాటు ఫస్ట్ ఎయిడ్ కిట్టు అందుబాటులో ఉంచాలని ఎండ తీవ్రతకు కూలీలు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎండ తీవ్రత పెరుగుతున్న కొద్దీ కూలీలు ఉదయం 6 గంటల నుండి 11:00 గంటల వరకు పనులు చేపట్టాలని కూలీలకు సూచించారు.అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శపాఠశాల నిధులతో మంజూరైనా పనులను ప్రారంభించి విద్యార్థు లకు కావలసిన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.

గ్రామంలో ఐకేపి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ను తనిఖీ చేసి రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని. రైతులకు ఎప్పటి కప్పుడు సమాచారాలను అందించాలని సంబంధిత అధికారులకు ఇబ్బందికి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎపిడిలు అమృత్ కుమార్, సత్యనారాయణ, డి పిఎం రవి,ఎంపీడివో లలిత, ఏపివో దయమని, ఏపిఎం దొమ్మటి పద్మ,ఈ సి హార్టికల్చర్ సూపర్వైజర్ మధుకర్, టెక్నికల్ అసిస్టెంట్ అంజయ్య,సిసి తిరుపతి,పంచాయతీ కార్యదర్శి సంధ్య, ఫీల్డ్ అసిస్టెంట్ రాజ్ కుమార్, తోపాటు తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిలో బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి ఎన్నికల రోడ్ షో

కొండమల్లేపల్లి ఏప్రిల్ 22 జనంసాక్షి :
కొండమల్లేపల్లి మండల కేంద్రంలో సోమవారం బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలోని పాల శీతలీకార కేంద్రం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు రోడ్ షో నిర్వహించారు బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి రోడ్ షోకు ప్రజలు, రైతులు, బిఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు కార్యకర్తలు భారీగా తరలివచ్చారు ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచల కృష్ణారెడ్డి ప్రజలనుదేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే దోచుకునేదని అమలుకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కల్లబొల్లి మాటలతో కాలం వెల్లదీస్తుందని విమర్శలు చేశారు సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో కేంద్రాల్లోని వడ్ల రాశులు అకాల వర్షాలకు తడిసి మట్టి పాలవుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో ప్రజలకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసింది అని అన్నారు ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతు బీమా, రైతు రుణమాఫీ అమలు చేయడం లేదని విమర్శించారు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ పదేళ్లు తెలంగాణలో ఎన్నో విప్లవాత్మక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థిగా నన్ను గెలిపిస్తే దేవరకొండ కొండమల్లేపల్లి మీదుగా నల్లగొండకు రైల్వే లైన్ కు సహకరిస్తానని

జాతీయ ఉపాధి హామీ పథకం రైతులకు అనుసంధానం చేసి స్వామినాథన్ రిపోర్టు ప్రకారం రైతులకు మేలు చేస్తానన్నారు కొండమల్లేపల్లి మండలాన్ని గతంలో మాజీ శాసనసభ్యులు రవీంద్ర కుమార్ ఆధ్వర్యంలో కరెంటు సమస్యలు, సబ్ స్టేషన్ సమస్యలు, సిసి రోడ్లు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీళ్లు సరఫరా చేశామన్నారు గత పది ఏళ్లు బిఆర్ఎస్ ప్రభుత్వంలో శాంతి భద్రతలు, ప్రజల స్వేచ్ఛ కోసం పని చేశామన్నారు నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు దౌర్జన్యాలకు రౌడీ ఇజానికి తెరలేపింది అన్నారు ఒక్క అవకాశం ఇచ్చి కారు గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి పార్లమెంట్ అభ్యర్థిగా గెలిపించాలని ప్రజలనుదేశించి మాట్లాడారు వారి వెంట మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ శాసనసభ్యులు, బిఆర్ఎస్ జిల్లా పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్, పార్లమెంట్ దేవరకొండ నియోజకవర్గ బాధ్యులు రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి,బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రమావత్ దస్రు నాయక్, కంకణాల వెంకట్ రెడ్డి, నాయిని సుధీర్ రెడ్డి, నేనావత్ కిషన్ నాయక్, టివిఎన్ రెడ్డి, కేసాని లింగారెడ్డి, రమావత్ తులసిరాం, మాజీ సర్పంచ్ గుండెబోయిన లింగం యాదవ్, పంగ లాలయ్య, రమావత్ దీప్లాల్, వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిస్తూ భూమిని కాపాడుకోవాలి

● ప్లాస్టిక్ నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత ● ప్లాస్టిక్ వాడకం తగ్గించి, పర్యావరణ హితమైన విధానాలను అవలంభించాలని సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్

హుజూరాబాద్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :
మనిషికి మట్టికి అవినాభావ సంబంధం ఉందని, ప్రాణకోటి మనుగడకు ఆధారమైన భూమిని కలుషితం చేసుకుంటే మన భవిష్యత్ అంధకారంలోకి నెట్టినట్లవుతుందన్నారు. ప్రజలంతా ఆలోచించాలని పర్యావరణాన్ని పరిరక్షిస్తూ భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని హుజూరాబాద్ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని నలుబాల వేణుగోపాల్ ' ప్లాస్టిక్ సంచులు వద్దు- బట్ట సంచులు ముద్దు' ప్లాస్టిక్ నివారణ లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని వీధుల్లో సైకిల్ పై తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ... ప్రస్తుత నిత్యా జీవితంలో భాగమైన ప్లాస్టిక్ ను నివారించాలని. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామన్నారు. తాత్కాలిక సౌలభ్యం కోసం వాడుతున్న ప్లాస్టిక్‌తో అప్పటి మట్టుకు అవసరాలు తీరిన దీర్ఘకాలికంగా అనేక ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదముందన్నారు. మనుషులతో పాటు సమస్త ప్రాణ కోటి జీవించేందుకు అర్హత ఉందని, కానీ నేడు విస్తరిస్తున్న నాగరీకరణ కారణంగా పచ్చని అడవులు నశించిపోతున్నాయని, అరుదైన జీవజాతులు కనుమరుగై పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పక్షులు అంతరించిపోతుండటంతో జీవ సమతుల్యత దెబ్బతింటోందని, అందరికీ చెందాల్సిన ధరిత్రి కేవలం మనిషి స్వార్థంతోనే వినాశనానికి దారితీస్తుందని ఆయన అన్నారు. ఇష్టారీతిన ప్లాస్టిక్ వాడకం, నేల పైనే చెత్త చెదారాలు, నదులను కలుషితం చేయడం, అడవులు నరికి వేయడం వంటి సమస్యలతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, నీటి నిల్వలు తగ్గుతున్నాయన్నారు. మనకు ఉన్నది ఈ భూమి ఒక్కటేనని, ఇదే మన ఇల్లుగా, ఆస్తిగా భవిష్యత్ తరాల కోసం సంరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇందు కోసం ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, వనరులను సంరక్షించాలని, పర్యావరణ హితమైన విధానాలను అవలంభించాలని కోరారు. ఐక్యరాజ్య సమితి ప్లాస్టిక్ మీద ప్లానెట్ యుద్ధంగా పిలుపునివ్వడం గొప్ప విషయమన్నారు. ప్లాస్టిక్ నివారణ పై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుంటూ ప్రజల్లో చైతన్యం కల్పించాలని కోరారు.

వంశీ కృష్ణ ను భారీ మెజారిటీతో గెలిపించాలి

● దుద్దిల్ల శ్రీను బాబు

మంథని, (జనంసాక్షి) :
పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ ఖాయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, యువ నేత దుద్దిళ్ళ శ్రీను బాబు అన్నారు. పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గ పరిధిలోని రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ తో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ముందుగా కల్వచర్ల ఆంజనేయస్వామి దేవాలయంములో దుద్దిల్ల శ్రీను బాబు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డ వంశీకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీను బాబు మాట్లాడుతూ.. వంశీ కృష్ణ ఎంపీగా విజయం సాధిస్తే నియోజకవర్గానికి ఎంతగానో మేలు చేస్తారని శ్రీను బాబు అన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగుతున్న వంశీ కృష్ణ ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. కాంగ్రెస్ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి శ్రమించాలన్నారు. అనంతరం మంథని పట్టణములో పెంజేరు కట్ట హనుమాన్ దేవాలయంలో దుద్దిల్ల శ్రీను బాబు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రామగిరి, మంథని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్‌జీ-1 ఏరియా జీఎం ఆఫీస్‌లో పర్యావరణ దినోత్సవ వేడుకలు..

గోదావరిఖని, ఏప్రిల్ 22, (జనంసాక్షి) :
కార్పొరేట్ ఆదేశాల మేరకు ఆర్‌జీ-1 ఏరియా జీఎం కార్యాలయంలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలలో భాగంగా 'లైఫ్ స్టయిల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా ఆర్‌జీ-1 ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ హాజరయ్యారు.ముందుగా అందరిచేత పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా జియం మాట్లాడుతూ కార్పొరేట్ వారి ఆదేశాల మేరకు జూన్ 5 వరకు ప్రతి రోజు పర్యావరణ దినోత్సవ వేడుకలను నిర్వహించటం జరుగుతుందని అన్నారు.పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. దానికి ప్రతి ఒక్కరు తప్పని సరిగా పర్యావరణ పరిరక్షణకు పాటుపాడాలని తెలిపారు.అదే విధంగా మనం పీల్చే గాలి త్రాగే నీరు మరియు పంచ భూతాలను మనం ఏ విధంగా కలుషితం చేస్తున్నామో ఒక్క సారి ఆలోచించుకొని వాటిని మనం కలుషితం కాకుండా నివారించి పర్యావరణాన్ని మరియు ప్రకృతిని మనం కాపాడుకోవాలని సూచించారు. సింగరేణి సంస్థ ద్వారా మొక్కలను నాటటమే కాకుండా వాటిని పునర్జీవం కూడా కల్పిచటం జరుగుతుందని జియం అన్నారు. సింగరేణి పరీవాహక ప్రాంతాలలో అత్యధిక శాతం మొక్కలను నాటటం జరుగుతుందని జియం అన్నారు. ఈ సందర్భంగా జిఎం ఆఫీస్ సిబ్బందికి మరియు సివిల్ వర్కర్స్ కు బట్ట సంచులను పంపిణి చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో పర్సనల్ ఏజీఎం సి.హెచ్ లక్ష్మి నారాయణ, ఎన్విరాన్మెంట్ అధికారి ఆంజనేయ ప్రసాద్, ఏరియా సేఫ్టి అధికారి బైద్య, ఏజీఎం ఐఈడి ఆంజనేయులు, పర్సనల్ మేనేజర్ కిరణ్ బాబు, డిజీఎం ఫైనాన్స్ ధన లక్ష్మి బాయి,డిజీఎం (ఆడిట్) రాజం, ఎస్టేట్ మేనేజర్ బాల సుబ్రమణ్యం, పర్చేస్ అధికారి శ్రీనివాస్, ఫారెస్ట్ అధికారి అభిలాష్, ఐ.టి. మేనేజర్ రాజేష్, సీనియర్ పిఒ హనుమంత రావు, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి ఇతర అధికారులు, జీఎం ఆఫీస్ స్టాఫ్ పాల్గొన్నారు.

మావోయిస్టు పోస్టర్లు విడుదల..

సమాచారం ఇచ్చినవారికి నగదు బహుమతి..

గోదావరిఖని, ఏప్రిల్ 22, (జనంసాక్షి) :
పోలీస్ అధికారులతో కలిసి వాల్‌పోస్టర్ అవిష్కరించిన రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్.సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో రామగుండం పోలీస్ కమిషనర్ సిఎం శ్రీనివాస్, మంచిర్యాల డిసిపి అశోక్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఇతర అధికారులతో కలిసి ప్రజలు మావోయిస్టులకు సహకరించొద్దంటూ మావోయిస్టుల వివరాలతో పోస్టర్లు కరపత్రాలను విడుదల చేశారు.పోస్టర్లో ఉన్నవారి గురించి తెలిస్తే..పోలీసుల (తెలంగాణ పోలీసుల)కు సమాచారం ఇవ్వాలని సూచించారు.లేకపోతే ఫోన్ నెంబర్లు :సి.పి. రామగుండం- 08728 271333, డి.సి.పి. పెద్దపల్లి- 8712656502, డి.సి.పి. మంచిర్యాల-8712656503, ఎన్ఐబీ 8712656596 నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మావోయిస్టుల గురించి సమాచారం తెలిపిన వారికి.. పోస్టర్లలో ఉన్న విధంగా నగదు బహుమతి అందిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని భరోసా ఇచ్చారు.అదేవిదంగా అజ్ఞాతంలో ఉన్నటువంటి మావోయిస్టు సోదరులు పోరాటం చేయాల్సింది అడవిలో కాదు..అందరి మధ్య ప్రజా జీవనంలోకి వచ్చి.. ప్రజా సమస్యలపై చట్ట బద్దంగా పోరాడాలని..ప్రజలచే ఎన్నుకోబడి చట్టసభల్లోకి ఎన్నికై పోలీసుల గౌరవ వందనం పొందాలని సీపీ పేర్కొన్నారు.

ప్రధాన మంత్రి కౌశల్య కేంద్ర స్కీం (పీఎంకేకే)..

- ఫేక్ ఫింగర్ ప్రింట్స్ ద్వారా అవకతవకలకు పాల్పడిన.. - 'అల్టిమేట్ ఎనర్జీ రిసోర్స్' ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వాహకులు అరెస్ట్..

గోదావరిఖని, ఏప్రిల్ 22, (జనంసాక్షి):
రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ రామగుండం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలు సోమవారం వెల్లడించారు. నిందితుల వివరాలు మల్లికార్జున్ (హైదరాబాద్), సలీంజాఫర్ (నర్సంపేట), వెంకటేష్ (నర్సంపేట), దేవేందర్ (మంచిర్యాల)కు సంబంధించిన వారు ఉన్నారు. రికవరీ చేయబడిన వస్తువులు ఫేక్ ఫింగర్ ప్రింట్స్, ఫేక్ ఫింగర్ ప్రింట్ తయారీకి సంబందించిన మెటీరియల్, అభ్యర్థుల అటెండన్స్ రిజిస్టర్ , డాక్యుమెంట్, ల్యాప్ టాప్, బయోమెట్రిక్ మిషన్ తదితర వాటిని స్వాధీపరుచుకున్నారు.వివరాల్లోకి వెళితే..కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి కౌశల్య కేంద్ర్ (పీఎంకేకే) అనే పథకం ద్వారా దేశంలోని నిరుద్యోగ యువత ఉపాధి కొరకు స్కిల్ డెవలప్మెంట్ కోసం ఉచితంగా పలు కోర్స్‌లను అందిస్తుంది.ఈ స్కీంను ప్రభుత్వం భోపాల్ కేంద్రంగా నిర్వహించబడుతున్న అల్టిమేట్ ఎనర్జీ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ద్వారా దేశంలోని నిరుద్యోగ యువకులలో స్కిల్స్ డెవలప్మెంట్‌ను పెంపోందించడం కొరకు ఈ సంస్థకు భాద్యతలు అప్పగించింది. సంస్థకు సంబంధించి తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నందు ఆఫీస్ ఏర్పాటు చేయడం జరిగింది. భోపాల్‌లో హెడ్ ఆఫీస్ ఆర్గనైజర్‌గా సాహిల్ వలి, తెలంగాణ హెడ్ ఆఫీస్ అయిన హైదరాబాద్‌లోని మధురానగర్ నందు వున్న ఆఫీస్ ఇంచార్జ్‌గా ఆవునురి శ్రీనివాస్ భాద్యతలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ ఆఫీస్ పరిధిలో మన రాష్ట్రంలో మంచిర్యాలతోపాటు హుజుర్‌నగర్, జనగామలో ఈ సంస్థ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లు వున్నాయి. మంచిర్యాల సెంటర్ ఆర్గనైజర్‌గా నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన మల్లికార్జున్ అనే వ్యక్తి పనిచేస్తున్నాడు.గత 2020 నుంచి ఏడాదికి 320 మందికి చొప్పున ప్రతి సెంటర్‌లో నిరుద్యోగ యువకులకు స్కిల్ డెవలప్మెంట్ కోర్స్‌లలో ట్రైనింగ్ ఇవ్వడం జరుగుచున్నది.యువకులకు ఇట్టి కోర్సులలో ట్రైనింగ్ కల్పించినందుకు గాను కేంద్ర ప్రభుత్వం గతంలో ఒక్కొక యువకునికి పదమూడు వేలు చొప్పున నిధులు మంజూరు చేయడం జరిగినది.కానీ ఈ సంవత్సరం నుండి 720 మందికి పెంచినది, ఒక్కొక్క యువకుని ట్రైనింగ్ కొరకు మూడువేల రూపాయలు చొప్పున కేటాయించడం జరిగినది.కోర్స్‌లకు హాజరు అయ్యే అభ్యర్థుల అటెండెన్స్ ఆధారంగా మాత్రమే నిధులు కేటాయించబడుతాయి.మంచిర్యాలలోని సెంటర్‌లో ఈ సంవత్సరం 300 అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకోవడం జరిగింది.అందులో కూడా ప్రతి రోజు సగటున 50 మంది యువకులే హాజరు అవుతున్నారు. అందువలన సంస్థకు హాజరు శాతం ప్రకారం తక్కువ నిధులు కేటాయించబడుతున్నాయి. దానివలన సంస్థ కు రాబడి తక్కువ కావడం వలన హెడ్ ఆఫీస్ నిర్వాహకుడు సాహిల్ వలి హైదరాబాద్ ఆఫీస్ ఇంచార్జ్ ఆవునురి శ్రీనివాస్ సూచన మేరకు మంచిర్యాల సెంటర్ ఇంచార్జ్ మల్లికార్జున్ తనకు పరిచయస్థుడైనా నర్సంపేటకు చెందిన విజయ్ అనే వ్యక్తి సూచన మేరకు నర్సంపేటకు చెందిన సలీం జాఫర్, వెంకటేశ్వర్లు సహాయంతో 250 మంది అభ్యర్థుల ఫేక్ ఫింగర్ ప్రింట్‌లను తయారు చేసి గైర్హాజరు అయిన అభ్యర్థుల అటెండెన్స్‌ను కూడా అట్టి ఫేక్ ఫింగర్ ప్రింట్స్ ద్వారా బయోమెట్రిక్ మిషన్‌లో నమోదు చేసి అందరు అభ్యర్థులు హాజరు అయినట్లు రిపోర్ట్‌ను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించి నిధులను కాజేయుచున్నారు.ఈ స్కామ్ గురించి రామగుండం కమీషనర్ ఆఫ్ పోలీస్‌కి సమాచారం రావడంతో వెంటనే టాస్క్‌ఫోర్స్ వారిని రంగంలోకి దింపి మంచిర్యాలలో నిర్వహింపబడుతున్న సెంటర్‌లో సెర్చ్ చేసి అక్కడ ఆఫీస్ ఇంచార్జ్‌గా వున్న దేవేందర్ ను విచారించగా ఈ స్కామ్ గురించి తెలియడంతో సీపీ మంచిర్యాల పోలీస్‌లను ఇట్టి స్కామ్ గురించి విచారణ చేయవలసిందిగా డీసీపీని ఆదేశించడంతో మంచిర్యాల పోలీస్‌లు దేవేందర్‌ను పట్టుకొని అతని ఆఫీస్‌లో వున్న ఫేక్ ఫింగర్ ప్రింట్స్‌ను, ఆఫీస్ రికార్డ్స్‌ను జప్తు చేసి, ఈ స్కామ్‌నకు సంబంధించి కేసు నమోదు చేసి సీపీ, డీసీపీ ఆదేశానుసరం విచారణ చేపట్టిన మంచిర్యాల పోలీస్ లు హైదరాబాద్‌కు చెందిన మల్లికార్జున్‌ను, నర్సంపేటకు చెందిన సలీం జాఫర్‌ను, వెంకటేష్‌ను అదుపులోకి తీసుకొని వారివద్దనుండి ఫేక్ ఫింగర్ ప్రింట్ తయారు చేయుటకు ఉపయోగించే సామాగ్రిని రికవరీ చేయడం జరిగింది.ఈ స్కామ్‌లో ముఖ్య సూత్రదారులైన భోపాల్‌కు చెందిన సాహిల్, హైదరాబాద్‌కు చెందిన అవునూరి శ్రీనివాస్ తదుపరి విచారణ అనంతరం అరెస్ట్ చేయవలసి వున్నది.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ విజయం సాధించింది. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో భారీ స్కోరు నమోదైంది. ఇరు జట్ల నుంచి పరుగులు వెల్లువెత్తాయి. ఓటమిని అంగీకరించడానికి ఎవరూ సిద్ధంగా లేరు. మ్యాచ్ ఫలితం కూడా చూపిస్తుంది. ఇక్కడ విజయానికి, ఓటమి మధ్య వ్యత్యాసం కేవలం 1 పరుగు మాత్రమే. ఈ విజయంలో కేకేఆర్ హీరో ఆండ్రీ రస్సెల్ 1 పరుగు స్వల్ప తేడాతో విజయాన్ని తన జట్టుకు అందించాడు. కానీ, ఆఖరి 2 బంతుల్లో ఆర్‌సీబీని ఏడిపించేంత పని చేసి, దాదాపు రూ.25 కోట్లకు కేకేఆర్ ను నిజమైన మ్యాచ్ విన్నర్‌గా మార్చేశాడు. మేం మిచెల్ స్టార్క్ గురించి మాట్లాడుతున్నాం. ఐపిఎల్ 2024లో అతని ప్రదర్శనను దేశ మీడియా విశ్లేషించింది. అది అతనికి డి-గ్రేడ్ ఇచ్చింది. కానీ, ఈ డి-గ్రేడ్ క్రికెటర్ నిజంగా ఆర్సీబీ గెలుపును అడ్డుకున్నాడు. ఐపిఎల్ 2024లో నిరంతరం విమర్శలకు గురవుతున్న అతని బౌలింగ్ ఆధారంగా మిచెల్ స్టార్క్ ఇలా చేశాడు. ఎందుకంటే స్టార్క్‌ను అత్యంత ఖరీదైన రూ. 24.75 కోట్లకు కేకేఆర్ కొనుగోలు చేసింది. అయితే అతని పనితీరు కూడా అంతగా పేలవంగా ఉంది. మిచెల్ స్టార్క్ ఇప్పటివరకు ఆడిన 7 మ్యాచ్‌ల్లో 48 కంటే ఎక్కువ సగటుతో 6 వికెట్లు మాత్రమే తీయగలిగాడు. ఆర్సీబీతో జరిగిన ఐపిఎల్ 2024 36వ మ్యాచ్‌లో కూడా, మిచెల్ స్టార్క్ మొత్తం బౌలింగ్ పనికిరాకుండా పోయింది. కేవలం 3 ఓవర్లలో 55 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. అతని ఎకానమీ రేట్ కూడా అతని జట్టులోని ఇతర బౌలర్ల కంటే అధ్వాన్నంగా ఉంది. కానీ, చివరి ఓవర్ బౌలింగ్ చేస్తున్నప్పుడు చివరి రెండు బంతుల్లో తన అనుభవంతో మ్యాచ్‌ను కేకేఆర్ బ్యాగ్‌లో ఉంచాడు. మ్యాచ్ చివరి 2 బంతుల్లో ఆర్సీబీ విజయానికి 3 పరుగులు అవసరం. అంతకుముందు ఒక బంతికి స్టార్క్‌ను సిక్సర్ కొట్టిన కర్ణ్ శర్మ స్ట్రైక్‌లో ఉన్నాడు. ఈ మ్యాచ్ మొత్తంలో స్టార్క్ బౌలింగ్ వేసిన తీరును చూస్తుంటే 2 బంతుల్లో 3 పరుగులు రావాల్సిందే అనిపించింది. కానీ స్టార్క్ తన అనుభవాన్ని ఉపయోగించుకుని కర్ణ్ శర్మకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. పరుగులు చేయడానికి బదులుగా కర్ణ్ శర్మ స్టార్క్‌కి బలి అయ్యాడు. కానీ, ఆర్సీబీ ఆటగాడు ఈ ఆలోచన కూడా స్టార్క్ ముందు పని చేయలేదు. ఫెర్గూసన్ చివరి బంతికి మొదటి పరుగును తీశారు. కానీ, అతను రెండవ పరుగు కోసం పరిగెత్తిన వెంటనే, అతను రనౌట్ అయ్యాడు. దీంతో కేకేఆర్ 1 పరుగు తేడాతో విజయం సాధించింది.

2 బంతుల్లోనే రూ.25 కోట్ల మజా ఇచ్చాడు

ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్‌తో టాలీవుడ్
సూపర్ స్టార్ మహేష్ బాబు

ఇద్దరు స్టార్స్ ఒక దగ్గరికి చేరితే పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వారిద్దరిని చూడడానికి వారి ఫ్యాన్స్ ఎంతో ఆనందిస్తారు. ఇకపోతే తాజాగా తెలుగు చిత్ర పరిశ్రమలో సూపర్ స్టార్ గా పేరుగాంచిన మహేష్ బాబు అంటే టాలీవుడ్ లో ఎనలేని క్రేజ్. అలాగే ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ లో ప్రత్యర్థులను ఊచకోత కోస్తున్న సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు కెప్టెన్ పాట్ కమ్మిన్స్ కు కూడా చాలా మందే ఫ్యాన్స్ ఉన్నారు. ఇక అసలు విషయంలోకి వెళ్తే.. తాజాగా సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు కెప్టెన్ పాట్ కమ్మిన్స్, సూపర్ స్టార్ మహేష్ బాబు ఇద్దరు కలిశారు. కాకపోతే ఇది బయట ఎక్కడో పబ్లిక్ ప్లేస్ లో కాదు. ఓ యాడ్ షూటింగ్ సంబంధించి విరిద్దరూ కలిశారు. ఈ నేపథ్యంలో వారు ఇద్దరు కలిసి కొన్ని ఫోటోలకు ఫోజులు ఇచ్చారు. ఆ తర్వాత ఇద్దరూ ముచ్చటించారు. ఈ విషయాన్ని తాజాగా ఎస్ఆర్?హెచ్ కెప్టెన్ తన ఇంస్టాగ్రామ్ ఖాతా ద్వారా తెలిపాడు. ఇందులో భాగంగా టాలీవుడ్ ప్రిన్స్ తో ఈ మధ్యాహ్నం తాము సరదాగా గడపామని పేర్కొన్నాడు.దీంతో హైదరాబాద్ టీం క్రికెట్ ఫ్యాన్స్, అలాగే మహేష్ బాబు ఫ్యాన్స్ తెగ సంబరాలు చేసుకుంటున్నారు. ఇదివరకే మహేష్ బాబు అనేకసార్లు తనకి క్రికెట్ ఆడడం అంటే చాలా ఇష్టమని చెప్పిన సంగతి మనకు తెలిసిందే. చాలాసార్లు కూడా ఐపీఎల్ లో సన్ రైజర్స్ కు సపోర్ట్ చేయడానికి కూడా వచ్చారు. ఇక పాట్ కమ్మిన్స్ షేర్ చేసిన ఫోటోను మహేష్ బాబు రీ ట్వీట్ చేస్తూ.. ఇది నాకు గౌరవంతో కుడైన అభిమానం అంటూ తెలుపుతూ.. తాను కూడా అతనికి అభిమానిని అంటూ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

మరోసారి సీరియసైన గౌతమ్ గంభీర్..

ప్రస్తుతం జరుగుతున్న ఐపిఎల్ 2024 సీజన్ లో భాగంగా ఐపీఎల్ మ్యాచ్లు రసవత్తరంగా సాగుతున్నాయి. ఆదివారం నాడు రాత్రి జరిగిన మ్యాచ్లో కలకత్తా నైట్ రైడర్స్, రాయల్ ఛాలెంజ్ బెంగుళూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగిన సంగతి తెలిసిందే. మ్యాచ్ ఆద్యాంతం చివరి వరకు ఉత్కంఠ భరితంగా సాగింది. ఈ మ్యాచ్ లో కలకత్తా నైట్ రైడర్స్ మెంటర్ గౌతమ్ గంభీర్ మ్యాచ్ ఫోర్త్ ఎంపైర్ తో వాదనకి దిగాడు. నువ్వా.. నేనా.. అన్నట్లుగా జరిగిన మ్యాచులో చివరకు కలకత్తా నైట్ రైడర్స్ కేవలం ఒక్క పరుగుతో విజయం సాధించింది. ఇక మ్యాచ్ జరుగుతున్న సమయంలో 19 ఓవర్ లో ఓ ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు బ్యాటింగ్ చేస్తున్న సమయంలో 19 ఓవర్ లో ఆసక్తికర సంఘటన జరగడంతో ప్రస్తుతం అందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. 12 బంతులతో 31 పరుగులు అవసరమైన సమయంలో కలకత్తా నైట్ రైడర్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ డగౌట్ వైపు చూస్తున్నట్లుగా కెమెరాలకు కనిపించింది.

మతపిచ్చి వీడితేనే మానవ జాతికి మనుగడ

- కులాంతర, మతాంతర వివాహాలను బలపరచాలి
- ఎంఎన్ఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బైరి నరేష్

హైదరాబాద్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : మతపిచ్చి వీడితే తప్ప మానవ జాతికి మనుగడ సాధ్యం కాదని మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం (ఎంఎన్ఎస్) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బైరి నరేష్ స్పష్టం చేశారు. కులమతాల ఎల్లలు దాటి పెళ్లిచేసుకుంటే 'లవ్ జిహాద్' అంటూ దాడులకు తెగబడటం హేయమైన చర్య అని చెప్పారు. ఈ నెల 26న డాక్టర్ బైరి నరేష్ ఆధ్వర్యంలో ఇమ్రాన్, అనుషల వివాహం వరంగల్‌లోని సుభం గార్డెన్‌లో నిర్వహించనున్న తరుణంలో బైరి నరేష్ మాట్లాడారు. అమ్మాయి అంగీకరించడంతో పాటు ఆమె 18 ఏళ్ల వయస్సు నిండితే కులమతాలకు అతీతంగా ఎవరిన్నైనా పెళ్లి చేసుకోవచ్చని సుప్రీం కోర్టే తీర్పునిచ్చిందని ఆయన గుర్తుచేశారు. పెళ్లి చేసుకోబోయే ఇద్దరూ మేజర్ అయితే కలిసి బతువచ్చన్నారు. దీనికి లవ్ జిహాద్ అనే పేరును మూటగట్టవద్దని కోరారు. మతాంతర వివాహాలను హేతువాదులు, శాస్త్రీయ దృక్పథం గలవారు బలపరచాలని ఈ సందర్భంగా నరేష్ విజ్ఞప్తి చేశారు.

కోహ్లీకి భారీగా ఫైన్

ప్రస్తుతం జరుగుతున్న ఐపిఎల్ 2024 సీజన్ లో భాగంగా ఆదివారం రాత్రి కలకత్తా నైట్ రైడర్స్‌తో రాయల్ ఛాలెంజెర్స్ బెంగళూరు తలపడిన విషయం తెలిసిందే. అయితే ఈ మ్యాచ్ లో రాయల్ ఛాలెంజెర్స్ బెంగళూరు స్టార్ ఆటగాడైన విరాట్ కోహ్లీకి భారీగా ఫైన్ పడింది. అంపైర్లతో గొడవ నేపథ్యంలో భాగంగా విరాట్ కోహ్లీకి ఈ ఫైన్ వేధించబడింది. అంపైర్స్ తో గొడవ ఐపీఎల్ లో నిబంధనలో భాగంగా విరాట్ కోహ్లీకి మ్యాచ్ ఫీజులో ఏకంగా 50% ఫైన్ విధించింది బిసిసిఐ. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్ లో విరాట్ కోహ్లీ ఐపిఎల్ నియమావళిని ఉల్లంఘించినట్లు మ్యాచ్ రిఫరీ బిసిసిఐకు నివేదనను అందించాడు. దాంతో ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకున్నబీసీసీఐ.. కోహ్లీ చేసిన తప్పిదంకు గాను ఏకంగా మ్యాచ్ ఫీజులో 50% కోత విధించింది. ఇకపోతే ఈ విషయాన్ని కోహ్లీ కూడా ఒప్పుకోవడంతో మొదటి స్థాయి పొరపాటు కింద కోహ్లీకి మ్యాచ్ ఫీజులో సగం మ్యాచ్ ఫీజ్ ను జరిమానగా విధించారు. ఇకపోతే ఈ మ్యాచ్లో విరాట్ కోహ్లీ కాస్త వివాదాస్పద రీతిలో అవుట్ అవ్వడం ఇందుకు కారణం. భారీ లక్ష చేదనలో భాగంగా విరాట్ కోహ్లీ ఆడుతుండగా 18 పరుగులతో ఉన్న సమయంలో హర్షిత్ రానా బౌలింగ్ లో అతనికి రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుతిరిగాడు. అయితే ఆ బాల్ హై ఫుల్ టాస్ బంతిని నోబెల్ ఇవ్వకపోవడంతో విరాట్ కోహ్లీ నేరుగా గ్రౌండ్ అంపైర్ తో గొడవకు దిగడంతో ఈ తతంగం నడిచింది. విరాట్ కోహ్లీ బాల్ ను నోబాల్ గా ప్రకటించాలని చెప్పిన దానికి వారు అంగీకరించలేదు. దాంతో అంపైర్ పై విరాట్ అసహనం వ్యక్తం చేయడంతో చివరకు మ్యాచ్ ఫీజు కోత పడింది. ఇక ఈ మ్యాచ్ లో కలకత్తా నైట్ రైడర్స్ కేవలం ఒక్క పరుగుతో ఆర్సిబి జట్టు పై విజయం సాధించింది.

చెరో రూ. 12 లక్షలు కట్టండి

ఆర్సీబీ, పంజాబ్ కెప్టెన్లకు బీసీసీఐ షాక్

ఐపీఎల్ 17వ ఎడిషన్‌లో ఆర్సీబీ ప్రయాణం లీగ్ దశలోనే ముగిసింది. ఆదివాకం కెకెఆర్‌తో తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ఆర్సీబీ కేవలం ఒక్క పరుగు తేడాతో ఓటమి పాలైంది. దీంతో కప్ గెలవాలన్న ఆర్సీబీ కల మళ్లీ కలగానే మిగిలిపోయింది. లీగ్ దశలోనే నిష్క్రమించి షాక్ లో ఉన్న ఆర్సీబీకి ఇప్పుడు మరో భారీ షాక్ తగిలింది. కెకెఆర్‌తో జరిగిన మ్యాచ్‌లో ఐపిఎల్ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఆర్సీబీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్‌కు బీసీసీఐ జరిమానా విధించింది. అతనితో పాటు నిన్న జరిగిన మరో మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో పంజాబ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన సామ్ కరణ్ కూడా ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు జరిమానా చెల్లించాల్సి వచ్చింది. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ సమయానికి ఓవర్‌లను పూర్తి చేయలేకపోయింది. అందుకే చివరి ఓవర్‌లో 30 యార్డ్ సర్కిల్ వెలుపల కేవలం 4 ఫీల్డర్‌లకు మాత్రమే అనుమతించాల్సి వచ్చింది. మ్యాచ్ తర్వాత స్లో ఓవర్ రేట్ కారణంగా ఫాఫ్ డు ప్లెసిస్‌కి బీసీసీఐ రూ.12 లక్షల జరిమానా విధించింది.

ఇక పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో శిఖర్ ధావన్ గైర్హాజరీలో జట్టుకు సారథ్యం వహించిన సామ్ కరణ్ అంపైర్ నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేసినందుకు అతని మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత విధించారు. ఈ ఎడిషన్‌లో స్లో ఓవర్ నిబంధనలను ఉల్లంఘించినందుకు శిక్ష పడిన ఐపీఎల్ జట్ల కెప్టెన్ల సంఖ్య 8కి చేరుకుంది. ఫాఫ్ డుప్లెసిస్ కంటే ముందు 7 మంది భారతీయ కెప్టెన్లు ఈ పెనాల్టీని ఎదుర్కొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఎంపీ నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే కాంతల ఉపేందర్ రెడ్డి

ఖమ్మం రూరల్,ఏప్రిల్ 22 (జనం సాక్షి) : బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీలు నామ నాగేశ్వరరావు వద్దిరాజు రవిచంద్ర లు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పోలేపల్లి గ్రామ పంచాయతీలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమా వేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీలు నామ నాగేశ్వరరావు వద్దిరాజు రవి చంద్ర మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఉపేందర్ రెడ్డి పాలేరు నియోజక వర్గానికి, ప్రజలకు చేసిన సేవలు వెలకట్టలేని అని అన్నారు.అన్ని వర్గాల వారిని ఆదరించి ఆదుకోని, అందరి అభిమానాన్ని చూరగొన్నారని తెలిపారు.

పాలేరు నియోజకవర్గంలో ఓడిపోవడం నియోజకవర్గ ప్రజలు చేసుకున్న స్వయంకృతం, వారి దురదృష్టం అని, మళ్లీ ఇటువంటి పొరపాటు చేయొద్దని, లోకసభఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావుకు ఏకపక్షంగా ఓట్లేసి భారీ విజయాన్ని అందించాలన్నారు. జరిగిన తప్పును సరిదిద్దుకోవ డానికి ఇది మంచి అవకాశం, దయచేసి జారవిడ్చుకోవద్దని, మార్పు వస్తుందని ప్రజలు భావించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెచ్చుకుంటే.. ఇప్పుడు కరెంట్ కష్టాలు వచ్చి విసనకర్రలకు తిరిగి పని చెబుతున్నారని పేర్కొన్నారు. మళ్లీ 10ఏండ్ల కిందటి రోజులు వచ్చాయని ప్రజలిప్పుడు నాలుక కర్చుకుంటున్నారు. చెట్టు కొమ్మను మాత్రమే కాదు,చక్కని నీడనిచ్చే చెట్టునే నర్కున్నామని మధనపడుతు ప్రతి ఒక్కరూ బాధపడు తున్నారు. బీజేపీతో బీఆర్ఎస్ కు వైరం తప్ప ఎటువంటి స్నేహం లేదని, ఆ పార్టీకి బీ టీమ్ కాదు, కాబోదని అన్నారు. పార్లమెంటులో ఒకవేళ తాము బీజేపీకి సహకరించి ఉంటే కవిత జైలుకు పోవాల్సిన పరిస్థితి ఎందుకు వస్తదని తెలిపారు. కవితపై కేంద్రంలోని బీజేపీ పాలకులు తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపారని, ప్రతి ఒక్కరు గమనించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండలం ఎంపీపీ బెల్లం ఉమా, జడ్పిటిసి ఎండపల్లి వరప్రసాద్,తాళ్లూరు జీవన్ కుమార్, కార్పొరేటర్ నిరంజన్,ఎదులాపురం సొసైటీ చైర్మన్ జరుపుల లక్ష్మణ్ నాయక్, వైస్ ఎంపీపీ గుడిబోయిన దర్గయ్య, పేరం వెంకటేశ్వర్లు ముత్యం కృష్ణ రావు, గూడా సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో పట్లోళ్ల ఇంద్రారెడ్డి 24వ వర్ధంతి

రాజేంద్రనగర్, ఏప్రిల్ 22 (జనం సాక్షి) : మాజీ హెూం మంత్రి పట్లోళ్ల ఇంద్ర రెడ్డి 24 వర్ధంతి సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు సామ ఇంద్రపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సోమవారం రాజేంద్రనగర్ డైరీ ఫార్మ్ చౌరస్తా వద్ద ఇంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన ఇంద్రారెడ్డి ట్రస్ట్ చైర్మన్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి, సామా ఇంద్రపాల్ రెడ్డి, కార్పొరేటర్ అర్చన జయప్రకాష్, నాయకులు డేవిడ్, పచ్చ శ్రీనివాస్, పంబల రాజు, నయుముద్దీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు న్యాయం

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్

మొయినాబాద్, ఏప్రిల్ 22(జనం సాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, టిపిసిసి కార్యవర్గ సభ్యులు, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కొత్త జూపాల్రెడ్డిలు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని అమ్లాపూర్ గ్రామంలో సోమవారం ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. అమ్లాపూర్ మాజీ సర్పంచ్ రవళి గోపికృష్ణరెడ్డితో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టి పదేళ్లు గడుస్తున్నా బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు పూర్తి చేసిన నిరుపేదల బతుకుల్లో మార్పు రాలేదన్నారు. జన్ధాన్ ఖాతాల్లో 15 లక్షలు జమ చేస్తామన్న హామీ నేటికి నెరవేరలేదన్నారు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు భర్తీ చేస్తామని, అధికారంలోకి వచ్చాక ఉద్యోగాఒల ఊసే లేదని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఎంపీ రంజిత్రెడ్డిని కాంగ్రెస్ పార్టీ తరపున గెలిపించుకోని దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేద్దామన్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసిన మోడీ ప్రభుత్వానికి అటూ గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వాలను ప్రజలు విమర్శిస్తున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి రంజిత్రెడ్డిని ఎంపీగా ఢిల్లీకి పంపుదామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో అమ్లాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ రవళిగోపికృష్ణారెడ్డి, సామ జగన్రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు మోత్కుపల్లి రాములు, మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, ఎంపీటీసీ రవీంద్రెడ్డి, జిల్లా మత్స్యకార్మిక సంఘం చైర్మన్ మహేందరముదిరాజ్, కొత్త జైపాల్రెడ్డి, నాయకులు కంజర్ల భాస్కర్, గోటికే రమేష్, బోల్ కట్ట సత్యనారాయణ, మర్రి రవీందర్రెడ్డి, గన్నెపాగ నర్సింగ్రావు, బాత్కు అంతయ్య, మంగలి అంతయ్య, బొర్ర సురేష్ గౌడ్, సంజీవరెడ్డి, వెంకట్ రెడ్డి, మాడి జైపాల్ రెడ్డి, బాకారం గ్రామ అధ్యక్షుడు బంది అనిల్ ముదిరాజ్ రాములు జైపాల్ రెడ్డి, తోక రామయ్య, నాయకులు పాల్గొన్నారు.

టొరంటోలో జరిగిన క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో భారత్‌కు చెందిన 17 ఏళ్ల గ్రాండ్‌మాస్టర్ డి గుకేశ్ విజయం సాధించి చరిత్ర సృష్టించాడు.

ఇంకుడు గుంతల నిర్మాణంపై జలమండలి శిక్షణ

- ఈపీటీఆర్ఐ ఆధ్వర్యంలో సంయుక్త నిర్వహణ

హైదరాబాద్, ఎప్రిల్ 22 (జనం సాక్షి) : నగరంలో భూగర్భ జలాల్ని పెంచేందుకు జల మండలి, ఈపీటీఆర్ఐ, జీహెచ్ఎంసీ సంయు క్తంగా చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్లంబర్స్, మేస్త్రీలకు నేటి నుంచి 3 రోజుల పాటు (22, 24, 25 తేదీల్లో) శిక్షణ కార్యక్రమాలు నిర్వహించను న్నారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో ఎండీ సుదర్శన్ రెడ్డి మొదటి రోజు శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎండీ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. వాన నీటి సంరక్షణలో ఇంకుడు గుంతల నిర్మాణం ఎంతో ముఖ్య మన్నారు. దీని కోసం ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. అందులో భాగంగానే వాటి నిర్మాణంపై ప్లంబర్స్, మేస్త్రీలకు 3 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వీరంతా ఫ్రంట్ లైన్ వారియర్స్ గా ఉంటారన్నారు. జూబ్లీ హిల్స్ లో జలమండలి నిర్మించిన రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ థీమ్ పార్క్ ను ఈ సందర్భంగా గుర్తు చేశారు. అందులో వాన నీటిని ఒడిసి పట్టే వివిధ పద్ధతుల్ని చర్చించారు. శిక్షణ తీసుకుంటున్న వారు ఒకసారి ఆ పార్క్ ను సందర్శించాలని సూచించారు. మిగిలిన 24, 25 తేదీల్లో శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు 8639619366 ఫోన్ నంబరు ద్వారా లేదా.. eptrienviro@gmail.com కి మెయిల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, రెవెన్యూ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, జీఎం రాజేందర్, ఇంకుడు గుంతల నిర్మాణ ప్రత్యేకాధికారి జాల సత్యనారాయణ, రిసోర్స్ పర్సన్ కల్పన, ప్లంబర్స్, మేస్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్
ప్రభుత్వంపై తిరుగుబాటు యాత్ర చేస్తాం

నాగర్ కర్నూల్ ఆర్సీ ఏప్రిల్ 22(జనంసాక్షి): తెలంగాణ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రామన్న మాదిగ అదేశాల మేరకు నాగర్కర్నూల్ జిల్లా కేంద్రంలోని విలేకర్ల సమావేశం నిర్వాంచడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా తెలంగాణ దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్. కల్మూరి రాములు మాదిగ హాజరై మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలను మోసం చేస్తూ మూడు పార్లమెంట్ స్థానాలకు గాను. ఒక్క స్థానం కూడా ఇవ్వకుండా మోసం చెయ్యడం జరిగింది. అదే విదంగా కంటోన్మెంట్ జరిగే ఉప ఎన్నికలో మాదిగలకు ఇవ్వకుండా మోసం చెయ్యడం జరిగింది. రాష్టంలోని కేంద్రం లోని కాంగ్రెస్. బిజెపి పార్టీలు భారత రాజ్యాంగాన్ని మార్చాలని ఆలోచలనో ఉన్నవి కాబట్టి తెలంగాణ మాదిగ ప్రజలారా కాంగ్రెస్ పార్టీకీ ఓటు వేస్తె బిజెపికీ ఓటు వేసినట్లే అందుకుగాను. ఆలోచించి నిజమైన వ్యక్తి తెలుసుకుని ఓటు వెయ్యగలరని కోరుచున్నాము. ఈ కార్యక్రమలో తెలంగాణ దండోరా రాష్ట్ర ఉప అధ్యక్షుడు మంతటి గోపి మాదిగ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దర్శనాల సాయి కుమార్ మాదిగ, తెలంగాణ నాగర్కర్నూల్ జిల్లా అధ్యక్షకుడు ఎల్లపాగా జాన్ మాదిగ, అవసలీకుంత సైదులు పాల్గొనడం జరిగింది.

మహిళా కాంగ్రెస్ కార్యాలయాన్ని
ప్రారంభించిన పట్నం సునీత మహేందర్ రెడ్డి

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 22 (జనం సాక్షి) : కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజుల రామారం డివిజన్ పరిధిలోని దేవేందర్ నగర్ లో మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ మహిళా కాంగ్రెస్ ఆఫీసును పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి, కోలను హనుమంత రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గత 10 సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో మల్కాజ్గిరి పార్లమెంటు పరిధిలో ఎలాంటి అభివృద్ధి జరగలేద న్నారు. రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మీ, ప్రధాన కార్యదర్శి రఫీయా బేగం ,నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కులం రాజశేఖర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జేమ్స్, తమ్మని శ్రావణ్, సంజీవరెడ్డి ,ఎండి నాయక్, శ్రీధర్ రెడ్డి, ఆరిఫ్, హర్షిత్ బేగ్, రెహనా బేగం, శ్రీలత, ఫరాహీం, గఫార్, రహీం, కలీం, అజయ్, అనిల్ రెడ్డి, అజీమ్, ఎన్ఎస్యుఐ నాయకులు, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ప్రజల గొంతునవుతా

- 'జనంసాక్షి'తో పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ

(ప్రత్యేక ప్రతినిధి / జనం సాక్షి)

పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడిగా తనను ఆశీర్వదించి, తనకు ఓటు వేసి గెలిపించి పంపితే మన పార్లమెంట్‌లో సకల జనుల గొంతును అవుతానని కాంగ్రెస్ పార్టీ నుంచి పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి గడ్డం వంశీ వెంకటస్వామి తెలిపారు. తనకు తన తాత, మాజీ కేంద్రమంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం ప్రజల గుండె చప్పుడు కాకా గడ్డం వెంకట స్వామి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు సేవ చేయాలని ఉందంటున్నాడు వంశీ!

ఆయన మాటల్లో... నేను ఒక స్వతంత్ర ఆలోచనలు కలిగిన యువకుడిని. కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా దేశం, రాష్ట్రం, ప్రగతిని సాధించాలని కోరుకుంటున్నాను. ఆశయం తప్ప, ఆశలు లేవు! నిస్వార్థ ప్రజా సేవ చేయాలనే ఆశయం, లక్ష్యం తప్ప వేరే ఆలోచన లేదు. నాకు ఆశలు లేవు! పెద్దపల్లి పార్లమెంట్ పరిధి లోని పెద్దపల్లి, రామగుండము, మంథిని, బెల్లంపల్లి, ధర్మపురి, మంచిర్యాల, చెన్నూర్ అసెంబ్లీ పరిధిలోని సకల జనుల ప్రజలు ఒక ఎంపీ ద్వారా ఆశించే ప్రతీ పని పైన దృష్టి పెట్టి, అభివృద్ధి, సంక్షేమం కోసం పాటు పడుతాను. నియోజకవర్గం ప్రజలు నా ఊపిరిగా భావిస్తున్నాను. నేనొక నిత్య విద్యార్తిని! సేవకుడను! ఈ సభ్య సమాజం చాలా పెద్దది. ఇందులో నేను కొన ఊపిరి దాకా నిత్య విద్యార్థినే, సేవకుడినే! అందుకే అన్ని వర్గాల ప్రజలకు సేవ చేయడం కోసం వచ్చాను! నేను ఒక ప్రాక్టికల్ మనిషిని! అన్ని దుఃఖంలు, కష్టాలు తెలిసిన వాడిని!

కొత్త బొగ్గు బావులు, ఉద్యోగాలు లక్ష్యం!

నా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో సింగరేణి కార్మికుల, వారి కుటుంబాలకోసం అంకితం అయి పని చేస్తాను. సింగరేణి కి మరో వంద ఏండ్ల భవిష్యత్తు ఉన్నది. గోదావరి తీరం లో 10 వేల మిలయన్ టన్నుల బొగ్గు తవ్వి తీయాల్సి ఉన్నది. ఇందుకు కొత్త బొగ్గు బ్లాకులు రావాలి. కొత్త బొగ్గు బ్లాకులు సాధించడం తో పాటు అందులో ఉపాధి కల్పించడం కూడ నా లక్ష్యంగా పెట్టు కున్నాను. అలాగే బొగ్గు గని కార్మికులకు ఐటి స్లాబ్ పెంచడం కోసం, కోల్ బెల్ట్ లోని ఇతర ఎంపీ లతో కలిసి, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గారి మద్దతుతో కృషి చేస్తాను. కార్మికులం దరికి రిటైర్డ్ మెంట్ నాటికి స్వంత ఇల్లు ఉండే విధంగా స్థలం, ఇల్లుకు రుణం ఏర్పాటు కు కృషి చేస్తాను. సింగరేణి ప్రాంతం లో సూపర్ స్పెషాలిటి ఆసు పత్రి ఏర్పా టుకు కృషి చేస్తాను. గని కార్మికులే కాదు, పెద్దపల్లి పార్లమెంట్ పరిధి లోని ఎన్టిపీసీ, ఎస్టిపిపి, ఒరియంట్, బసంత్ నగర్ సిమెంట్స్,ఆర్ఎఫ్సిఎల్, సిరామిక్స్ ఉద్యోగుల, కార్మికుల సంక్షేమం,కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు లభించే విధంగా, వారి సంక్షేమం కోసం కూడ కృషి చేస్తాను. నిరుద్యోగులకు మొదటి ప్రాధాన్యత ను ఇస్తాను. ప్రభుత్వం ద్వారా, తన వ్యక్తిగతంగా ఉపాధి కి అవకాశాలు మెరుగు పరుస్తాను. రైతులు, మన ఊపిరి లాంటి వారు, అన్న దాతల దేశం ఇది, వారి సంక్షేమం కోసం కృషి చేస్తాను. కాంగ్రెస్ పార్టీ కేంద్రం అధికారంలోకి రాగానే ఇచ్చిన ప్రతీ హామీ ని అమలు చేయించడానికి కృషి చేస్తాను. మహిళలకు ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్ అమలు, పేద కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ప్రతీ ఏడు లక్ష రూపాయలు వేసే స్కీమ్ లు అమలు చేస్తాము! మొత్తంగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం ను దేశం లోనే ఒక ఆదర్శ నియోజకవర్గం గా తీర్చి దిద్దడానికి కృషి చేస్తాను.

విద్యా, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, పారిశుద్యం, కొత్త బొగ్గు బావులు, విద్యుత్ ప్రాజెక్ట్స్ విస్తరణ లక్ష్యంగా ముందుకు సాగుతాను! అంటూ ఆయన ముగించాడు. వంశీని, ఆయన మాటలను, ఉపన్యాసంను, ఆయన ఒక సామాన్యుడిగా జనం లో మమేకం అయిపోతూ, కలివిడిగా, కదులుతున్న తీరును సకల జనులు ఎంతో ప్రేమ, ఆప్యాయత తో స్వీకరిస్తూ, ఆహ్వానిస్తున్నారు. ఇదంతా వంశీ గెలుపుకు సంకేతం గా పేర్కొనక తప్పదు.

మనిషి తనం ఉట్టిపడే మనిషి వంశీ

మనిషి తనం ఉట్టిపడే మట్టి మనిషి గడ్డం వంశీ! మాజీ కేంద్ర మంత్రి, కాకా గడ్డం వెంకటస్వామి మనవడు, ప్రస్తుత చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కుమారుడు గడ్డం వంశీ వెంకటస్వామి ఒక స్వతంత్రంగా ఒక ఎలక్ట్రిక్ బైక్ తయారు చేసాడు, సోలార్ పై కప్పు ను తన స్వంత తెలివి తేటలతో తయారు చేసాడు. ప్రపంచం లోనే ఇలాంటి ది తయారు చేసిన మొదటి వ్యక్తిగా, ఆయనకు ప్రపంచ స్థాయిలో ప్రతిష్టాత్మాక, రెండు అవార్డు లు వంశీకి లభించాయి. 15 ఏండ్లుగా ఒక సక్సెస్ ఫుల్ వ్యాపార వేత్తగా వంశీ రాణిస్తున్నాడు. వాళ్ళ నాన్న వివేక్ వెంకట స్వామి లాగే మానవీయ కోణం ఉన్న మనిషిగానూ వంశీకి పేరున్నది. పెద్దపల్లి నుంచి పోటీ చేస్తున్న ఇతర అభ్యర్థుల్లో కన్నా వంశీ భిన్నమైన, ఎలాంటి మచ్చ లేని యువకుడు. కాంగ్రెస్ కే కాదు, వంశీ పెద్దపల్లి పార్లమెంట్ కు లభించిన ఆణిముత్యం లాంటి వాడు అనకు తప్పదు! ఆయన తన పరిశ్రమల్లో స్వంతంగా 500 మందికి ఉపాధి కూడ కల్పించడం విశేషం! కాంగ్రెస్‌లో రాజ్య సభ సభ్యుడిగా ఉన్న, కవి, ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్ గడ్, ప్రస్తుతం ఢిల్లీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కనహ్యకుమార్ల మాదిరి కాంగ్రెస్ పార్టీకి వంశీ ఎస్సెట్‌గా పేర్కొనవచ్చు!

ఓరుగల్లు కోటపై పార్టీల దృష్టి

- కడియం, ఆరూరిల ఓటమి ధ్యేయంగా బీఆర్ఎస్ ప్లాన్
- నేడు పార్టీ కార్యకర్తలతో భేటీ కానున్న కెటిఆర్

వరంగల్ బ్యూరో, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ప్రధాన పార్టీలె గెలుపు కోసం కసరత్తు చేస్తున్నాయి. వరంగల్ లోక్ సభ స్థానం ఎస్సీ రిజర్వ్డ్ కాగా, ఇక్కడ ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ నుంచి కడియం కావ్య, బీజేపీ నుంచి ఆరూరి రమేశ్, బీఆర్ఎస్ నుంచి మారపెల్లి సుధీర్ కుమార్ పోటీలో నిలిచారు. కాగా, పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు. కడియం కావ్య మార్నింగ్ వాక్ లు నిర్వహిస్తూ ప్రచారాలు చేస్తున్నారు. పార్లమెంట్ నియోజక వర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లవారీగా సోషల్ మీడియా వింగ్‌తో పాటు పార్టీ వివిధ విభాగాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ కూడా ప్రచార దూకుడు పెంచారు. ప్రత్యేకంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రచార రథాలు రెడీ చేయించి తిప్పుతున్నారు. బీఆర్ఎస్ నుంచి బరిలో నిలిచిన డాక్టర్ మారపెల్లి సుధీర్ కుమార్ మాత్రం పార్టీ మీటింగులకే పరిమితం కాగా, నామినేషన్ వేసిన తర్వాత నుంచి ప్రచార కార్యక్రమాలు హోరెత్తించనున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. ప్రధానంగా తమ పార్టీని వీడిన ఆరూరి రమేశ్, కడియం కావ్యలను ఓడించడమే లక్ష్యంగా బిఆర్ఎస్ ప్రత్యేక దృష్టి సారించింది. మరోవైపు ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో ప్రధాన పార్టీలు ప్రచారంలో వేగం పెంచాయి. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా, అభ్యర్థులు ఓ వైపు జనాల్లోకి ఉరుకులు, పరుగులు పెట్టడంతో పాటు చేరికలు, నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతో వరంగల్ లో ప్రచార వేడి మొదలవగా.. ఎంపీ టికెట్ గెలవడమే లక్ష్యంగా ప్రధాన పార్టీల అగ్రనాయకులు ఓరుగల్లు బాట పడుతున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, కాంగ్రెస్ తరఫున సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ లో రోడ్డు షోలు, ప్రచార సభలు నిర్వహించనుండగా, ఏప్రిల్ నెలాఖరులో బీజేపీ అగ్రనేతలు పర్యటించనున్నారు. ఇలా ప్రధాన పార్టీల అగ్రనేతలు ఓరుగల్లు బాట పడుతుండటంతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కుతోంది. కడియం పార్టీ మార్పు తర్వాత కాంగ్రెస్, బీఆర్?ఎస్ మధ్య తీవ్ర వైరం ఏర్పడగా, ఎలాగైనా కడియంను ఓడగొట్టాలని గులాబీ పార్టీ కసిగా ఉంది. ఈ నేపథ్యంలోనే పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్?ను వరంగల్ కు తీసుకొచ్చి ఇక్కడి పరిస్థితులను చక్కదిద్దుకోవాలని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 23న మాజీ మంత్రి కేటీఆర్ వర్ధన్నపేట కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని, కార్యకర్తలకు దిశా నిర్దేశర చేయనున్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ 28న వరంగల్ లో రోడ్డు షో నిర్వహించనున్నారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం 24న మడికొండలో నిర్వహించే ప్రచార సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కు చెందిన వారే ఉండటం, ప్రజల్లో కూడా సానుకూల స్పందన ఉందనే ఉద్దేశంతో ఇక్కడి నేతలున్నారు. ఈ తరుణంలో సీఎం సభ మరింత కలిసి వస్తుందనే భావనలో ఉన్నారు. వరంగల్ ఎంపీ సీటుపై ఆశలు పెట్టుకున్న బీజేపీ ఇక్కడికి పార్టీ అగ్రనేతలను తీసుకొచ్చే ప్లాన్ చేస్తోంది. ఈ నెల 24న బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ నామినేషన్ వేయనుండగా, కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వస్తారని అందరూ భావించగా, ఆయన పర్యటన రద్దయినట్లు తెలిసింది. దీంతో 25న కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఇక్కడికి తీసుకొచ్చేందుకు నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు ఈ నెల 27న ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ కు రానుండగా, ఆయనను వరంగల్ కు తీసుకురావాలని ఇక్కడి నాయకులు భావిస్తున్నారు.

స్వామి ఆశీస్సులతో ఎంపీగా విజయం సాధిస్తా

- భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : తనకు యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆశీస్సులు మెండుగా ఉన్నాయని, స్వామి వారి దయతో పార్లమెంట్ ఎన్నికల్లో తప్పక విజయం సాధిస్తానని భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ అన్నారు. సోమవారం ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి క్యామ మల్లేష్ తమ కుటుంబ సమేతంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం క్యామ మల్లేష్ మాట్లాడుతూ నియోజవర్గ ప్రజల అండ, స్వామి వారి ఆశీస్సులు మెండుగా ఉన్నాయన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు పదేళ్ల బీఆర్ఎస్ పాలనను నేటికీ గుర్తు చేసుకుంటున్నారని, కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయన్నారు. ఎంపీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుస్తుందన్నారు.

నేడు హనుమత్ జయంతి

- శోభాయాత్రకు భారీగా ఏర్పాట్లు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : మంగళవారం హనుమాన్ జయంతిసందర్భంగా హైదరాబాద్ నగరంలో హనుమాన్ జయంతి శోభా యాత్ర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ క్రమంలోనే ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. రేపు ఉదయం 11:20 గంటలకు ఆంజనేయుని శోభా యాత్ర ప్రారంభం కానుంది. ఈ ఊరేగింపు గౌలిగూడ రామ మందిరం నుంచి ప్రారంభమై.. తాడ్‌బండ్ సికింద్రాబాద్ మీదుగా గౌలిగూడ రామమందిరం, పుత్లిబౌలి క్రాస్ రోడ్, ఆంధ్రాబ్యాంక్ క్రాస్ రోడ్, కోఠి, సుల్తాన్ బజార్, రాంకోటి, కాచిగూడ, నారాయణగూడ, చిక్కడపల్లి మీదుగా కొనసాగనుంది.

తెలంగాణలో బీజేపీ క్లీన్‌స్వీప్ ఖాయం

- ఎన్డీయే కూటమికి 400కు పైగా సీట్లు వస్తాయ్
- వికసిత్ భారతే లక్ష్యంగా పని చేస్తున్నాం
- బిబి పాటిల్ నామినేషన్ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



సంగారెడ్డిప్రతినిధి, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ లో బాజాపా క్లీన్ స్వీప్ చేస్తుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జహీరాబాద్ బిజెపి ఎంపీ అభ్యర్థి బిబి పాటిల్ నామినేషన్ దాఖలు చేశారు. అంతకు ముందు బిబి పాటిల్ గణేష్ దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నామినేషన్ అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళల కోలాటం, బోనాలు, డబ్బు చప్పులతో భారీ ర్యాలీ చేపట్టి సంగారెడ్డి లో పీఎస్ ఆర్ గార్డెన్ లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కేంద్రమంత్రి పీయూష్ గోయల్, ఎంపి బిబి పాటిల్, జతీయ ఓబీసీ అధ్యక్షులు లక్ష్మణ్ , ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి లు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీయూష్ గోయల్ మాట్లాడుతూ దేశంలో ఎన్డీయే కూటమి 400కు పైగా ఎంపీ సీట్లు సాధిస్తుందని వెల్లడించారు. ఇండియా కూటమిలోని పార్టీల్లో ఐకమత్యం లేదని, ఆ కూటమి ఇంటికి పోవటం ఖాయమని ఎద్దేవా చేశారు. దేశంలో మోడీ హవా నడుస్తోందని, ప్రధాన మంత్రి మోడీ పాలనలో ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయని, మూడోసారి మోడీ ప్రధాని అవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వికసిత్ భారత్ లక్ష్యం గా పని చేస్తున్నామని చెప్పారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ను గత పదేళ్లుగా ఎంతో అభివృద్ధి చేసిన బిబి పాటిల్ ను భారీ మెజారిటీతో గెలిపించి మోడీ కి బహుమతిగా అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు అరుణ తార తదితరులు పాల్గొన్నారు.

బిజెపి పార్లమెంట్ అభ్యర్థిగా బేబీ పాటిల్ నామినేషన్ దాఖలు

భారతీయ జనతా పార్టీ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకుంటుందని జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్ ధీమా వ్యక్తం చేశారు. జహీరాబాద్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థిగా బి బి పాటిల్ తన నామినేషన్ జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతికి సోమవారం సమర్పించారు. తాను జహీరాబాద్ పార్లమెంట్ నుంచి విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా భారతీయ జనతా పార్టీ కమలం గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట కేంద్రమంత్రి పియుష్ గోయల్,కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి,బజెపి జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి ఉన్నారు.

మెదక్ గెలుపు లక్ష్యంగా ప్రచారం

- పాగా వేయాలని కాంగ్రెస్ ఎత్తులు
- ప్రచారంలో దూసుకుపోతున్న రఘునందన్



మెదక్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : మెదక్ లోక్‌సభతో పాటు, జహీరాబాద్ లోక్‌సభ గెలుపుపై సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆయన ఈ రెండు సీట్లను గెలిపించుకునే లక్ష్యంతో పగలనక, రాత్రనక కష్టపడుతున్నారు. ఈ రెండు స్థానాలు ప్రతిష్టాత్మకంగా మారడంతో ప్రచార హోరు పెంచారు. సిద్దిపేట జిల్లా నుంచే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తుండడంతో పోలింగ్ రోజు తమ అభ్యర్థికే ఓట్లు పడే విధంగా ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే మూడు నియోజకవర్గాలకు ప్రత్యేకంగా ఇన్ చార్జిలను నియమించడమే కాకుండా మండల స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తు న్నారు. యూత్, స్టూడెంట్, సోషల్ మీడియా విభాగాలకు దిశానిర్దేశంచేస్తున్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో 18.12 లక్షల ఓటర్లుండగా వీరిలో అత్యధికంగా బీసీ వర్గాలే ఉన్నాయి. నియోజకవర్గంలోని ఏడు సెగ్మెంట్లలో బీసీ వర్గాలకు చెందిన ఓటర్లు దాదాపు ఆరు లక్షల పై చిలుకు ఉండడంతో అభ్యర్థులందరూ వారిపై ఫోకస్ పెడుతున్నారు. ఇందులో ముదిరాజ్ వర్గానికి అత్యధిక ఓట్లుండడంతో వారి మద్దతు పొందేందుకు అన్ని పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా ముదిరాజ్ వర్గానికి చెందిన నీలం మధు బరిలో నిలవడంతో ఆ పార్టీ నేతలు దీన్నే ప్రచార అస్త్రంగా మలుచుకుని ప్రజల్లోకి వెళ్తున్నారు.

అలాగే కాంగ్రెస్ కూడా మెదక్ ఎంపి స్థానంపై ప్రత్యే దృష్టి పెట్టింది. బీఆర్ఎస్ కంచుకోటగా ఉన్న సిద్దిపేట జిల్లాపై కాంగ్రెస్ కూడా దృష్టి పెట్టింది. మెదక్ పార్లమెంట్ పరిధిలో ఉన్న సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక అసెంబ్లీ సెగ్మెంట్లను గత ఎన్నికల్లో బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఈ మూడు సెగ్మెంట్లలో అధికంగా ఓట్లను పొందిన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో సైతం విజయానికి బాటలు వేయాలని ప్రయత్నిస్తోంది. మరోవైపు కాంగ్రెస్ సైతం ఈ ఎన్నికల్లో ఎక్కువగా ఓట్లు సాధించడానికి పావులు కదుపుతోంది. ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో పాటు ముఖ్య నేతలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. బీసీల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టిన విషయాన్ని బీఆర్ ఎస్ నేతలు ప్రచారాల్లో ప్రస్తావి స్తూ ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఓబీసీ బిడ్డను మూడోసారి దేశానికి ప్రధాని చేయాలని బీజేపీ అభ్యర్థిస్తోంది.

సిద్దిపేట నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే, మైనంపల్లి హన్మంతరావుకు బాధ్యతలు అప్పగించారు. నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థి మెజార్టీ సాధిస్తే నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం దక్కుతుందని హామీ ఇస్తున్నారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు అన్నీ తానై ప్రచార వ్యూహాలతో ముందుకు వెళ్తున్నారు. నియోజకవర్గ స్థాయి నేతలను కలుపుకుని రోడ్డు షోలు, మార్నింగ్ వాక్ లు, ఇంటింటి ప్రచార కార్యక్రమాలతో ప్రజలను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ నివాసంలో సోదాలు

- హన్మకొండ, సూర్యాపేట నివాసాల్లో తనిఖీలు

వరంగల్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : మహబూబాబాద్ సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ నివాసంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు సోదాలు చేపట్టారు. హనుమకొండలోని ఆమె ఇంటితోపాటు సూర్యాపేటలో నివాసముంటున్న తస్లీమా భర్త ఇంట్లో కూడా తనిఖీలు చేస్తున్నారు. గత నెల 22న లంచం తీసుకుంటూ తస్లీమా ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన గుండగాని హరీశ్ తన 128 గజాల స్థలానికి రిజిస్ట్రేషన్ కోసం మార్చి నెల మొదటి వారంలో సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్‌ను సంప్రదించాడు. ఆమె సూచన మేరకు కార్యాలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఆలేటి వెంకటేశ్‌ను కలువగా.. ప్రభుత్వ ధర ప్రకారం గజానికి రూ.100 ఉంటుందని, కానీ ఇక్కడ మాత్రం గజానికి రూ.200 చొప్పున ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని వెంకటేశ్ చెప్పాడు. దీంతో హరీశ్ మళ్లీ సబ్ రిజిస్ట్రార్‌ను కలిశాడు. మొత్తం రూ.19,200 ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పింది. వెంటనే ఆయన వరంగల్ ఏసీబీ అధికారులను సంప్రదించాడు. ఒప్పందంలో భాగంగా హరీశ్ గత నెల 22న కార్యాలయానికి వెళ్లి సబ్ రిజిస్ట్రార్ తస్లీమాకు డబ్బులు ఇవ్వబోయాడు. ఆఫీస్‌లో పనిచేసే వెంకటేశ్‌కు ఇవ్వాలని ఆమె సూచించడంతో బాధితుడు హరీశ్ రూ.19,200ను వెంకటేశ్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వెంకటేశ్ వద్ద రూ.19,200లతోపాటు అదనంగా 1.72 లక్షలు లభించాయి. కార్యాలయంలో కూడా సోదాలు నిర్వహించారు. తస్లీమాతోపాటు అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వెంకటేశ్‌పై కేసు నమోదు చేశారు. తస్లీమాకు ఉద్యోగం వచ్చిన తర్వాత ములుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్ గా 12 ఏండ్లు అక్కడే విధులు నిర్వహించింది. గత ఏడాది బదిలీల్లో భాగంగా మహబూబాబాద్‌కు వచ్చింది. ప్రభుత్వ సెలవులు వస్తే చాలు మహిళలతో కలిసి నాట్లు వేయడం, పత్తి ఏరడం, మిర్చి తెంపడం వంటి కార్యక్రమాలు చేస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటుంది. కార్యాలయానికి వచ్చే సమయంలో ఆటో, బస్సు, ద్విచక్ర వాహనాల్లో ప్రయాణం చేస్తూ ప్రచారం చేస్తుంది. ఈమె ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి అనాథ పిల్లలకు దుస్తులు పంపిణీ చేయడం, ఎవరైనా మరణిస్తే వారి ఇంటికి వెళ్లి 25 కిలోల బియ్యం బస్తా, నగదు ఇచ్చి ఫొటోలు దిగడం వాటిని సోషల్ మీడియాలో షేర్ చేయడం చేస్తుంటుంది. తస్లీమా మరో కోణంలో రాజకీయ నాయకులకు, ప్రజా ప్రతినిధులతో సెల్ఫీలు దిగుతూ బాబాయ్, తమ్ముడు అంటూ వరుసలు కలిపేస్తుంది. ఏసీబీ అధికారుల దాడుల్లో తస్లీమా అసలు నైజం బయటపడింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Sy.No. 210, Padmanagar, Chinthakunta, Karimnagar Dist, Telangana - 505462 Published at Janam Sakshi Office, Bawazeer Estate, Beside HUDA High School, Civil Hospital Road, Karimnagar - 505001, Telangana. Editor : M.M.RAHMAN RNI No. APTEL/2002/12105